# ఆంధ్రవీరులు

గ్రంథకర్తలు:

శ్రీ శేషాద్రి రమణకవులు.

(శతావధానులు)

వేంకటరామ్ అండ్ కో.,
బెజవాడ.

ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
క. కోదండరామయ్యగారిచే
ముద్రింపబడియె.

1949.

సర్వస్వామ్యసంకలితము] [వెల ౧౦ అణాలు.

# విషయసూచిక.


| | పుట |
|---|---|
| 1. చాణక్యుడు | 1—1 |
| 2. గౌతమీపుత్ర శాతకర్ణి | 5—2 |
| 3. కులోత్తుంగ చోడుడు | 22—3 |
| 4. బాలచంద్రుడు | 32—4 |
| 5. ఖడ్గ తిక్కన | 50—6 |
| 6. ప్రతాపరుద్ర చక్రవర్తి | 60—7 |
| 7. కృష్ణదేవరాయలు | 77—10 |
| 8. రామరాజు | 101—11 |
| 9. యాచ శూరుడు | 116—12 |
| 10. అక్కన్న, మాదన్న | 126—13 |

# పీఠిక.

సహృదయులారా!

ఆంధ్రవీరరత్నావళి యను పేరుతో ఆంధ్రులందుఁ బ్రసిద్ధులైన లోకోత్తర పురుషుల జీవితములు కథలుగ వ్రాసి బాలురకు విద్యార్థిదశలోనే మాతృదేశాభిమానము గలిగించుట యుచితమని యీ పుస్తకమును వ్రాయ దొరకొంటిమి. మాయుద్యమము వే. సత్యనారాయణమూర్తి గారి వలన విని వేంకటరామన్ అండుకో వారు తాము స్వయముగఁ బ్రకటించి కొందుమనియుఁ ద్వరగాఁ బూర్తిచేయుమనియుఁ, బ్రోత్సహించిరి. వారి యాదరణము వలనఁ గాని యున్నత పాఠశాలయందలి నా పండిత పదవి యందలి యనుభవమును నుపయోగించుకొని యీ చరిత్ర కథాగ్రంథమును గదించితిమి.

విస్మృతులగు నాంధ్రదేశమునందుఁ బలువురు మహనీయు లుద్భవించిరి. వారి త్యాగదీక్ష, శౌర్యము ప్రపంచమునందలి యేజాతి నాయకులకుఁ దీసిపోవదనుట కిది మాత్రము సాక్ష్యము గాఁగలదు. ఆంధ్రవీరుల పరాక్రమము, రాజ్యవిస్తృతి, పతనము క్రమముగా నీ పుస్తకమందు దెలుపఁబడినవి. ఆంధ్రుల చరిత్రము చాల వఱకుఁ బాడుపడి యొకటిగాని నిక్షిప్తముగ నున్నదనుటకుఁ, శాతవాహనుల చరిత్రమును దారాళముగఁ దీసికొనవచ్చును. తరువాతి యాంధ్రుల జాతీయతా ధర్మనిర్వహణ ప్రతిభను దెలిపిన మహోత్తరమగు నభ్యున్నతికి కాకతీయ ప్రతాపరుద్రుని చరిత్రము దృష్టాంతము. తరువాతఁ బిమ్మట రాజులు, రాష్ట్రకూటులు తెలుఁగుఁ దాము పోరాడుకొనుటయుఁ దోడులు విజృంభించుటయుఁ జరిత్ర విశేషములు. వీనిని గమనించితిమేని యఖిల నాంధ్రదేశము నంతయు నేకఛత్రముగఁ బాలించిన వీరుఁడు కులోత్తుంగ చోళదేవుఁడు. తుదకు ... ఆంధ్రదేశమును జీలికలు గావించుకొని

చిన్న చిన్న రాజులు పాలించుటయుఁ బ్రజలలో స్వాతంత్ర్యభావ ముద యించి తమలోఁ దామె పోరాడుకొనసాగిరనుటకు బాలచంద్రుఁడు ఖడ్గ తిక్కనల చరిత్ర నుదాహరణముగఁ గొనవచ్చును. చీలిపోయిన యాంధ్ర దేశమును కేంద్రీకరించి స్వతంత్రమగు సామ్రాజ్యమును నిర్మించి సుస్థిర ముగాఁ బాలించిన మహోదారుఁడు ప్రతాపరుద్ర చక్రవర్తి. ఈతని కాలమునకే సమస్త కళలు, భాష, ఆంధ్రజాతియొక్క అభివృద్ధికి వచ్చినవి. పరాధీన దుర్దశ ప్రాప్తింపవలసి యుండుటచే ఈ చక్రవర్తి బందీకృతుఁడు గావలసివచ్చినది. ఈయన యనంతరము దేశీయవీరులు చిన్న చిన్న రాజ్య ములు స్థాపించి దేశముల నభివృద్ధిమార్గముల నన్వేషించిరో ప్రాచ్యప్రా విరు తెలుగుల సామ్రాజ్య నిర్మాణమునకుఁ బూనుకొనిరో తెలిసికొనుటకు హరిహరరాయల బుక్కరాయల మాధవవిద్యారణ్యుల చరిత్ర సంగ్రహము సాధనము కాఁగలదు. ఆంధ్రసామ్రాజ్యము పునరుద్ధరించి తనకె దురులేకుండఁ బోయినంత వెల్ల జయము నొంది దక్షిణాంధ్రహిందూ దేశములను లోఁగొని అంద్రదేశము యవనులపాలుగాకుండఁ గాపాడినది శ్రీకృష్ణదేవరాయలు.

ఈ మహాత్ముని సాహిత్యసేవ, దేశసేవ, మాతృదేశాభిమానము నద్వితీయము. సమగ్రముగ సాంధ్రత్వ సంపదయు నితనియొద్ద నుండి నిండికొ యెను. ఆంధ్రుల పతనమునకు సూచనలు కృష్ణదేవరాయల తుదికాలమున ందే యేర్పడెను. తరువాత సికిందరుషాలతో హిందూ మహ మ్మదీయులకు రాజకుటుంబమునకుఁ గలతలు సంభవించెను. అప్పుడింతటిని సవరించి రాజ్యము పునరుద్ధరించినవాఁడు రామరాజు. పూర్వులకంటె నీతఁ డత్యున్నతి వహించెను గాని యాతఁడు ఘోర మృత్యుముఖమున బడవలసి వచ్చుటతో సాంధ్రుల సంపద, పెంపు, ఉన్నతి నశించెను, ఇవియే పరాధీనతకు మొదటి దినములు. తరువాత ఎంత వీరులు చేసిన స్వతంత్రరాజ్యము స్థాపింప వీలు లేకపోవుటయేఁ బరవశ్యగామునకు క్రమము

ష్టులయు ధర్మ సంస్థాపనార్థము వీర లాత్మార్పణము గావించుటయు యాచకూరుని చరిత్రమువలనఁ దెలియును. అంతటితో ఆంధ్రుల స్వాతంత్ర్య వికాసము కడబట్టి చిన్న చిన్న జమీనులతోఁ దృప్తిపడవలసి వచ్చినది. మొగలు రాజ్యములలో నొకటగు గోలకొండ రాజ్యమునందు మంత్రులుగ నుండి ఆర్యధర్మములను యవనులు ద్రోహము గావింపకుండఁ జెల్లెలి కట్ట వలె నడుమపడి మంత్రిపదవిని నామమాత్రముగా నుంచుకొని ఆంధ్రదేశము నేకహేలగఁ బాలించిన యక్కన్న మాదన్నలనాఁడు మరల నాంధ్ర వికాసము తలయెత్తినది. దురాగతులగు రాజద్రోహులచే వీరుల ఘోరముగా అక్కన్న మాదన్న లేనాఁడు గోలకొండ రాజవీధిలోఁ జంపఁబడిరో ఆంధ్రజాతియు పతనము దర్శింపజాలక యాత్మ రక్తముతో నాంధ్రమాతపదము లభిషేకించి రోనాఁడు అక్కన్న మాదన్నల త్యాగము ప్రకటించిరో యానాఁటితో నాంధ్రులు చరిత్రశూన్యులై పూర్వ వికాసము నంతయుఁ గోలుపోయిరనియు నాఁటినుండి స్వతంత్ర రాజ్యస్థాపనకుఁదగు వీరుఁడు జనింపలేదనియు జెప్పఁగనగును.

ఈవిధముగాఁ గ్రీస్తుశకము పూర్వమునుండి పదునెనిమిదవ శతాబ్దము వఱకు గల సంగ్రహచరిత్ర యీగ్రంథమున నిముడ్పఁబడెను. ప్రకాశకులు తీవ్రతముగ ఆంధ్రవీర రత్నావళి అనుటకంటె ఆంధ్రవీరు లనుట యుక్తమని పేరు మార్పుటలో స్వతంత్రించిరి. ఈ చిన్ని పుస్తకము ఆంధ్రుల హృదయమున నాంధ్రప్రతిభను ద్యోతకము చేయఁగలిగిన ధన్యులము. గ్రంథము గ్రాంథికభాషలోఁ జరిత్రానుకూలముగ వ్రాసితిమని పాఠకులకు విన్నవించుచున్నారము.

ఇట్లు భాషాసేవకులు
శేషాద్రి రమణకవులు.
శతావధానులు.

నందిగామ
23—4—1947

శ్రీ ర స్తు.

# ఆంధ్ర వీరులు.

## 1. చాణక్యుఁడు.

భరతఖండమునందలి దేశములన్నిటిలో మగధ మిగులఁ బ్రసిద్ధమైనది. మగధదేశము చిరకాలము వీరాధివీరులు, పరాక్రమశాలులు, ధర్మస్వరూపులు నగు రాజులకు రాజధానిగ నుండెను. పాండవులను శ్రీకృష్ణుని ఉత్తలూపిన వీరవతంసు డగు జరాసంధుని రాజధాని యీ మగధదేశమందలి గిరివ్రజము. దీని చెంతనే బింబిసారుఁడు రాజగృహ మను నగరమును నిర్మించెను. తరువాతఁ గొంతకాలమునకు అజాతశత్రుఁడు రాజ్యమునకువచ్చి గంగాతీరమునందున్న పాటలిగ్రామము నొద్ద చెంత గొప్ప దుర్గమును గట్టెను. అతని మనుమఁడగు ఉదయనుఁడు పాటలీదుర్గముచెంత పాటలీపుత్రమను గొప్పనగరము నిర్మించెను.

పాటలీపుత్రము గంగ, శోణ, గోగ్రి మొదలగు నదుల సంగమస్థలముచెంత నిర్మింపబడెను. బుద్ధాది మహానుభా

లచే నీ పాటలీపుత్రము పవిత్ర మొనర్పఁబడియెను. మన కథాకాలమున నీరాజ్యమును మహాపద్మనందుఁడు తన యెనమండ్రు కుమారుల సాయముతోఁ బాలించుచుండెను. మహాపద్మునకు ఇళ, మురయను నిరువురు రాణులు గలరు. ఇళయందు ఎనిమిదిమంది కుమారులు జనించిరి. మహాపద్మునితోఁ గలిపి వీరిని నవనందు లని యాకాలమునఁ బేర్కొనుచుండిరి. రెండవ భార్యయగు మురయందు జన్మించినవాఁడు చంద్రగుప్తుఁడు. తేజశ్శాలియు బుద్ధిమంతుఁడు నగు చంద్రగుప్తునియెడ సవతియన్న లెనమండ్రును బగబూని యెటులేని మట్టుపెట్ట జూచుచుండిరి. మహాపద్ముఁడు ముదుసలియగుటచేతను జంద్రగుప్తుఁడు మిగులఁ జిన్నవాఁడగుటచేతను, రాజ్యభారమంతయు ఎనమండ్రునందులకుఁ గైవసమయ్యెను. చంద్రగుప్తుని మట్టుపెట్ట నెన్నియో కపటోపాయములను బన్నుచు నందు లెనమండ్రు దురాలోచనముఁ జేయుచుండిరి. చంద్రగుప్తుడు మిగుల శ్రమలందుచు దైవసహాయమున నెటులో యాపదలనుండి గట్టెక్కుచుఁ గాలయాపనము దినమొక యుగముగఁ జేయుచుండెను. కడకుఁ జంద్రగుప్తుఁడు పొట్టకూటికి వెరవుచాలక సత్రాధికారిగనుండి దీనుఁడై కాలము గడపుచుండెను.

నందు లహంకరించి మహామంత్రియు నేర్పరియునగు రాక్షసుని మాటనేని పాటింపక మిగుల స్వతంత్ర భావముతో వర్తించుచుండిరి. ఒక దినమున చాణక్యుఁ డను

ముపకుఁడు పండితవతంసుఁడు నందరాజుల సభకువచ్చి యటగల యొక యున్నతాసనమున నాసీనుఁడై యుండెను. నందులచటకువచ్చి యుత్తమ పీఠమునందున్న యాపేదబాఁపని మిగులఁ దిరస్కారభావముతోఁ జూచి సింహాసనమునుండి వెడలాగిరి. అమాత్యరాక్షసుం డిది యక్రమమనియుఁ బండితులు పూజనీయులనియు బోధించెనుగాని లాభములేకపోయెను. సిగముడి వీడ నున్నతాసనమునుండి లాగఁబడిన చాణక్యుఁడు నందులను గోపముతోఁ దేఱి పాఱఁజూచి “ఓ నందాధములారా! బహుజనమధ్యమునందు నన్నిటు [illegible] మిమ్మిటులే సింహాసనమునుండి లాగి మీతలల మీచే నూడఁదీయఁబడిన మా తలవెండ్రుకల కొనను” అని సభామందిరమును నదలి వెడలిపోయె.

చాణక్యుఁడిటులఁ గోపించిపోవుటఁజూచి చంద్రగుప్తుఁడు మాఱుత్రోవను బోయి యొక యేకాంత ప్రదేశమునఁ జాణక్యునిఁ గలిసికొని సాగిలి నమస్కరించి నందాదులచే దానొందు నవస్థలఁ దెలిపి తన్ననుగ్రహింపుమని వేఁడుకొనెను. చంద్రగుప్తుని లేవనెత్తి చాణక్యుఁ డాదరించి నందరాజ్యమునకు నిన్నుఁ బట్టాభిషిక్తునిగావించుట నా రెండవప్రతిజ్ఞయని నాఁడు మొదలు చంద్రగుప్తుని తనయొద్దనే యుంచుకొని నందకుల నిర్మూలమునకై ప్రయత్నములు చేయుచుండెను.



నాటక్షుండా.

సర్వశాస్త్ర పారంగతుఁడు, రాజనీతివిదుఁడు, దూరాలోచనపరుఁడు నగు చాణక్యుఁడు తన మిత్రుఁడును సహాధ్యాయియు నగు ఇందుశర్మను సమీపించి జరిగిన యంశము తన ప్రతిజ్ఞయుఁ దెలిపి 'నీ వెటులేని క్షపణక వేషముతో అభిచారిక విద్య చే నందులను, రాక్షసుని లోఁగొని యచటి రహస్యములను వారలచే నెఱింగించుచుఁ జంద్రగుప్తునకు నందరాజ్యమును జేరవోయుటకుఁ దోడ్పడు'మని కోరెను. ఇందుశర్మ యటులె యని యంగీకరించి నందుల చెంతకేఁగి చెలిమిగడించి రాక్షసుని చెంతఁ బ్రాపకము నార్జించి తలలో నాలుకవలెఁ గలిసిమెలసి యుండి రాజ్యరహస్యము లన్నియు నెప్పటికప్పుడు చాణక్యున కెఱింగించుచుండెను. చాణక్యుఁడు చంద్రగుప్తుని వెంటఁగొని హిమాలయపర్వత ప్రాంతమునందున్న యరణ్య భాగములను పాలించుపర్వతరాజు చెంతఁ జేరి యతనిస్నేహమును సంపాదించి నందసంహారమున కాతనిఁ బ్రోత్సహించెను. గెలిచిన యెడల నందరాజ్యమునందు సగము పర్వతరాజునకొసంగుటకుఁగూడఁ జాణక్యుఁడు వాగ్దానము గావించెను. జయించితిమేని చాణక్యుని జంద్రగుప్తుని వంచించి నందరాజ్యమునంతయు హరింపవచ్చునని పర్వతరాజు తలంచి సామంతుల యొద్దనుండి మిత్రుల యొద్దనుండి యసంఖ్యాకమగు సైన్యమును రప్పించి చాణక్యుఁడు పెట్టిన సుముహూర్తమున నందరాజ్యముపైకి దాడెడలెను. పర్వతరాజు వెంట నాతని సైన్యము గాక శక, యవన

కిరాత, కాంభోజ, పారసీక, బాహ్లికాది సైన్యములుగూడ వచ్చెను. చాణక్యుఁడు, చంద్రగుప్తుఁడు సైన్యమును మూఁడు భాగములుగా భాగించి తాము చెరియొకభాగమును దీసికొని గండకీప్రాంతమునకుఁ బోయి పాటలీపుత్రమును ముట్టడించిరి. పర్వతరాజు కడమ మూఁడవభాగమును వెంటఁగొని గంగా శోణా సంగమప్రదేశముచెంత పాటలీపుత్రమును ముట్టడించెను. ఇందుశర్మ నందులనందఱఁ జీలఁదీసి చాణక్యునకు మోసముగాఁ బట్టియిచ్చెను. చాణక్యుఁడు ఎనమండ్రు నందులను సంహారించి తన మొదటిప్రతిజ్ఞను నిర్వహించి యప్పుడు తల వెండ్రుకలను ముడిపై చికొనెను.

నందుల నాశముఁ జూచి మంత్రియగు రాక్షసుఁడు మిగులఁ జింతించి చీలిన సైన్యమునంతయుఁ గూడఁబలచి పర్వతరాజు సైన్యముతోఁ బాటలీపుత్రసైన్యమును భయంకరముగా యుద్ధముఁ జేయించెను. నందరాజులమరణము విన్న రాక్షసుని సైన్యము కొంతసేపటికిఁ బర్వతరాజు సైన్యమునకు లొంగిపోయెను. పాటలీపుత్రమునందు అమాత్యరాక్షసున కెక్కుడు పలుకుబడి యుండుటచేతను వెంటనే రాజ్యమునఁ బ్రవేశించినచోఁ జంద్రగుప్తునకైనను దనకైనను నపాయము గలుగవచ్చుననియుఁ బర్వతరాజు నందరాజ్యమంతయుఁ దానే లోఁగొను నేమోయనియు సంశయించి చాణ

క్యుఁడు జయించిన రాజ్యమునఁ బ్రవేశింప నగరబహిర్భాగ
మునఁ బరిజనముతో విడిసి యుండెను.

రాక్షసుఁ డెటులేనిఁ జంద్రగుప్తునిఁ జాణక్యుని జంపఁ
దలంచి మాయోపాయములు దక్క వేఱు గతిలేదని యొక
యుపాయము పన్నెను. రాక్షసుఁ డొకబాలికను విస మల
వాటు చేసి పెంచుచుండెను. ఆబాలిక విసము జీర్ణించుకొనుట
కలవాటుపడి యౌవనవతియై సర్వాంగసుందరియై యుండెను.
ఆసుందరి తాకినయెడ విసముసోఁకి మనుజులు మరణింతురు.
ఆమెను బిలువనంపి రప్పించి తనచెంత విశ్వాసపాత్రునివలె
క్షపణకవేషధారియై వర్తించుచు జీవసిద్ధియను పేరుతోనున్న
ఇందుశర్మను బిలిచి యీబాలికను జంద్రగుప్తునకు నేను సమ
ర్పించితిననియుఁ బరిగ్రహించి మమ్ముల ననుగ్రహింపుమని
యుఁ జెప్పి పంపెను. జీవసిద్ధి 'చిత్త మటులనే కావింతు'నని విష
కన్యను వెంటఁగొని చాణక్యునికడకుఁబోయి జరిగిన యం
మంతయు రహస్యముగాఁ దెలిపి విషకన్యను సమర్పించెను.
నందరాజ్యము నంతయు హరింపనెంచిన పర్వతరాజును జం
నిదియె తరుణమని చాణక్యుఁడు విషకన్యను బర్వతరాజునొద్ద
కుఁ బంపెను. కామాతురుఁడగు పర్వతరాజు విషకన్యనుజూడ
గనే యొడలుప్పొంగి కౌఁగిలించుకొని విసము తలకెక్కి మ
ణించెను. రాక్షసుని యాస యడుగంటెను. నందరాజ్యమునం
తయు హరింపఁదలంచిన పర్వతేశ్వరుఁడు గతించుట చాణక్యు
సంకల్పమునకు సర్వవిధముల సహాయకారి యయ్యెను.

పర్వతరాజుమరణము విని యతనికుమారుఁడగు మలయకేతువు విచారపడుచుండఁ బ్రతిపక్షుల సేనానాయకుఁడగు భాగురాయణుఁడువచ్చి చెలిమి సంపాదించుకొని 'మలయకేతూ! చాణక్యుఁడు నీతండ్రిని జంపించినటులె నిన్నును జంపింప నున్నాఁడు. బ్రదుకఁదలఁచిన నిటనుండి వెడలిపోవుట మంచి'దని తెల్పెను. అతని మోసపుమాటలు నమ్మి మలయకేతువు భాగురాయణుని మంత్రిగఁ జేసికొని తన పర్వత రాజ్యమునకు వెడలిపోయెను.

పర్వతరాజకాలమరణమొందుటయు మలయకేతువు పాఱిపోవుటయుఁ జూచి యిదియె యదనని చాణక్యచంద్రగుప్తులు మంగళవాద్యములతోఁ బాటలీపుత్రమున బ్రవేశించిరి. రాక్షసుఁడు సైన్యములఁ బ్రోత్సాహపఱచి చాణక్య చంద్రగుప్తులబలముమీఁదికిఁ దన బలమును నడపెను. ఉభయబలములకు భయంకరమగు సంగరము జరిగెను. రాక్షసుఁడు ఈయదను గనిపెట్టి నందులపక్షమునఁజేరి, చంద్రగుప్తునకుఁబట్టాభిషేకము చేయరాదని చాటించెను. అంతతోఁ బోక మహానందుని ఒక సురంగమార్గమునఁ దపము జేసికొనుటకుఁ బంపి యతని స్వీకారపుత్రుని రాజ్యమునందుఁ బ్రతిష్ఠింపవలయునని రాక్షసుడు నిశ్చయించెను. చంద్రగుప్తచాణక్యులు పాటలీపుత్రమునఁ బరిచయము సంపాదించుకొనినకొలఁది తన కపకారము కలుగక తప్పదని రాక్షసుఁడు గర్భవతి యగు తన

భార్యను పుత్రుని ప్రాణమిత్రుఁడగు చందనదాసునియింట
రహస్యముగా నుంచెను. తన యంతరంగ మిత్రుఁడగు శకట
దాసునకుఁ గోశాగారమునందలి ధనము నంతయు నొసంగి
నందపక్షమునకు సహాయముచేయు నేర్పాటు చేయించెను.
అంతతోఁ దృప్తినందక చంద్రగుప్తుని మట్టుపెట్టినఁ గాని చాణ
క్యుఁడు లొంగఁడని యమాత్యరాక్షసుఁడు తలంచి దారు
వర్మయను శిల్పిని బిలిపించి చంద్రగుప్తుఁడు నగరమునఁ జేరు
నపుడు ద్వారము కూలునటులఁ జేయుమనెను. ఏనుఁగు నెక్కి
నపుడు చంద్రగుప్తుని చురకత్తితోఁ బొడిచి చంపుమని మా
వటీనిని బ్రోత్సహించెను. రాజవైద్యునితోఁ జంద్రగుప్తునకు
విషప్రయోగము చేయుమనియు, శయనాధికారితో నిదురిం
చునపుడు తలనఱకుమనియుఁ గొందఱు ఘాతుకులను గోడ
సందులలో బంధించి సమయముఁ జూచి చంపుమనియు రాక్ష
సుఁడు కట్టుదిట్టములు చేసెను. చాణక్యుఁడు తన యసాధారణ
ప్రజ్ఞచే రాక్షసుని మాయోపాయములన్నియు గమనించి చం
ద్రగుప్తున కెట్టి యుపాయము గలుగకుండఁ గాపాడి వాం
నెల్లఱఁ జంపించెను. సర్వార్థసిద్ధిని వెదకించి చాణక్యుఁడు కొ
దఱు హంతకులఁ బంపి చంపునటులఁ జేసెను. తన ప్రయత్న
లన్నియు విఫలమగుటయుఁ బర్వతరాజు, సర్వార్థసిద్ధి మరణి
చుటయు మలయకేతువు పాఱిపోవుటయుఁ జూచి రాక్షసుఁ
తానిఁక పాటలీపుత్రమున నున్నఁగా నంతమేమి లాభములేద

సురంగమార్గమున నగరుదాటి పర్వతరాజ్యమునకు వెడలిపోయెను. ఇట్లు రాక్షసుఁడు మలయకేతువు నొద్దకేఁగి యతనితో చాణక్యుఁడె నీతండ్రియగు పర్వతరాజును జంపించెననియుఁ బాటలీపుత్రమును ముట్టడించి తండ్రిని జంపిన పగదీర్చుకొమ్మనియుఁ బ్రోత్సహించెను. మలయకేతువునకు శక, గాంధార, యవన, శచీన, హూణాదిరాజులు సైన్యసహితముగా సాయము రానుండిరి.

చంద్రగుప్తునిఁ బట్టాభిషిక్తునిఁ జేయుటతోఁ దనభారము తీరలేదని చాణక్యుఁడు తలంచి తన యంతరంగ మిత్రుఁడగు జీవసిద్ధిని బిలువనంపి నీవు విషకన్యను బ్రయోగించి పర్వతరాజును జంపితివి గాన రాజ్యమునం దుండఁదగవని వెడలనంపెను. ఈయవకాశమును బురస్కరించుకొని జీవసిద్ధి మలయకేతువును శరణుగోరి రాక్షసునకు మలయకేతువునకు విరోధము కల్గఁగ జేయుచు విషకన్యను బ్రయోగించి రాక్షసుఁడె పర్వతరాజును జంపెనను ప్రవాదము నందందుఁ గలుగఁ జేసెను. జీవసిద్ధి యవకాశమున్నపుడెల్ల నచటి రహస్యములు చాణక్యాదులకు గూఢచారులచేఁ దెలియఁబఱచుచు బయటికి మలయకేతువుపక్షమువానివలె నటించుచుండెను. చాణక్యుఁడు పాటలీపుత్రమున రాక్షసునిపక్షమువారెటనుండిరో తెలిసికొనుటకు జారులను నియోగింప వారు వెదకి వెదకి చందనదాసుని యింటిలో రాక్షసునిభార్యయు బిడ్డలు నుండిరని తెలిపి కపటో

పాయములతోఁ దామార్జించిన రాక్షసుని ముద్రికను జాణ
క్యున కొసంగిరి. చాణక్యుఁడాముద్రికాసహాయమునఁ గొన్ని
పత్రికలను సృష్టించి జీవసిద్ధి చేతికిచ్చి ప్రచారములోనికిఁ
దెప్పించి, రాక్షసునకు మలయకేతువునకు విరోధము కలుగు
నటుల జేసెను. అందుచే మలయకేతువు నిశ్చయించిన దాడియు
విఫలమయ్యెను. రాక్షసునకు మలయకేతువునొద్ద ప్రాపకము
తగ్గెను. తనతండ్రిని రాక్షసుఁడే చంపెనని మలయకేతువు ద్వే
షముగూడ వహించెను. 'మృతినొందిన నందాదుల యాత్మ
శాంతికొఱకుఁ జాణక్యునిగాని చంద్రగుప్తునిగాని సాధింపలే
పోతినిగదా, నేను జీవించి ఫలమేమని రాక్షసుఁడు పరితపించ
చుండెను. రాక్షసుని సాటిలేని చంద్రగుప్తునకు మంత్రినిగా
జేసిన బాగుండునని సర్వవిధములఁ జాణక్యుఁడు ప్రయత్ని
చెనుగాని నందపక్షపాతియగు రాక్షసుఁడందుల కంగీకరింప
పోయెను.

రాక్షసుని లోఁబఱచికొన నేరవుగానక చాణక్యు
కడకొక యుపాయమును బన్నెను. రాక్షసుని భార్యా సు
లు చందనదాసునియింటఁ బాటలీపుత్రమున నుండి. చం
ద్రుఁడు రాక్షసునియెడ భక్తివిశ్వాసములు గలవాఁ
చాణక్యుఁడు చందనదాసుని రప్పించి రాక్షసుని భా
శిశువులఁ దన యధీనము గావింపుమని నిర్బంధించెను. సా
భక్తిపరాయణుఁడగు చందనదాసుఁ డందుల కంగీకరి
తిరుగఁబడుటచే జాణక్యుఁ డాతని కురిశిక్ష విధించెను; తన

రాక్షసుఁడు విని నిరపరాధియుఁ దన ప్రాణమిత్రుఁడు నగు చందనదాసునకుఁ దన మూలమున ఘోరమరణము ప్రాప్తింప నున్నందులకు మిగుల వగచి యెటులేని యంత్యకాలమునందేని పరమ విశ్వాసపాత్రుఁడగు చందనదాసుని గలిసికొని తన ప్రాణము లొసంగియేని యాతనిఁ గాపాడ నెంచి వధ్యస్థానము నకుఁ జేరెను. ఘాంతకులు చందనదాసుని వధ్యస్థానమునకుఁ జేర్చి యురిదీయఁబోవు తరుణమున రాక్షసుఁ డడ్డుపడి నిరప రాధియగు చందనదాసుని వదలి నన్నుఁ జంపుఁడని ముందునకు వచ్చెను. చాణక్యుఁ డిదియంతయు జూచి 'రాక్షసామాత్యా! నీవు చంద్రగుప్తునకు మంత్రిగానుండుటకు ఇష్టపడెద వేని దోషియగు చందనదాసుని వదలుదుము. లేకున్న నురిదీయక తప్ప దని చెప్పెను. మిత్రసంరక్షణమె తన కవశ్యకర్తవ్యము గావున విధిలేక రాక్షసుఁడు చంద్రగుప్తునకు మంత్రిగానుండుట కంగీక రించెను. చంద్రగుప్తుఁడు రాజనీతివిశారదుఁడగు రాక్షసుఁడు మంత్రిగనుండుట కెంతయో సంతసించెను. తన ప్రతిజ్ఞలగు నంద సంహారము, చంద్రగుప్త పట్టాభిషేకము నీవిధముగా ముగించి రాజ్యముఁ బ్రశాంతి మొనరించి చాణక్యుఁ డాధ్యాత్మికవిచారము గావింప నెంచి రాజకీయరంగమునుండి తొలంగెను. గతము నంతయు మఱచి రాక్షసుఁడు చంద్రగుప్తునిచే ననేకదండయాత్రల నొనరింపఁజేసి పరాజయమునెఱుంగని విజయములతోఁ బాటలీపుత్రరాజ్యమును మిగుల విస్తరింపఁ జేయుటయేగాక

హిమాలయమున కావలి దుర్గమ రాజ్యభాగములు గూడ సాధించెను. మలయకేతువు చంద్రగుప్తునకు సామంతుఁడై యుండెను. పర్వతరాజు ఫిలిప్పాస్ అను గ్రీకురాజనియు శల్యూకసు మలయకేతు వనియు నిప్పటి చరిత్రవిదు లూహించుచున్నారు.

చాణక్యుఁడు ఉత్తమచరిత్రుఁడు. క్షాత్రమున నీతఁడు పరశురామునకు, స్వామిభక్తియందు సుగ్రీవునకుఁ, గార్యదక్ష యందు నాంజనేయునకు సమానుఁడు. చాణక్యుని గుణప్రశం పురాణాదులయందును కామందకాది రాజనీతి గ్రంథములందున గలదు. రాజనీతిశాస్త్రము లన్నిటియందును దొలుదొలు చాణక్యునిప్రశంస గనఁబడుచున్నది. చాణక్యుఁడు వ్రాసిన నీ శాస్త్రము నీతిగ్రంథములన్నిటిలో మిగులఁ బ్రశస్తిగాంచియున్నది. చాణక్యుఁడు "ఇదంక్షాత్ర మిదం బ్రాహ్మ్య" మను ధర సూక్తికిఁ దార్కాణముగ బ్రాహ్మణధర్మములగు పారమార్థి విజ్ఞానములయందును క్షాత్రధర్మములగు చతురుపాయము యందును సమర్థుఁడై మౌర్యరాజ్యమును భరతఖండమునఁ జి కాలము నిలుచునటులఁ జేసి సామ్రాజ్యసంరక్షణమునకుఁ బ పక్షకోటిలోనివాఁడగు రాక్షసుని నియోగించి తాను తప వనమ్మున కేగెను.

చాణక్యుఁడు చందనదాసుని స్వామిభక్తికి సంతసి యాతని విడుచుటయు రాజనీతివిదుఁడగు రాక్షసుని మంత్రి నేర్పాటు చేయుటయుఁ బర్వతరాజును భాగము గోరకుండు

జంపుటయుఁ జూడ గుణము గ్రహించుటయందప్రతిమానుఁడనియు రాజనీతికొఱకై యెట్టి దురంతకార్యమునకు జంకువాఁడుకాఁడనియుఁ దెలిసికొనవచ్చును. చాణక్యుఁ డాంధ్రబ్రాహ్మణుఁడని యాధునికులు విశ్వసించుచున్నారు. కాదనుటకు అగుననుటకు బలవత్తరములగు నాధారములు లభించుదాక ననుమానమె శరణ్యము.

నాఁడు చంద్రగుప్తుని కైవసమాచరించిన మౌర్యరాజ్యరూపుమాసినను జాణక్యుని ప్రశస్తిమాత్రము దేశీయులు మఱచిపోవలేదు. మహాత్ముల జీవితములజరామరములై భవిష్యత్సంతతికి మార్గదర్శకములుగ నాచంద్రార్కస్థాయిగ నుండుననుటకు సంశయములేదు.

చంద్రగుప్తుఁడు రాజ్యమును బాలించిన కాలము క్రీస్తుశకమునకుఁ బూర్వము ౩౨౨ – ౨౯౮ వఱకునై యుండునని చరిత్రములవలనఁ దెలియుచున్నది. చంద్రగుప్తునికంటెఁ జాణక్యుఁడు వయస్సునఁ బెద్దవాఁడు గాన నతనికిఁ గొంతముందుగఁ బ్రసిద్ధికివచ్చి చంద్రగుప్తునకు ముందె గతించి యుండును.

చాణక్యుని పాండిత్యమును విద్యాకౌశలమును గూర్చి విశేషించి వ్రాయవలసియున్నను, ఇందు వీరజీవితమును జేర్చుటయే మాసంకల్పముగాన నింతటితో విరమించుచున్నారము.

# 2. గౌతమీపుత్త్ర శాతకర్ణుఁడు.

ఆంధ్రదేశము నందలి పురాతననగరములలో ధాన్యకటకము తొలుత యెన్నఁదగినది. బెజవాడకు మూఁడామడల దూరమునఁ బశ్చిమదిశను కృష్ణాతీరమున అమరావతి చెంత నీజీర్ణనగరము గలదు. దీనినే మనమిపుడు ధరణికోట యని వ్యవహరించుచున్నారము. మిగుల నున్నతములగు మంటిదిబ్బలతో మనోహరములగు బౌద్ధస్తూపములతో నొప్పి పూర్వశోభలఁ గోలుపోయిన యీప్రదేశము నొకమారు సందర్శించి మన పూర్వచరిత్రము స్మరింతుమేని ఆంధ్రరాజుల రాజధానినగరమునకా యీదుర్దశ యని పరితాపము కలుగకమానదు.

ధరణికోట రాజధానిగఁ జేసికొని పాలించిన శాతవాహన వంశజులగు నాంధ్రరాజులలో గౌతమీపుత్త్ర శాతకర్ణి ప్రథమగణ్యుఁడు. విజ్ఞానమునందును బరాక్రమమందును ప్రజాబరిపాలనాచాతుర్యమునందును నీతఁ డసమానుఁడు. ఇతఁడు పలుమాఱు విజయయాత్రల కేఁగి యవనులను, శకులను, పహ్లవులను లోఁబఱచికొని ధాన్యకటక సింహాసనాసీనుఁడై వెంటనే తన పెద్దకుమారుఁడగు పులమాయిని యువరాజపట్టాభిషిక్తుని గావించి ప్రతిష్ఠానపురమునం దాతని నుంచి తన పూర్వులు కోలుపోయిన రాజ్యములన్నింటిని గడించెను. ఈనృపాలుని వంశమును శాతవాహనవంశ మని యందురు. శాతవాహన నామము ఎటుల వచ్చినదో తెలుపు చిత్రకథయొకటి గలదు

లోనున్నది. ఆకథయందలి సత్యాసత్యములఁ జర్చింపక హృద్యరంజకమగు నాకథ నిట వ్రాసెదము.

పరాక్రమశాలియు ధర్మమూర్తియు నగు దీపకర్ణిమహారాజు దక్షిణాపథమును బాలించుచుండెను. ఆతనికి రూపవతియు విద్యావతియునగు శక్తిమతియను భార్యకలదు. ఇరువురును మిగుల సౌఖ్యముగఁ గలసిమెలసియుండ వారి దాంపత్యముఁ గాంచి దైవమునకన్ను కుట్టెనేమోయన శక్తిమతి సర్పదష్టురాలై మరణించెను. దీపకర్ణి అనుకూలపత్నీ వియోగమునకు మిగుల దుఃఖించి యుత్తరక్రియ లన్నియు నిర్వహించి తనజీవితమునంతయు బ్రహ్మచర్యావస్థలోఁ గడపుచుండెను. నాయనంతర మీమహారాజ్య మెవరిపాలుగానున్నదో, సంతానము లేదుగదా యను చింత దీపకర్ణిహృదయమును దహించుచుండెను. ఒకనాఁటి వేఁకువజామున సుఖనిద్రలోనుండ దీపకర్ణికొక స్వప్నమువచ్చెను. కలలో నీశ్వరుఁడు కనిపించి నీవరణ్యములకుఁ దేఁపు వేఁటకుఁబొమ్ము. నీకు సింహరాజముపై స్వారిచేయు నొక బాలుఁడు గనిపించును. వానిని గొనితెచ్చి పెంచి యీరాజ్యమును వానికి నిమ్మని చెప్పి యదృశ్యమయ్యెను.

తెల్లవారఁగనే దీపకర్ణి పరిజనమును వెంటఁగొని వేఁటలాడుట కొక యరణ్యమునకుఁబోయి విహరించుచుండ మార్గమునఁ బరుగెత్తుచున్న యొకసింహరాజము కనబడెను. దానిపై నమిత తేజోరాశియు, సుందరాకారుఁడు నగు నొకబాలుఁడు

గౌతమీ పుత్ర శాతకర్ణుడు



[illegible] స్తూపము

హాస్యుండియుండెను. దీపకర్ణి స్వప్నమునఁ గాంచినదెల్లఁ బ్రత్యక్షమగుటచే మిగుల సంతసించి పదునైన బాణమును వెంట సంధించి వరుసగత్తు సింగముపైఁ బ్రయోగించెను. సింగము వెంటనే మరణించెను. సింహదేహమునుండి యక్షుఁడొకఁడుఁ బయలు వెడలి నమస్కరించి దీపకర్ణి నృపాలా! నేను సాతుఁ డనువాఁడను. యక్షుడను. కుబేరుని సఖుఁడను. నే నొకముని కన్యను వలచి మునియనుజ్ఞ గొనకయున్న గాంధర్వవిధిఁ బెండ్లాడితిని. నాసాహసమునకుఁ గోపించి నన్నిరువుర సింగములఁ గండని ముని శపించెను. నా భార్య గర్భవతియై యీ బాలునిగని యకాలమరణమొందెను. తల్లిలేని బిడ్డనెటులో పెంచుచుంటిని. నాశాపము తొలంగినది. నే నేఁగుచున్నాఁడను. ఈబాలుని పోషించు భారమంతయు నీదెయని సాతుఁ డదృశ్యుఁ డయ్యెను. సాతుఁడే వాహనముగనున్న యీ బాలునకు సాత వాహనుఁడను నామమొసంగి దీపకర్ణి యీ బాలుని మక్కువ తోఁ బెంచి పెద్దవానిఁ గావించి శుభదినమునఁ దన రాజ్యము నాబాలునకొసంగి పట్టాభిషేకము గావించెను. సాతవాహ నునే ప్రాకృత గ్రంథములందు శాలివాహనుఁడని వ్యవహరిం చిరి. ఈతనివంశమె శాతవాహనవంశమని వ్యవహరించుచుండిరి.

శాతకర్ణుఁడు బౌద్ధుఁడు. ఆతనికాలమున జైనబౌద్ధ శైవమతములు పరస్పర భిన్నాభిప్రాయములతో ద్వేషము పెంచుకొనుచున్నను దానందుఁ బాల్గొనక సర్వమత సామరస్య మునకె పాటుపడెను. బౌద్ధభిక్షువులకే కాక యితరమతముల

వారికిఁగూడ నీరాజు మిగుల సహాయము చేసెను. ఆకాలమునఁ బేరుగల రాజ్యము లన్నియు శాతకర్ణునకుఁ బన్నుగట్టుచుండెను. శాతకర్ణుఁడు బౌద్ధమతావలంబియైనను విరోధిసంహారమున దయాదాక్షిణ్యములు వదలి యెన్నియో కుటుంబములను రూపుమాపెను. తనకుఁ దిరుగబడి సామంతులుగా నుండనీయ కొననందులకుఁ గోపించి విరోధుల వంశములను నిర్మూలము గావించెను. యవన శక పహ్లవవంశములు పెక్కు రూపు మాపెను. సౌరాష్ట్రదేశముమీఁదికి దండెత్తి యాభాగమును బాలించు రాజవంశమును కూఁకటివేళ్లతోఁ బెరికి కూలార్చెను. పలువురు రాజులు శాతకర్ణికి లోఁబడి తమ పూర్వమతములు వదలి బౌద్ధులుగా మారిపోయిరి. ఇతని పుత్త్రుఁడగు పులమాయి (పౌలోమి) గూడ విజయ యాత్రల యందుఁ దండ్రికిఁదోడ్పడి విజయములు సమకూర్చి సామ్రాజ్యమును మిగుల విస్తరము గావించెను.

శాతకర్ణుని రాజ్యమును హరింపఁదలంచి యవనులు, శకనులు, పహ్లవులు పలుమారు దండెత్తివచ్చి పరాభవము నొంది పోవుటయే కాని జయము నొకమాఱేని గాంచి యెఱుఁగరు. ఆకాలమున సుప్రసిద్ధులుగానున్న చేరదేశపాలకుఁడగు చెంకుడువాను భూపతియు సింహళమును బాలించు గజబాహునృపుఁడును మాళవదేశమును బరిపాలించు చస్తనుడును శాతకర్ణి కనుసన్నల మెలఁగుచు స్నేహము వాంఛించుచుండిరి. పశ్చిమాంధ్రదేశము పులమాయి యధికారము క్రిందను

పూర్వాంధ్రదేశము ధరణికోట రాజధానిగా శాతకర్ణి పరిపాలనము క్రిందను నుండెను. శాసనములవలన గౌతమీపుత్ర శాతకర్ణి ఆస్మిక, ఆసిక, మూలక, సురాష్ట్ర, కుకుర, అపరాంతక, అనూప, విదర్భ, అకరావంతి లోనగు దేశముల కధిపతియనియు వింధ్యావతము, పారియాత్రము, సహ్యము, కృష్ణగిరి, మలయము, మహేంద్రము, శ్రీస్థగిరి, చకోరము, మొదలగు పర్వతముల కధినాథుఁడుగా నుండెననియు దెలియు చున్నది. మగధదేశమునకుఁ గూడ ధరణికోట యాకాలమున రాజధానిగానుండెను. ఉత్తరదిశను గంగానది మొదలుకొని దక్షిణమునఁ గాంచీపురివఱకుఁ గల దేశమంతయు నాంధ్ర రాజుల పరిపాలనమున నున్నటుల నిశ్చయింప నవకాశములు గలవు.

శాతకర్ణి యాంధ్రుఁడైనను అతనికాలమున వ్యాప్తిలో నున్న ఆంధ్రభాషాస్వరూప మెట్టిదో నిశ్చయింప నాధారములు లభించుటలేదు. రాజకీయవ్యవహారములయందును శాసనములయందును సంస్కృతభాష మిగుల స్వల్పముగను విశేషముగఁ బ్రాకృతయు నుపయోగింపఁబడెను. శాతకర్ణి ప్రాకృతవాఙ్మయమును మిగుల నభివృద్ధిలోనికిఁ దెచ్చెను. ప్రాకృతభాషలోఁ బెక్కు లుత్తమగ్రంథము లీనృపాలునికాలమునందే బయలు వెడలెను. విదేశవ్యాపారమునుగూడ నీతఁడు మిగుల నభివృద్ధి లోనికిఁ దెచ్చి ద్వీపాంతరముల కిచటివస్తువులు పోవునట్లును

ఇతరద్వీపవస్తువు లచటికి వచ్చునట్లును జేసెను. స్వయముగాఁ బండితుఁ డగుటచే శాతకర్ణి వర్ణాశ్రమధర్మముల గుఱించి వర్ణములను సంకరముగాకుండఁ గట్టుదిట్టములను మిక్కిలి దిట్టముగాఁ జేసెను. దండయాత్రలలో నీ దేశమునకు వచ్చి యిచటనే ప్రాంతకాఁపులుగానున్న విదేశీయుల నాదరించి వారి కెట్టివన్ను లవసరము లేకుండఁ జేసి శాతకర్ణి వారికెన్నియో సౌకర్యములు కలుగఁ జేసెను. పూర్వరాజులు తమపేరుముందు మాతృనామముంచుకొని వ్యవహరించినటులఁ గానరాదు. శాతకర్ణి తన మాతృదేవియగు గౌతమినామమును తన పేరుతోఁ గలిపికొని గౌతమీపుత్ర శాతకర్ణియనియె వ్యవహరించెను. దీనిచే నీతనికిఁ గల యపారమగు మాతృభక్తి వెల్లడి యగుచున్నది.

గౌతమీపుత్రుఁడు క్రీ.శ.౧౩౩ మొదలు ౧౫౪ర వఱకు రాజ్యమును బాలించియుండునని యింతవఱకు లభించిన శాసనాద్యాధారములవలనఁ దెలియుచున్నది. ఇతని ధర్మపత్ని వాసిష్ఠి. ఈరాజన్యుని జీవితమునందలి యపూర్వాంశములెన్నియో కాలగర్భమున మఱుగుపడియున్నవి. శాతకర్ణి యపూర్వచరిత్ర మంతయుఁ గీర్త్యంకములుగఁ బరిగణింపఁబడు శిలాశాసనములం దింకను అజ్ఞాతావస్థయందే యున్నదని యొప్పుకొనక తప్పదు. మహావిస్తృతమైన ఆంధ్రసామ్రాజ్యమునకు నెలవైన ధాన్యకటకము నేఁడు పూర్వవైభవములన్నియుఁ గోలుపోయి చిఱుపల్లెగా మాఱిపోయినది. ఆంధ్ర

రాజుల వేఁడిరక్తముచేఁ బూతమైన పుణ్యప్రదేశములలో రక్కసకంపలు నిండిపోయినవి. ఆంధ్రరాజుల మహోన్నతదశను గాంచి యానందించి విజయగీతములు పాడిన కృష్ణాస్రవంతి యిపుడు విపరీతకాల పరిణామమునకుఁ బలవించుచు విషాదగీతికలఁ బాడుచున్నది. ఆంధ్రుల దురదృష్టమువలెఁ బెచ్చుపెరుగు పాటిదిబ్బలలోఁ జారిత్రకరత్నము లెన్ని మరుగు పడియున్నవో సమగ్రమగు పూర్వచరిత్ర మాతృలోకమున కెన్నటికి జ్ఞాపకమునకు వచ్చునో యెవరు చెప్పగలరు?

## 3. కులోత్తుంగ చోడదేవుఁడు.

భారతమును నన్నయభట్టారకునిచే ఆంధ్రీకరింపఁ జేసి యంకితముగాఁ గొన్న రాజరాజనరేంద్రుఁడు మనకుఁ జిర పరిచితుఁడు. ఈతఁడు చాళుక్యవంశజుఁడు. చాళుక్యవంశజులు చంద్రవంశక్షత్రియులని భారతమునందుఁ జెప్పఁబడెను. ఈనృపుని రాజరాజ విష్ణువర్ధనుడనియు రాజ రాజనియుఁ గూడ వ్యవహరించుట కలదు. తనమేనమామయగు రాజేంద్రచోడుని కుమార్తెయైన అమ్మంగదేవి నతఁడు వివాహమాడెను. ఈ దంపతులకుమారుఁడె మన కథానాయకుఁడగు కులోత్తుంగ చోడదేవ చక్రవర్తి.



కులోత్తుంగ చోడదేవుఁడు.

కులోత్తుంగ చోడదేవుని మొదటి పేరు రాజేం
డు. ఇతఁడు యువరాజుగానున్న కాలమునఁ జెక్క
ములు దండయాత్ర లొనరించి విజయము గడించె
దండయాత్రయం దీయువరాజు మధ్యమాగాణము
వాయిరా నగరమును బలపరాక్రమములతో ముట్ట
యూథములను లోఁగొని విజయము గడించెను.
మాఱు బస్తరు రాజ్యములోని చక్రకోట్యమును
జయించి సింధువంశజాతుఁడును విక్రమశాలియున గ
వర్షుని సామంతరాజునిగ నొనరించెను. చాళుక్యులక
లతో సంబంధము విమలాదిత్యుఁడు. రాజరాజు,
చోడుల కాలమువఱకు వరుసగా మూఁడుతర
కలిసి వచ్చెను. ఈమువ్వురిభార్యలును చోడులయింటి
పడుచులె. మేనమామలను దల్లులనుబట్టియో చోడ
జయించిన కారణముననో యీ రాజేంద్రుని రాజేంద
డనియుఁ గులోత్తుంగ చోడుఁడనియు వ్యవహరించిరి.
గరికాలచోడుఁడు, రాజనారాయణుఁడు అను బి
ములు గలవు. ఎంతరాజకుమారుఁడైనను మాత
జనకస్థానము మహారాజ్యసంబంధముగలదైనను క
మాత్రమితఁడు తొలుతనె పాల్పడెను. రాజరాజన
మరణించినంతనే తండ్రిరాజ్యమగు రాజమహేంద్ర
కీకులోత్తుంగచోడదేవుఁడు రాజుగావలసియుండ

ధైన విజయాదిత్యుఁడు బలవంతుఁడై రాజకీయోద్యోగులను సైనికులను లోఁగొని యక్రమముగా భ్రాతృరాజ్యము నాక్రమించెను. కులోత్తుంగచోడుఁడు రాజ్యభ్రష్టుఁడై పినతండ్రిని సాధించి నిజరాజ్యము నెటుల లోఁగొనవలయునా యని తీవ్ర యత్నములు గావించుచు సైనికబలమును సమకూర్చుచుండెను. విజయాదిత్యుఁడు ప్రసిద్ధ పరాక్రమశాలి కాకపోవుటయుఁ, గులోత్తుంగుఁడు సైన్యమును జీలఁదీయుచుంటయు గమనించి చిరకాలమునుండి వేంగిదేశమును గబళింప వలయునని ప్రయత్నించుచున్న పశ్చిమ చాళుక్యులలోనివాఁడగు (నాఱవ) విక్రమాదిత్యుఁడు అమితసైనిక బలముతోఁ గృష్ణా గోదావరీ నదులదాఁటి రాజమహేంద్రవరముపైకి దండయాత్ర కేతెంచెను. స్వదేశము పరరాజాక్రాంతముగా నున్నదనియు నిపు డూఱకయున్న యెడల వేంగిరాజ్యమునకు మనకుఁ బ్రాప్తము తీరుననియుఁ గులోత్తుంగచోడరాజు నిశ్చయించి పశ్చిమచాళుక్యుల నెదిరించెను. ఉభయపక్షములకు గౌతమీ తీరమున భయంకరసంగ్రామము జరిగెను. కడకుఁ బశ్చిమ చాళుక్యుఁడగు విక్రమాదిత్యుఁడు ఓడిపోయెను. తన రాజ్యము సరిహద్దులవఱకుఁ బశ్చిమచాళుక్యరాజును గులోత్తుంగ చోడుఁడు తరిమివేసి వెనుకకు మరలి తన రాజ్యమునకుఁ జేరి యంతవఱకుఁ దనకు వ్యతిరేకముగ రాజ్యమేలుపినతండ్రియగు విజయాదిత్యునే తనకుఁ బ్రతినిధిగా వేంగిరాజ్యము బాలించు

నటుల నేర్పాటు గావించెను. కులోత్తుంగుని సుగుణములలో విరోధియగు పినతండ్రిని క్షమించి యొప్పటివలె రాజప్రతినిధిగా నేర్పఱచుట యొకటి.

చోడరాజ్యమును బాలించు వీరరాజేంద్రుడు తన పినతండ్రియగు విజయాదిత్యుని పక్షమవలంబించి తన కనేక విధముల నుపకారము గావించెను. చోడరాజ్యమునందు వీరరాజేంద్రునకు బేరుప్రతిష్ఠలు గూడ దగ్గుచుండెను. వీరరాజేంద్రుని మట్టుపెట్టుట కొకమూల కులోత్తుంగుడు యత్నించుచుండ కుంతలదేశాధీశుడును బశ్చిమచాళుక్యుడు నైన విక్రమాదిత్యుడు చోళరాజ్యమును హరింపనెంచి దండయాత్రకు బయలువెడలెను. వీరేంద్రచోడుడు తన దుర్బలస్థితిని దా నెఱింగినవాడగుటచేత గొంత రాజ్యమును దన కుమార్తెను విక్రమాదిత్యున కొసంగి సంధిచేసికొనెను. కులోత్తుంగుడు మాత్రము చోళదేశము హరించుటకు దాను జేయుయత్నముల నొకటియు మానుకొనలేదు. కాలవశమున వీరరాజేంద్రుడు కులోత్తుంగచోడుడు యుద్ధయాత్రకు రాకముందె మరణించెను.

మఱల జోడదేశమున నశాంతియు నరాజకము ప్రబలెను. సామంతులు తిరుగబడి స్వతంత్రులై ప్రతిఘటించు యత్నములలో నుండిరి. పౌరులు రాజాజ్ఞ తిరస్కరించుచుండిరి. ఈ పరిస్థితు లెఱింగి విక్రమాదిత్యుడు సైన్యసహితముగ

చోడదేశమునకు వచ్చి యరాజకమునంతయు నివారించి తన బావమఱంది యగు పరకేసరివర్మను సింహాసనాసీనుని గావించి చీలిపోయిన సామంతులను బౌరులను గూడఁబలిచి కొంతకాల మటనుండి రాజ్యమునందు శాంతి స్థాపించి తనదేశమునకుఁ బోయెను. విక్రమాదిత్యుఁ డటులఁబోయి పోకమున్నె మఱలఁ జోళరాజ్యమునం దశాంతి పెచ్చరిల్లెను. ఈవృత్తాంతము విని విక్రమాదిత్యుఁడు వచ్చి మఱల మఱల శాంతినెలకొల్పి వెళ్లు చుండెను. చోడరాజ్యము నింకఁ జూచుచున్నయెడఁ బరుల పాలగునని మార్గమధ్యముననే రాజేంద్రచోడుఁడు విక్రమాదిత్యుని నోడించి వెనుకకుఁ బంపివైచి యమిత బలసహాయముతోఁ జోడదేశమును జయించి పరకేసరివర్మను జంపి "కులోత్తుంగ చోడనామము" సమస్త సామంతులకు భయంకరమగునటులఁ జోళమండలము బాలించుచుండెను.

ఇటు చోడరాజ్యము, అటు వేంగిరాజ్యము తన హస్తగతములైనను అంతతోఁ దృప్తినొందక తిరుగఁబడిన రాజుల నందఱ జయించి తనరాజ్యము మిగుల విస్తరముజేయ సంకల్పించి కులోత్తుంగ చోడదేవుఁడు చెంగల్పట్టు ఉత్తరార్కాడు మండలములోని పులియూరునాడు, ఎఱుమూరునాడు గూడ జయించెను. కుంతలదేశమును బాలించుపశ్చిమచాళుక్యులలోఁ బ్రసిద్ధుఁడగు విక్రమాదిత్యునిగూడ నతని సోదరుఁడగుజయ సింహసహితముగా నోడించి పూర్వవైరమునకుఁ బ్రతి

క్రియగావించెను. మైసూరురాజ్యమునందలి కొంతభాగమును పాండ్యదేశమును జయించి పంచపాండ్యుల నంకితులఁ గావించుకొనెను. ఇంతతోఁ దృప్తినొందక మలబారుదేశములోని పశ్చిమ భాగమగు కుడమలైనాడునుగూడ జయించి మేటివీరుల ననేకులఁ బొరిగొని యాదేశమునంతయు లోఁగొనెను. చేరరాజునకుఁగల నావికాబలమును సైన్యమును గూడ మట్టుపెట్టి కులోత్తుంగచోడుఁడు చేరదేశమునందుఁగూడఁ దన స్వాతంత్ర్యపతాకమును నిలువఁబెట్టెను. ఇంచుమించుగ నితఁడు గౌతమీపుత్త్రశాతకర్ణి రాజ్యమునకు సమానవైశాల్యముగల యాంధ్రభాగమును బాలించెనని చెప్పవచ్చును. వేంగిదేశమును గులోత్తుంగునకుఁ బ్రతినిధిగఁ బరిపాలించు నతనిపినతండ్రియగు విజయాదిత్యుఁడు కొంతకాలమునకు (క్రీ. శ. ౧౦౭౭) పరలోక గతుండయ్యెను. తరువాతఁ దనకుమారుఁడగు రాజరాజును వేంగిదేశమునకుఁ బాలకునిగా నియోగించెను. ఎల్లప్పుడును ఆధ్యాత్మిక చింతామగ్నుఁడగు రాజరాజు కొంతకాలమునకు రాజ్యభోగములపై విరాగమూని తన పరిపాలనాభారము మఱలఁ దండ్రికప్పగించెను. తరువాతమఱియొకకుమారుఁడగు వీరచోడుని నియమించెను. ఇతఁడు దాదాపుగ నాఱు సంవత్సరములు వేంగిరాజ్యము పాలించి కాంచీనగరమునకుఁ బోయెను. తనకుమారుల నందఱను వేంగిదేశము పాలించుటకిటుల నొకనివెంట మఱియొకని నియోగించుచు చోళ, వేంగి దేశముల రెంటిని సమానముగఁ దిలకించుచుండెను.

కులోత్తుంగచోడుఁడు కళింగదేశముపైకి రెండు మాఱులు దండయాత్రకు బయలుదేరి విజయము గడించెను. పరిపాలనారంభమున నొకమాఱు పరిపాలనాంత్యమున నొకమాఱు నని యితని కళింగదేశ దండయాత్రలకు సంకేతము లిడవచ్చును. కులోత్తుంగుఁడు తన పుత్త్రియగు రాజసుందరిని కళింగదేశపాలకున కొసంగెను. మనుమఁడగు అనంతవర్మ కళింగదేశమును బాలించుతఱిఁ గొందఱు కాళింగులు ఉసిగఁబడి యరాజక ప్రయత్నములు సేయుచుండిరి. రెండవ దండయాత్రలో నరాజకముల నడంచి అనంతవర్మ రాజ్యమును సంస్కరించి తనపేర కులోత్తుంగ చోడనగరమును గట్టించెను. తరువాతికాలమున నీనగరము విశాఖపట్టణమను వ్యవహార నామము వహించెను.

కులోత్తుంగ చోడునకు నలువురు ధర్మపత్నులు గలరు. వారిపేరులు మధురాంతకదేవి, దీనచింతామణి, ఎళిశై వల్లభి, త్యాగవల్లి. మధురాంతకదేవియందు ఈరాజన్యునకు ఏడుగురు పుత్త్రులు ఒకపుత్త్రికయు జనించిరి. పుత్త్రిక అనంతవర్మతల్లియగు రాజసుందరి. పుత్రులేడుగురిలో రాజరాజ చోడగంగు, రాజరాజ ముమ్మడిచోడుఁడు, వీరచోడుఁడను ముగ్వురే చరిత్రవిదులకుఁ బరిచితులు. కులోత్తుంగ చోడునకుఁ జోడ రాజ్య మాక్రమించికొన్న పిదప గంగయకొండపురము, గంగయకొండ చోడపురము అని వ్యవహరింపఁబడు గంగాపురము

కొంతకాలము, కాంచికానగరము మిగిలిన కాలమంతయు రాజధానిగా నుండెను.

కులోత్తుంగచోడుఁడు ఉత్తరదిక్కున కళింగము, దక్షిణము కన్యాకుమారి, తూర్పుదిక్కున సముద్రము, పడమటిదిక్కున కుంతలదేశము, సరిహద్దుగాఁగల విశాలమగు దేశమును ఏకచ్ఛత్రాధిపత్యముగా నించుమించుగ నేబది సంవత్సరములు పరిపాలించెను. ఇతనిరాజ్యకాలము క్రీ. శ. ౧౦౭౦-౧౧౨౦ వరకని చరిత్రకారులు నిశ్చయించినారు. కులోత్తుంగచోళుని పరాక్రమజీవితము సంస్కృత ద్రవిడగ్రంథములలో విశేషించి కీర్తింపఁబడెను. ఆంధ్రభాష కీతఁ డెంత సహాయము గావించెనో ఆకాలమున బయలువెడలి యాంధ్రకావ్యము లెవ్వియో యెఱుఁగ నవకాశముచిక్కలేదు. కులోత్తుంగచోడ మహారాజు శైవమతాభిమాని. విష్ణ్వాలయముల ననేకములఁగూలద్రోయించెననియు విశిష్టాద్వైతమత ప్రవర్తకుఁడగు రామానుజాచార్యుని మతప్రచారమును సాగకుండఁజేసెననియు ఆపాపముచే నీతఁడు గతించెననియు వైష్ణవమత గ్రంథములందును రామానుజ చరిత్రమునందును గలదు. ఈరాజు మరణమునుగూర్చి కొన్నికథ లాగ్రంథమునఁగలవుగాని వాని సత్యాసత్యచర్చతో మనకుఁ బనిలేదు. కులోత్తుంగుఁడు మరణించువరకు రామానుజుఁ డతనిరాజ్యమున నెట్టి ప్రచారము చేయక మైసూరురాజ్యమున నున్నమాట వాస్తవము.

కులోత్తుంగుఁడు తన రాజ్యము సుభిక్షముగా నుంటకై యనేక తటాకముల నిర్మించి రైతులకుఁ బెక్కు సౌకర్యములు కలుగఁజేసెను. ప్రజలు ధాన్యరూపముగఁ బన్నులు చెల్లించు నట్లును గ్రామమునుండి వసూలుగావలసిన పిస్తులపై యధికార ము గ్రామాధికారిపైననె యుండునట్లును కట్టుదిట్టములుచేసి వ్యాపారము నభివృద్ధిలోనికిఁ దెచ్చెను. కులోత్తుంగచోడుని కాలమున మిగులనభివృద్ధిలోనికివచ్చిన యీయాంధ్రరాజ్యము రానురాను అతని యనంతరము క్షీణించి కడకు కాకతీయ సామ్రాజ్యములో మఱికొంతకాలమునకు లీనమైపోయెను.

చేర, చోళ, పాండ్య కళింగాంధ్రాది దేశముల నేకధా టిగాఁ బరిపాలించిన యీయాంధ్రచక్రవర్తి జీవితచరిత్రము మనము పూర్తిగా మఱచినారము. పూర్వరాజుల ప్రతిష్ఠాలేశ ములనాలపించు శిలాశాసనాదులకడ కేఁగితిమేని ప్రశాంతసమ యమునఁ గులోత్తుంగచోడుని యశోగీతికల నాలింపవచ్చును. స్వామిభక్తి పరాయణులగు నాంధ్రశూరుల రక్తముచేఁ దడి సిన పుణ్యభూములు త్యాగజీవితమును దెలుపు శాసనరాజము లువహాసిపోయిన చాళుక్యనృపుల ప్రతిష్ఠను జరిత్రవిదులకుజ్ఞాప కము చేయుచున్నవి. మహత్తరమగు నారాజ్యముతోఁ బాటు నాంధ్రసోదరుల విక్రాంతియు మఱపునకు వచ్చుట దురదృష్టము.

# 4. బాలచంద్రుడు.

వీరకుమారుఁడు బాలచంద్రుఁడు భారతవీరులలోఁ సుప్రసిద్ధుఁడగు అభిమన్యునితోఁ బోల్పదగినవాఁడు. ఈవీరబాలుని జీవితముఁ జెప్పుటకు ముందుఁ బూర్వకథ కొంచెము చెప్పుటయువసరము. మన కథాకాలమునకుఁ గొంచెముముందు గురిజాల రాజధానిగఁ జేసికొని అనుగురాజు పల్నాటిరాజ్యమును బరిపాలించుచుండెను. అనుగురాజునకు ముగ్గురుభార్యలు. వీరవిద్యాదేవి, భూరమాదేవి, మైలమాదేవియను వారిపేరులు. భూరమాదేవియందు కామరాజు, నరసింహరాజు, జెట్టిరాజు, పెరుమాళ్ళరాజు అను నలుగురు కుమారులు. వీరవిద్యాదేవియందు పెదమల్లదేవుఁడు, పినమల్లదేవుఁడు, బాలమల్లదేవుఁడు అను ముగ్వురు తనయు లుద్భవించిరి. వీరందరికంటె మైలమాదేవి కుమారుఁడగు నలగామరాజు పెద్దవాఁడు. అనుగురాజు తన యంత్యకాలమునందు రాజ్యమును దన కుమారులను రేచెర్లగోత్రుఁడును వెలమవీరుఁడు నగుశీలము బ్రహ్మనాయని చేతఁబెట్టి కుమారుల నుద్ధరించి రాజ్యతంత్రములను మంత్రివై నిర్వహింపుమని చెప్పి ప్రాణములు విడిచెను. బ్రహ్మనాయఁడు మృతభూపులకు క్షత్రియవంశాచారానుగుణముగా నుత్తరక్రియ లాచరించి కుమారులపక్షమున రాజ్యచక్రము తానె జయప్రదముగాఁ ద్రిప్పుచుండెను.

నలగామరాజు పట్టాభిషిక్తుఁడై గురిజాలరాజ్యము తాను స్వయముగాఁ బాలింపఁ దొడఁగెను. సోదరు లతని పోషణముక్రింద నే యుండిరి. వీరవిద్యాదేవియందు జనించిన పెదమలదేవాదులు మిక్కిలి చిన్నవారు. వీరి కేమేని యాపద కలిగింతురేమో యని బ్రహ్మనాయఁడు బాలురను వెంటఁగొని మాచర్ల రాజధానిగఁ జేసికొని కొంత దేశమును బాలించుచుండెను. బ్రహ్మనాయకుఁడు పెదనకు మంత్రియైనను రాజ్యవ్యవహారములు స్వయముగ నిర్వహించుచు పెదమల్లదేవాదుల వేయి కనులతోఁ గాపాడుచు వారిసుఖమె తన సుఖముగ భావించుచుండెను. బ్రహ్మనాయకుని సత్పరిపాలనమునకుఁ బ్రజలు మెచ్చి పలనాటికృష్ణుఁడని యతనిని బ్రశంసించుచుండిరి. గురిజాల రాజ్యము స్వతంత్రముగ నలగామరాజు తక్కినసోదరుల నందఱఁ జెంతనుంచుకొని పాలించుచుండెను. నాగాంబయను నొక రెడ్డికాంత నలగామరాజుఁ దననేర్పుచే లోఁగొని గురిజాలరాజ్యమునకు మంత్రిణియై రాజ్యతంత్రములు నిర్వహించుచుండెను. ఈ యమను నాయకురాలందురు. నాయకురాలు మంత్రిణిగఁ జేరినది మొదలు బ్రహ్మనాయకుని ద్వేషింపసాగెను. రెండు రాజ్యములవారు ఒకరినొకరు ద్వేషించుకొనుచుండిరి. నాయకురాలు దుస్తంత్రము లొనర్చి మాచర్లరాజ్యము నాశనము చేసి గురిజాలరాజ్యములోఁ గలుప నెన్నియో ప్రయత్నములు గావించుచుండెను. బ్రహ్మనాయకుఁడు తన మెలకువచే నా చిక్కులు తొలగించుచు కాలము గడపుచుండెను.

మనమింకఁ బ్రధానకథలోనికి వచ్చుచున్నారము. బ్రహ్మనాయనికి సంతానములేదు. ఆయనభార్య ఐతాంబ. చిరకాలము సంతానార్థము ఎన్నియో నోముల నోచెను. ఎన్నియో దానధర్మములాచరించెను. అన్నసత్రములు పెట్టించెను. సంతానము కలుగదయ్యె. కడకు గజనిమ్మనోము నోఁచెను. మాచర్ల చెన్నకేశవుని యనుగ్రహమున గర్భవతియై నవమాసములు నిండినవెనుక నొకశుభముహూర్తమునఁ గుమారుని గనెను. జాతకర్మలాచరించి బ్రహ్మనాయకుఁడు బాలచంద్రుఁడని యాబాలునకు నామకరణము గావించెను. బాలచంద్రునివలె నాబాలుఁడు దినదినాభివృద్ధి నొందుచుఁ దల్లిదండ్రులకుఁ గనులపండువు గూర్చుచుండెను.

నాయకురాలు ఒకదినమున గురిజాలకు బ్రహ్మనాయఁడువచ్చుటఁ గనిపెట్టి కోడిపందెముల వేయించుచు ఓడినకోడి బ్రహ్మనాయనిదని, గెలిచినకోడి తనదని పరిహాసము లాడుచుండెను. బ్రహ్మనాయఁ డదిచూచి పౌరుషము నాపుకోనఁజాలక తాను స్వయముగాఁ గోడిపందెమున బాల్గొని పుంజును విడచెను. నాయకురాలు వేఱొక పుంజును విడచెను. వట్టిపందెములతో లాభము లేదని యెవరిపక్షము కోడి యోడిన వారు పండ్రెండేఁడులు పరదేశమున వసింపవలెననియు ఒకయేఁ డజ్ఞాతవాసము గావింపవలెనని కట్టుదిట్టములఁ జేసికొనిరి. గ్రహచారవశమున బ్రహ్మనాయనికోడి యోడిపోయెను. అనుకొన్న పంతముఁజొప్పున బ్రహ్మనాయకుఁడు

సపరివారసహితముగా వలసఁబోయెను. నానావస్థలకు లోనై రాజకుమారులతో వలసయందుఁ బడవలసిన కష్టములన్నియుఁ బడి బ్రహ్మనాయుఁడు కడకు గడువుతుదను రాజ్యమునకు రానెంచి మాచర్లరాజ్యము తమకొప్పగింపుమని రాజకుమారులపక్షమున గురిజాలకు వర్తమానము పంపెను. నాయకురాలు దూతను జంపించెను. భాగమీయ వీలుగాదనెను. ఉభయపక్షములకు పల్నాటిసీమలోని నాగులేటితీరమునందు కారెముపూఁడి చెంత భయంకరయుద్ధము జరుగవలసివచ్చెను. సమకాలికులగు రాజులందఱు రెండుపక్షములలోఁ దమ యనుకూలములఁబట్టి చేరిరి. గురిజాలపక్షమున సర్వభారములు నాంచురాలు వహించి రాజులుగనున్న నలగామరాజును, నరసింగరాజును, కీలుబొమ్మలుగఁజేసి సంగ్రామ ప్రయత్నముఁ దానె స్వతంత్రించి చేయుచుండెను. నియతకాలమున నుభయదళములు పరస్పర జిగీషతో యుద్ధము చేయుచుండెను.

బ్రహ్మనాయకుఁడు రాజకుటుంబమును తన కుటుంబమును వీరమేడపిలోనుంచి బాలచంద్రుని గొంత సైన్యమున సంరక్షణమున కుంచి సంగ్రామరంగ మలంకరించెను. బాలచంద్రుఁడు పదునాఱుసంవత్సరముల బాలుఁడు. మిగులగారాబముగాఁ బెరిగినవాఁడు. ఇతఁడితరవ్యవహారములలో జోక్యముపెట్టుకొనక తన సవయస్కులగు అనపోతు, కమ్మర కాచెన్న, మంగల మల్లు, చాకల చందు, కుమ్మర పట్టి, వెలమ

దోర్నీడు, కంసాల చందు, అను బాలురతో గలిసి క్రీడా
విహారములతోఁ గాలము గడపుచుండెను. లేక లేక పుట్టిన తన
యుఁడుగానఁ దలిదండ్రు లీబాలకుని స్వేచ్ఛకు భంగముఁ
జేయరైరి. తండ్రి యుద్ధమున కేఁగినసంగతి వినిన బాలచంద్రుఁ
డేమి సాహసము చేయునో యని తల్లి యాతని స్వాతంత్ర్యవిహా
రమున కెట్టియాటంకము కలుగఁజేయకుండెను. ఒకనాఁడు
బాలుఁడు తన తల్లియొద్దకువచ్చి బొంగరములాడఁ దనకుఁ
గోరికగలదనియు బంగారు బొంగరములు చేయించి యిమ్మని
యుఁ బ్రార్థించెను. ఆయమ్మ తనకుమారుని బుజ్జగించి మన
కివి చాలనిదినములు. మీతండ్రి దూరదేశము పోయియున్నాఁ
డు. మనము వలసలోనున్నారము. ఆటలోఁ బ్రమాదమున
బొంగరము లెవరికిఁ దగిలినను దగవులు వచ్చును. దానివలన
ననేకకష్టములు ప్రాప్తించును. బొంగరములయాట మానుకొ
మ్మని యెన్నితెఱంగులనో చెప్పెను. బాలచంద్రుఁడు తల్లి
మాట వినక నాకు బంగారు బొంగరములె కావలయును. వాని
తో నేనాడుకొనితీరవలయునని మూర్ఖపుఁబట్టు పట్టెను. తల్లి
విధిలేక సొన్నారులఁ బిలిపించి వారికి మేలిమి బంగారము
నొసంగి బొంగరములఁ జేయించి కుమారున కొసంగెను.
తన సవయస్కులు మిత్రులునగు బాలురనందరను వెం
టఁగొని పొట్టేళ్ళపై నెక్కి, పందెములకుఁ బికిలిపిట్టలు,
కౌజులు, తగళ్ళను బట్టించుకొని బాలచంద్రుఁడు క్రీడా
రంగముగ నేర్పరచుకొనిన పోలురావులవద్దకుఁ జేరిరి. అంతకు

ముంచె యాపరిదేశమునిండ రత్నకంబళములు, చాపలు పఱ
చిరి. బాలురందఱచటఁ గూర్చుండి యాటలాడ నారంభించిరి.
మొదటఁ గొందరు బాలురు కసరత్తులు, పికిలిపిట్ట పందెములు
కోఁజుల పందెములు, పొట్టేళ్ళపందెములు జరిపిరి. బంగారు
బొంగరములతో బాలచంద్రుఁ డాటలాడునని గ్రామము
లోని వారందరు చూచుటకు స్త్రీబాల సహితముగా వచ్చిరి
బాలచంద్రుఁడు బొంగరముల యాటలో మిగుల నేర్పరి
బరువైన యాబంగారు బొంగరమును బాలచంద్రుఁడు తీసికొనఁ
త్రాడుచుట్టి వేయఁబోవుసరికి బంటోత్రులు గుంపును వెన
కకు నెట్టివేసిరి. మధ్యనున్న విశాలస్థలమున బాలచంద్రుఁడు
నిలిచి బొంగరమును లాగి విసరెను. బొంగరము రుంయి
రుంయిమని మ్రోగుచు గిరగిర తిరుగుచుండ బాలచంద్రుఁడ
దానిని తిన్నగఁ జేతిమీఁది కెక్కించి కొంతసేపాడించి తర
వాత బాణము చివర నిల్పి కొంతసేపాడించెను. తిరిగి నేల
మీఁద నాడింప వలయునని బాలుఁడు బొంగరమును
విసరి క్రిందికి వైచెను. అటనున్న యొక యెదురురాతికి
గొట్టుకొని, బొంగరము బెడిసి ఆవేడుక చూడవచ్చిన
యొక కోమటిచిన్నదాని కాలికిఁ దగిలెను. మొనగుచ్చి
కొనుటచేఁ గాలినుండి రక్తము చిమ్మనకోవితోఁ జిమ్మి
నటులఁగారెను. ఆమె పేరు అన్నమ్మ. అన్నమ్మ మూర్ఛపోయె
ను. చూడవచ్చిన స్త్రీలందఱు రాయమకు శీతలోపచార
ములు గావించిరి. బాలచంద్రుఁడు తన ప్రమాదమునకుఁ జిం

రించి చేతులు కట్టుకొని యాకాంతకు జెంత నిలిచి విచార పడుచు అన్యాయముగ బరకాంతకు శ్రిమగూర్చితినే యని లోలోనఁ గృశించుచుండెను. కొంతసేపటికి అన్నమ్మకుఁ దెలివి వచ్చెను. బాలచంద్రునకుఁ బ్రాణములు లేచివచ్చెను.

అన్నమ్మ కనులు తెఱచువరకు బాలచంద్రుఁ డెదుటఁ గానవచ్చెను. బాధచే మైమఱచి అన్నమ్మ నీకండకావరము కాలిపోను, బొంగరముతోఁ గొట్టుదువా? రాజుసొమ్ము తేరఁగా దిని యొడలు బలిసియున్నావు. నీచూచుకన్నులలో సూములుగుచ్చ. నీకాలిలోఁ గత్తులుదిగ, నీతండ్రి, రాజు యుద్ధములో నుండ బోతుసింగమువలెఁ బోతరించి యింట నుండునది ఆఁడువారిమీద నాగడము చేయుటకా, యని పెళపెళఁ దిట్టిపోసెను. బాలచంద్రుఁడు తిట్లన్నిటికి సహించి నోసిలి మోడ్చి, తల్లీ! క్షమింపుము. ప్రమాదమునకు మన్నించుట విధి యని బ్రతిమాలి ఐదువందల మాడల నామెకిచ్చి తప్పు క్షమింపఁ బ్రార్థించి తన తలపాగ చించి, యామె కాలికిం గట్టుకట్టించి మాతండ్రి లెచటనున్నారో చెప్పుమనెను. అన్నమ్మ బాలునిపై కోపమునాపుకొని "కోపముచే నేమంటినో నే నెఱుఁగను. మీతండ్రిగారిసంగతి నే నెఱుగననెను." బాలచంద్రుఁడు వెంటనే యింటికిఁబోయి తల్లియగు నైతమ్మను సమీపించి నాతండ్రి యెచటకేగెనో తెలుపుమనెను. ఏదో ప్రమాదముజరిగినది. బాలుఁడు సంగరమునకురుకునటులున్నాఁడు. ఇంక నేమి చేయవలయునో యని యైతమ్మ విచారపడి, బాలుఁడా!

మీతండ్రి యెటకేఁగినది నాకుఁ దెలియదనెను. బాలుఁడు కోపించి, నేనెఱుంగ ననుకొంటివా? నాతండ్రియుఁ బెదమల్ల దేవాదులు కారెమపూడివద్ద యుద్ధముచేయుటకుఁ బోయిరి. తండ్రికి రాజునకు దేశమునకుఁ గానికొడుకు కొడుకా? నే నిఁక నిట నుండఁజనదు. యుద్ధమున కేఁగెదనని పయనమునకు సిద్ధపడెను. ఐతమ్మ యెన్నివిధములనో నయమున భయమునఁ జెప్పెను. లాభము లేకపోయెను. నాయనమ్మమాట విను నేమోయని తల్లి తన యత్తగారగు శీలమ్మను బిలిచెను. ఆమె మాటలు బాలచంద్రుఁడు నిరాకరించెను. జ్యోతిశ్శాస్త్రపండితులఁ బిలువనంపి బాలుని జాతకము జూప ఇఁక పది నైదు దినములలో నితనికిఁ గొప్ప గండముగలదని సంశోచించుచుఁ జెప్పిరి. యుద్ధరంగము భయంకరముగా నుండునని చెప్పి శీలమ్మయు ఐతమ్మయు బాలుని భయపెట్టిరి. చావునకుఁ దెగించిన బాలవీరునకు సంగ్రామరంగముకంటె సౌఖ్యకరమైన ప్రదేశములేదని బదులుచెప్పెను. ఐతమ్మ కన్నీరు నించుచు నాకుఁ గడుపుశోకము పెట్టుదువా? యని వాయెత్తియేడ్చెను. బాలచంద్రుని హృదయము మఱింత మొద్దుబాఱెను. తాను వీరమరణమునకు సిద్ధముగా నున్నాఁడనని చెప్పెను. ఐతమ్మయు శీలమ్మయు యోజించి బాలుని ప్రయత్నము ఆపుట యసాధ్యము. ఐనను చేయఁగల యత్నములు చేయవలయునని రూపవతియగు భార్యను జూచియేని కామపరవశమునఁ గదనము మానునేమో యనుకొని నీభార్యయగు మంచాలవద్ద సెల

వొంది సంగరరంగ మలంకరింపుమని బాలచంద్రునకుఁ జెప్పిరి. బాలచంద్రుడు సంతసించి కామపవశమునఁ గదనప్రయత్నమే మానుదునేమోయని వెంట బ్రాహ్మణ బాలుఁడగు ననపోతు నుంచుకొని యత్తవారింటికి బయలుదేరెను. వీరమేడపిలోనె మఱియొక వీధి బాలునియత్తవారిల్లు. పెండ్లి జరిగి యెన్నియో దినములు కాలేదు. నాఁడు పెండ్లిపీఁటలమీద సిగ్గుతో నేమి చూచెనోగాని బాలచంద్రు నాతనిభార్యయగు మంచాల తేరి పాఱజూచి యెఱుంగదు.

మంచాల అర్ఘ్యపాద్యాదులొసంగి యుచితవిధిని దన భర్తను, అనపోతుని బూజించెను. దంపతులొకరినొకరు ప్రేమ పూర్వకములగు చూపులతోఁ జూచుకొనిరి. అనపోతు తాసి సమయమున నచటనుంటకియ్యకొనక, 'మిత్రమా! బాల చంద్రా! ఏడుగడియలలో రావలయును, నేను ద్వారముకడ వేచి యుందు'నని వెడలిపోయెను. బాలచంద్రుడు తాను సంగరమున కేగుచుంటినని మంచాలకుఁ జెప్పెను. ఆమె భర్త నాదరించి 'నాకు వీరపత్నియను పతివ్రతానామము సమకూర్చితివి. ఇంత కంటె నాకుఁ గావలసినది ఏమియున్నది. ఇదుగో ఖడ్గము దీని తో విరోధుల సంహరించి జయము సాధింపుము. బ్రాహ్మణులు ధర్మపరిపాలకులు. వారిని గాపాడుట రాజధర్మముగాన అన పోతును సంగరమునకుఁ గొనిపోకుము. ఒకవేళ నాతఁడు సంగర మున మరణించిన బ్రహ్మహత్యాపాపము వచ్చునని వా కొనెను. బాలచంద్రుఁడు తన భార్యవద్దను అత్తయగు రేఖాంబవద్దను సెలవుగైకొని యింటికివచ్చెను! తల్లి కుమా

కుని గాఁగిలించుకొని 'తండ్రీ యుద్ధప్రయత్నము మానవా?' యని బ్రతిమాలెను. బాలచంద్రుఁ డెంతకు వినఁడయ్యెను. కడకు ఐతాంబ ధైర్యము తెచ్చుకొని 'నేను మాత్రము వీరకాంతను కానా? నాభర్త వీరపత్ని బిరుదము, నా తనయుడు వీరమాతృబిరుదము నాకు బ్రసాదింపుచుండ జేజే తఁబోఁగొట్టనగునా' యని బాలచంద్రునకుఁ బెరుగుతోనన్నము కలిపిపెట్టెను. బాలచంద్రుఁడు భోజనానంతరమున వీరవేషము దాల్చి తల్లికి నాయనమ్మకు నమస్కరించి వారి దీవనలనంది కదనరంగమునకుఁ బయనమయ్యెను. పూర్వోక్తమిత్రులందఱు బాలచంద్రునితో సంగరమునకు బయలుదేరిరి. బాలుడు అనపోతును వెనుకకుఁ బంపదలంచి కత్తియును డాలును ఉంగరమును మంచాలవద్ద మఱచివచ్చితిని. పరిచితుఁడవు నీవె పోయి తెమ్మనెను. అనపోతు పోకతప్పినదికాదు. అతని బోవనిచ్చి బాలుఁడు ఒకతాటియాకుమీఁద నేదివ్రాసి రావిచెట్టు కొమ్మకుఁగట్టి త్రిపురాంతకము, ముటుకూరు, గరికపాడు, వేశ్యవాగుగ్రామములు దాటి బాలుఁడు పరిజనముతో వచ్చుచుండ మధ్యగ్రామములవారీ వీరపుత్రుని గౌరవించిరి. తరువాత కనుమవద్దకు వచ్చువఱకు నాయకురాలు త్రోవగాచి యుండెను. బాలుఁడు వేఱొకత్రోవను బయలుదేఱి నల్లగొండ నత్తమునకు మిత్రులతో నెక్కెను. గుట్టమీఁదనుండి నలగామరాజుబలమును సేనానాయకులను శిబిరములను జూచెను మంత్రిణియగు నాయకురాలిని సర్వసేనాధిపతియగు నరసింగ

రాజును బాలుఁడు గుర్తించెను. కొదమసింగమువలె గుట్టపై నుండి విరోధిసేనమీఁదికి బాలుఁ డురుకఁబోవ మిత్రులు వారించిరి.

బాలచంద్రుఁడు గుట్టదిగి పెదమలిదేవుని శిబిరమునకు జేరఁబోవ గండుకన్నమనీఁడు వారించెను. తోడ్కొని రాజును సమీపించి, రాజా! సంధికి రాయబారముల కిది యదనుగాదు వనవాసములచే మీహృదయములు నీరసమైయున్నవి. దేహము శుష్కించినది. పరాభవ దైన్యముచేఁ దలవ్రాలినది. ఇంక నేమని రాయబారములు చేయుచున్నారు. విరోధులను రణరంగమున బోరిగొనుటో మరణించుటయో మనవిధి. ఇదుగో! నేను రణరంగమున కురుకుచున్నాను. రాదలఁచినవారు రండు. రెండని బాలచంద్రుఁడు వైరిశిబిరముల కభిముఖముగాఁ బోవ సమకట్టెను. కొమ్మరాజను నొక వీరుఁడు బాలునాపి వీరకుమారా? తొందరపడకుము. నా తనయుని నరసింహరా జక్రమముగా రాయబారమునకుఁ బోవఁ జంపినాఁడు. నీవు వానిని జంపి నాకు శాంతిగూర్చెదవని నమ్మినాఁడను. కోపముతోఁ గార్యముగాదు. కొలఁదిసేపులో సంగ్రామము కట్టాయితము కాఁగలదు. ఉపాయము లేనిది వైరిచిక్కఁడు. అని చెప్పుచుండు నంతలో రెండుపక్షములవారికి సంధి కుదిరినది. యుద్ధప్రయత్నములింక నవసరములేదని పెదమల్లదేవుఁడు తన సేనామధ్యమున

నిలిచి చెప్పెను. ఇంతలో నొకయువతి బాలచంద్రునివద్దకు వచ్చిఅయ్యా! నేను మాడచి యనుదానను, మేడపిలో అంతిపురి కాపాడుదానను. నీవు రావిచెట్టునకుఁగట్టిన చీటి చదివి యుద్ధమునకు బాలుడు రావద్దనినాఁడు. నేను బ్రతికి లాభమేమని అనపోతు మెడగోసికొని మరణించుచు నీకిమ్మని వీరకంకణము జందెము ఇచ్చినాఁడు. అనపోతుభార్య సహగమనము చేసెనని చెప్పి కంకణము జందెమునొసంగెను. బాలచంద్రున కొండలెఱుఁగనంతటి యావేశమువచ్చెను. వీరకంకణము చేతికి ధరించుకొని జందెము మెడలో వేసికొనెను. అనపోతూ! మిగిలిపోకుము. నిన్ను స్వర్గమునకుఁ జేరులోగఁ గలిసికొందునని బాలుడు పలికి సైనికుల నందఱను సంగరమునకుఁ బురిగొల్పెను. నేను బాలుడనని మీరుసంకోచింపకుఁడు. ఒకప్పుడు నేనుకుమారస్వామిని. ఇంకొకప్పుడు నేను అభిమన్యుఁడను. వేఱొకప్పుడు నేను సిరియాళుఁడను. దేహములు నశించుచున్నవిగాని ఆత్మ నశించుటలేదు. వీరునకు సంగరమరణమును బోలిన దింకొకటిలేదు. యుద్ధరంగమునకు రండు. ఆలసింపకుఁడని బాలుఁడు పలికి యుద్ధమునకుఁ త్రోవదీసెను. భోజనముచేయుచున్న వీరులందఱు విస్తళ్లు నాగులేటిలో వైచి ముందునకు దుమికిరి. ఈసంబరముజూచి యెదుట పక్షమువారు సిద్ధపడిరి. భగవంతునకుఁగూడ సంగరమిష్టము వలె నున్నది. చెన్నకేశవుని యనుగ్రహమెటులున్న నటులె జరుగునని బ్రహ్మనాయకుఁడు బాలచంద్రునకుముందు, దక్షిన

వారికి దరువాత శంఖముతోఁ దీర్థమునొసంగి వీరగంధము మేనఁబూసి వీరతాంబూలము లొసంగి: యుద్ధరంగమునకు సాగనంపెను.

రెండుపక్షములవారు భయంకరసంగరమునకుఁ దార సిల్లిరి. రక్తము ప్రవహించెను. అనేకులు వీరులు వీరమరణ మొందిరి. ఒకప్రక్క నాయకురాలు, వేరొకప్రక్క నరసింగ రాజు బాలచంద్రుని బలమును జుట్టుముట్టిరి. కమ్మర కాచెన్న, మంగల మల్లు, చాఁకల చందు, కుమ్మర పట్టి వెలమ దోర్నీడు, కంసాల చందులను బిలిచి వారివారి స్వాధీన మునఁ గొంతసైన్యముంచి విరోధిసైన్యమును ఆవరించి రూపు మాపుట కన్నిదిక్కులకుఁ బంపించెను. బాలచంద్రుఁడు స్వయ ముగాఁ గొంత బలముతో నరసింగరాజు నెదిరించెను. నల గామరాజు మంచెపై నెక్కి తన బలము చెందు వినాశనము నకుఁ బరితపించుచు, ప్రోత్సాహవాక్యములు పలుకుచుండెను. మలిదేవాదులు, బ్రహ్మనాయకాదులు బాలచంద్రుని యుద్ధ కౌశలమును వేయినోళ్ళఁ బ్రశంస చేయుచుండిరి. నరసింగ రాజు బాలచంద్రుని ధాటికాగలేక వేఱొకతోవ కేఁగి హతశేషమగు సైన్యమును సంగరమునకుఁ బురికొల్పు చుండెను. తన ముందటనున్న మత్తగజముపై నెక్కినవీరుని నరసింహరాజని తలంచి బాలచంద్రుఁడు కుప్పించి ముందు నకు దుమికి యేనుగుమీఁదివానినిఁ గ్రిందికిలాగి వానితల ~ండాడి తన బల్లెమునకు గుచ్చుకొని తీసికొనిపోయి బ్రహ్మ

న్యాయంబు మలిదేవాదులకుంజూఁ బెట్టి నాధర్మము నిర్వహించితినని చెప్పెను. కొమ్మరా జాతలను బరిశీలించి 'యిది నరసింహా రాజు తలకాదు. నరసింహారాజును జంపవలసిన భారము బాలునిపైననే గల' దని చెప్పెను. వెంటనే మిత్రులను సైనికులను వెంటఁగొని లేడిపైకి దుముకు సింగపు గొదమవలె విరోధులమధ్య దుమికెను. సేదదీర్చుకొని నరసింహారాజు బాలచంద్రుని నెదిరించెను. శస్త్రాస్త్రములవలె నీ వీరులిద్దరు చాలసేపు పోరిరి. నరసింహారాజు అలసిపోయెను. బాలుఁడు నరసింహారాజెక్కిన యేనుఁగుకుంభము నొక చంద్రవంక బాణముతో నటికెను. ఏనుగు ముందునకు మొగ్గెను. బాలుఁడు ఏనుఁగు కుంభస్థలముమీఁదినుండి పైకెక్కి నరసింహారాజును క్రిందికీడ్చుకొనివచ్చి కత్తితోఁ గుత్తుకఁగోసి బల్లెమునఁ జివరఁ బెట్టుకొని వెంట తమ్ములు జయవాక్యములు పలుకుచుండఁ బెదమలిదేవుని కొలువుకూటమున కా తలఁ దెచ్చెను. వీరులందఱు బాలచంద్రుని పరాక్రమమునకు హర్షించిరి. తన యన్నచాయనకుఁ బెదమలిదేవాదులు వగచిరి. నేను చేతిమీఁదుగఁ బెంచిన నరసింహారాజున కెంతటి దుర్గతి . కుమారుని వలనఁ గలిగెనని బ్రహ్మనాయుఁడు విలపించెను. వాత విచారము కోపముగా మారి తనయునిఁ జూచి, బాలుఁడా! నిన్ను సంగరమునకుఁ బిలిచిన దెవరు? పిన్నవాఁడవు యిపే త్రుంపఁబడుకుతునుకవైతివే! యని బ్రహ్మనాయుఁడు నొవ్వ

నాడెను. బాలుఁ డామాటకుఁ గోపించి, 'తండ్రీ! నాఁడు పుత్రదుఃఖముతో నున్న కొమ్మరాజు నోదార్చి నన్నాయన చేతిలోఁ బెట్టి యలరాజును జంపిన నరసింగరాజును బాలుఁడు చంపఁగలఁడంటివి. నాధర్మము నేను నెఱవేర్చితిననెను. బ్రహ్మనాయఁడు బాలచంద్రునిఁజూచి ఒక్కవీరుని జంపి నంతనే శూరుఁడవైతివా? అరులకు వెన్నుఁజూపి పాఱివచ్చితివి గదాయని యెత్తిపొడిచెను. బాలచంద్రునియొడలు మండి పోయెను. విరోధిసైన్యమును జక్కాడి రాజుతల తెచ్చినందులకు వెన్నుజూపి వచ్చితినని కన్నతండ్రియే నొవ్వనాడినాఁడు. ఇకఁ గదనమునుండి వెనుకకు బ్రాణములతో రాను. ఇదయె నాప్రతిజ్ఞయని బాలుఁడు సవయస్కులగు మిత్రులతోఁ గదనరంగ మలంకరించెను.

'చిన్నవాఁడు గాఁడురాచిచ్చులపిడు'గని బాలునివిరోధులందఱు చుట్టుముట్టి వివిధాస్త్రములచే నొప్పించిరి. మిక్కి బోని పరాక్రమమున బాలచంద్రుఁడు ముందునకు నడచుచుఁ డెను. అభిమన్యుఁడు పద్మవ్యూహము భేదించినటుల బాలుఁడు విరోధిబలములఁ జించి చెండాడెను. కొంతసేపటికి విరోధులు చెలరేగి కమ్మర కాచెన్నను గడతేర్చిరి. మంగల మల్లును మ యించిరి. చాకలచందును జంపిరి. కుమ్మరపట్టిని గూల్చిరి. పా మదోర్శిని చిత్రవధ చేసిరి. బాలచంద్రుఁడు తనసైన్యమునం యు నొకమాఱు పాఱజూచెను. మిత్రులందఱు మరణించిరి

అనపోతు అందఱికంటె ముందె మరణించెను. బ్రతికి లాభము లేదని బాలుడు తెగబడి చిక్కినవైరిని జిక్కినటుల నఱుకుచుండెను. విరోధులందఱు బాలుని మేనినిండ బాణములను నించిరి. బాలునకు బ్రతుకుమీద నాశతీరెను. బాలచంద్రుడు తన మిత్రులందఱకుఁ గన్నీటితోఁ దర్పణాదులొసంగి అలుగుల నేలబ్రాతి తనమిత్రుల నెత్తుటిలోఁ దడిపిన యక్షతలతో నాయలుగులకుఁ బూజచేసి కనులు మూసికొని వానిపై నొరిగి మరణించెను. బాలుని మరణమున శుభయసైన్యములందు హాహాకారములు చెచ్చరిల్లెను.

బాలుని మరణవార్త విని మంచాల చిచ్చురికెను. బాలుని భౌతిక దేహము నీవిధముగా మహారణమధ్యమున బడి నశించెను. అతనియస్థికల గంగధారలోఁగలిపిరి. ఈకథ జరిగి యిప్పటికి దాదాపు ఎనిమిదివందల సంవత్సరములు జరిగినను, మనము బాలచంద్రుని మఱచిపోవలేదు. కవులా వీరుని జీవితమును వీరగేయములుగా వ్రాసిరి. శిల్పులావీర మూర్తి మూర్తి శిలలపై జెక్కిరి. వీరులా బాలుని యాదర్శముగాఁ గైకొనిరి. నేటికిఁ బాలదాసరుల పూజయందు బాల చంద్రుని యొక్కయు, నతని సోదరులు మిత్రులగు నితర బాలురయొక్కయు పూజ మనము చేయుచున్నారము. ఆంధ్ర బాలకవర్గమునకు త్యాగధనుఁడగు బాలచంద్రుని జీవితము ఆదర్శప్రాయమగుటకు భగవంతుఁ డనుగ్రహించుఁగాత.



బాలచంద్రుఁడు యుద్ధభూమిని జనిపోవుట.

# ఖడ్గ తిక్కన.

ఆంధ్రులలో ఖడ్గతిక్కన మిగుల బ్రసిద్ధుడు. ఈతని పరాక్రమజీవితము పల్లెపదములందును జాటుపద్యములందును నిమిడియుండుటచేఁ జిరకాలమునుండి యాంధ్రసోదరులీశూరమూర్తిని స్మరించుచున్నారు. ఇతడు నియోగి బ్రాహ్మణుడు. సిద్ధనామాత్యునకుఁ బోలమాంబకు జనించిన యేడుగురు కుమారులలోఁ బెద్దవాడు. గౌతమస గోత్రుడు. భారతమును రచించిన తిక్కనసోమయాజితండ్రియగు కొమ్మనామాత్యుడును, ఈవీరుని తండ్రియగు సిద్ధనామాత్యుడును నొక తల్లిబిడ్డలు గాన నీవీరులిద్దఱు సహోదరుల కుమారులు. ఖడ్గతిక్కన బాల్యమున సంస్కృతాంధ్రభాషలభ్యసించి రాజనీతిశాస్త్రమునందును ధనుర్విద్యయందును బ్రసిద్ధిగడించి యాకాలమునఁ బ్రసిద్ధుఁడై నెల్లూరు రాజ్యమును బాలించుచున్న మనుమసిద్ధి నృపాలుని యొద్ద సేనానాయకుఁడుగ నుండె. యాతఁడు గడించిన విజయములన్నింటికిఁ దానే మూలాధారమయ్యెను. ఈవీరవతంసుఁడు విద్యావిత్తరణ విక్రాంతులలో సరిపమానుఁడై విక్రమసింహపుర రాజ్యమును దానొక్కఁడె భుజపీఠిపై ధరించెనని చెప్పుదుమేని యంతదతిశయోక్తి కలదని చరిత్రవిదులు తలంపరేగు.

ఖడ్గతిక్కన మనుమసిద్ధి కే యుద్ధసంగ్రామములలో నెంతెంత సహాయపడెనో నిర్ణయించు నాధారములు లభించుట

లేదు. ఇతడు సర్వసేనానాయకుఁడుగా నుండి విరోధుల వం
చించి జయములఁ బడసెననుటకు వలయు గ్రంథాధారములు



ఖడ్గతిక్కన.

కలవు. వీరశిరోమణి యగు ఖడ్గతిక్కన యింత ప్రసిద్ధుఁ డగు టకు నాతని తల్లియు వీరమాతయు నగు పోలమాంబ స్తన్య ప్రభావమని వేఱుగాఁ జెప్పఁబనిలేదు. ఖడ్గతిక్కన కేవలదండ నాయకుఁడుగ నుండి కులాచారములు విడనాడినవాఁడు కాఁడు. ఇతఁడు వేదగానలోలుఁడు. బ్రాహ్మణకుటుంబ పోషకుఁడు. దానకర్ణుఁడు. విరోధిఖండన చణుఁడు. ఈమహామహుని యాశ్రయమున "రాయవేశ్యా భుజంగరాజమూర్తి గంధవారణా"ది బిరుదము లన్వర్థములై ప్రశస్తిమంతము లయ్యెను. ఒకకవితా విషయమునఁ జెప్పుట కాధారములు లేవుగాని పరాక్రమౌ దార్య పాండిత్యరాజకీయ పరిజ్ఞానాది మహాపురుష ధర్మముల లోఁ దిక్కన సోమయాజికి ఖడ్గతిక్కన యించుకేనియుఁ దీ పోవఁ జాలఁడనియుఁ బై పెచ్చు పయిజేయిగా నున్నాఁడనిఁ జెప్పనగును. కేతనకవి యీమహావీరుని గుణవర్ణనము మిగు మనోహరముగాఁ గావించి ప్రశంసించియున్నాఁడు. ఆయ వర్ణన భాగములఁ దిలకింతుమేని ఖడ్గతిక్కన నాంధ్రపరశు రాముఁడని ప్రశంసింప వచ్చును.

ఖడ్గతిక్కన విజయము తెలుగు కథాగ్రంథములలో కాటమరాజుకథయొకటి. కొట్టరువువంశతిలకుఁడగు ఖడ్గతిక్కన పరాక్రమ జీవితము, స్వామిభక్తి యీగ్రంథమువలన నెఱుంగ వచ్చును. విద్యాప్రియులగు నాగరకులకుఁ జిరకాలమునుండి

కాటమరాజుకథ వినిపించి ఖడ్గతిక్కనజీవితచరిత్రమును విస్మృతి తరంగము చాటున నదృశ్యము కాకుండఁ గాపాడిన వీరకథాగాయకులకుఁ బ్రకృతకథాపఠనావసరమునఁ గృతజ్ఞత దెలుపుట మన విధులలో నొకటియై యున్నది.

కాటమరాజను యాదవవంశజుఁడు నెల్లూరుమండలమందుఁగల కనిగిరిసీమలోని యెఱ్ఱగడ్డపాడుప్రాంత భూతములను బాలించుచుండెను. ఇతఁడు గొప్ప భూస్వామియు నపరిమిత పశుధనము గలవాఁడునై సజాతీయుల కందఱకధిపతియై మిగులఁ బలుకుబడితోఁ గులపెద్దయను గౌరవముతోఁ గాలయాపనము చేయుచుండెను. ఆకాలమునఁ గొన్నిసంవత్సరము లనావృష్టి తటస్థించుటచే బ్రజలకుఁ బశులకుఁగూడ చాలచిక్కులు గలిగెను.

యాదవులు విశేష పశుగణము గలవారగుటచేఁ దమ బీళ్లన్నింటను గడ్డిలేకుంట చూచి తృణజల సమృద్ధిగల తావులకేఁగి పశువుల మేపుకొని దేశము సుభిక్షమైనపిమ్మట తిరిగి యిండ్లకుఁ జేరనిశ్చయించిరి. కొందఱు యాదవులు దూరదేశములకుఁబోయి పైరుపచ్చలు చల్లగానుండు ప్రదేశము తాము చూచినంతలో నెల్లూరిచెంతగల పాలేరుతీరమని వచ్చి తమ రాజున కెఱింగించిరి. కాటమరాజు పశుగణమును యాదవులను వెంటగొని నెల్లూరిప్రాంతములకేఁగి యట తనపశువులను బశుపాలకులను నాపి, ఆప్రాంతములఁ బాలించు మనుమసిద్ధి

భూపాలుని దగ్గరకుఁబోయి తనకష్టములనెల్ల నెఱింగించి పాలేటి తీరమునఁగల బీళ్లు కొంతకాలము పశువులు మేపుకొనుటకుఁ బుల్లరికిఁదీసికొనెను. పాలేటితీరమునఁ గాటమరాజు కొన్నాళ్ళు నివసించి పశుగణమును బోషించుకొని కాలము గడుపుచుండు నంతలో ఎఱ్ఱగడ్డపాటినుండి కొందఱు గొల్లలువచ్చి వర్షములు కురిసినవనియు దేశము సుభిక్షముగానున్నదనియుఁ బశువులకు గూడ మేఁతగలదనియు వర్తమానము చెప్పిరి. కాటమరాజు ఆ వార్త విన్నంతనె మిగులసంతసించి గంగమ్మకు జాతరలు చేయించి పరిమితివఱకు బశువుల మేపుకొనలేదు గాన మనుమసిద్ధికి మనము పుల్లరినీయ నవసరములేదని తమలోఁదాము నిశ్చయించుకొని యాదవులను బశువులను వెంటబెట్టుకొని పోవుచుండ మనుమసిద్ధిభటు లడ్డగించిరి. వారలఁ దిరస్కరించి యాదవులు తమ ము వెడలిపోయిరి. భటులవలన మనుమసిద్ధి యీవర్తమానము విని మండిపడి యాదవుల దురాగతమున కేవగించి అన్నము భట్టు అను నొకబ్రాహ్మణుని కాటమరాజువద్దకు పుల్లరి యొసంగుఁడని కోరుటకుఁ బంపెను. యాదవులు పుల్లరినీయవలసినయవసరము లేదనియుఁ, గొలఁదికాలమె పశువులను మేపితిమిగాన నీయక పోవుటయె ధర్మమనియు, రాయబారములకు లొంగి కనకవర్షము గురిపించుటకు గొల్లలు పిచ్చివాండ్రు కారనియు నందఱిపక్షమున కాటమరాజు వర్తమానము చేసెను. యాదవులను వంచింపకున్న లాభములేదనియు పుల్లరి విడిచిపెట్టితిమని పౌరులకుఁగూడ

నలుసు కలుగుననియు మనుమసిద్ధి భూపాలుఁడు సర్వసేనానాయకుఁడగు ఖడ్గతిక్కనయనుమతిచొప్పున సంగరమునకుఁ దలపడియెను.

ఈవార్త యాదవులు విని కాటమరాజున కెఱింగించిరి. కాటమరాజు తన బంధువులు వీరులు నగువారికందఱకు వర్తమానము లంపి పిలువనంపి సైనికబలము నాయత్తపఱచెను. కొండవల్లి చల్లపిన్నమ్మనాయకుఁడు, దొనకొండ అయితమరాజు, ఎఱ్ఱయ్య, భట్టామరాజు, కరియావులరాజు, వల్లభన్న, కేతిముద్దయ్యనాయఁడు, పురుషోత్తమరాజు లోనగు సుప్రసిద్ధ యాదవప్రముఖులు సైనికసహాయులై కాటమరాజు పక్షమున జేరిరి. కాటమరాజు తన సేనకుఁ గ్రమశిక్ష నొసంగి ఎన్నమనాయని మంత్రిగను బ్రహ్మరుద్రయ్యయను బ్రాహ్మణుని సేనానాయకునిగను నేర్పఱచి సంగరమునకు సైన్యసహితముగ బయలుదేరెను. మనుమసిద్ధిపక్షమున సర్వసేనానాయకుఁడగు ఖడ్గతిక్కన కొంతసైన్యమును వెంటగొని ఎఱ్ఱగడ్డపాటికి బయలుదేరెను. రెండు సైన్యములును బాలేటియొద్దనున్న పంచలింగములకడ సంగరమునకుఁ దలకొనెను. యాదవులు చెక్కుచెదరులేక మహావేశము స్వతంత్రదీక్ష నూఁతగాగొని ముక్కాకలదీరిన ఖడ్గతిక్కనసైన్యముతో మిగుల భయంకరముగాఁ బోరాడిరి. ఖడ్గతిక్కన నిర్లక్ష్యభావముతో యాదవులను సరకుసేయక స్వల్పబలమును మాత్రమె వెంటతెచ్చెను. ఐనను నిరుత్సాహపడక యాదవ

సైన్యము నెదిరించి పట్టుదలతోఁ బోరాడుచుండెను. యాదవ సైన్యము ఖడ్గతిక్కన సైన్యమును జాలవఱకు నాశనముగావించి ముందునకు వచ్చుచుండెను. ఈపరాజయ పరిస్థితులఁగాంచియేని జంకక ఖడ్గతిక్కన హతశేషమగు సైన్యముతోఁ జిరకాలము పోరాడెను. యాదవసైన్యము చుట్టుముట్టి ఖడ్గతిక్కననునాతని స్వల్పసైన్యమును బట్టుకొనిరి. ఖడ్గతిక్కనను కాటమరాజు సమీపించి "బ్రాహ్మణోత్తమా! సంగరము మానుకొనుము. బ్రాహ్మణులఁ జంపిన మాకు బ్రహ్మహత్య వచ్చును. అగ్రవర్ణులగు మీరు మాతోఁబోరుట న్యాయముగాదు. మమ్ముఁ గోపింపక సంగరయత్నము మానుకొను"మని ప్రార్థించి విడిచిపెట్టెను. ఖడ్గతిక్కన చేయునదిలేక గుఱ్ఱము నెక్కి నెల్లూరికేగి సైన్యముతో రాఁదలంచి గృహాభిముఖుఁడయ్యెను.

పరాభవదుఃఖముతో ఖడ్గతిక్కన గృహముచె మంచములోనున్న సిద్ధనామాత్యుఁడు తన కుమారుఁడు పావచ్చినాఁడని తలంచి "ఛీ పాఱుబోతా! తుచ్ఛమగు ప్రాణముఁకాశపడి యిల్లు చేరిన నిన్నుఁ జూచిన పాపమువచ్చు"నని ఖడ్గతిక్కనను నొవ్వనాడెను. తండ్రియొనరించిన తిరస్కారముచే ఖడ్గతిక్కనహృదయము కలఁగిపోయెను. ఇంటిలోనికిబోవ నతని భార్య చానమ్మ భర్తను సాదరంబునఁ జూచి 'వంటయైనది, స్నానముచేయుఁ' డని చెప్పి స్త్రీలు స్నానముచేయుతావున నొక మంచము చాటుచేసి పసుపుకుంకుమ యట పదిలపఱచెను. ఖడ్గ

తిక్కన తన భార్యను జూచి యదియేమని యడుగ సంగరము నుండి పాఱివచ్చిన భర్తలను వీరపత్నులు గౌరవింపఁదగిన విధ మిదియొకదా? యనిప్రత్యుత్తర మొసంగెను. తన ప్రమాద మునకుఁ దాను నొచ్చుకొని యెట్టులో స్నానము గావించి ఖడ్గ తిక్కన భోజనగృహములోని కేఁగెను. తల్లి పోలమాంబ అన్నము వడ్డించెను. కుమారుఁడు భుజించుచుండెను. మజ్జిగకు మాఱుగా తల్లి పాలు వడ్డించెను. అవి విఱిగిపోయియుండుటచే నిట్టులున్న వేమి యని ఖడ్గతిక్కన తల్లినడిగెను. ఆమె పక్కున నవ్వి" విరోధులను జయింపలేక పందవై నీవు వచ్చుటచేఁ బశువులు విఱిగినవి, పాలును విఱిగె" నని చెప్పెను. ఆమాటవిని యెట్టులో భోజనవ్యాపారమును ముగించి ఖడ్గతిక్కన పరాభవ దుఃఖము నిష్ఠురోక్తులవలని రోసము మదిలో నుంచుకొని "జయించి విక్రమసింహపురమును జేరవలయును, లేదా సంగరమందె మరణింపవలయును. ఇదియె నాప్రతిజ్ఞ" యని పలికి రాజమందిరమున కేఁగి క్రొత్తసైన్యమును దనవెంట గైకొని రివ్వున సంగ్రామరంగము చేరెను.

ఖడ్గతిక్కన సైన్యసహాయుఁడై సంగరరంగము నలంకరించుచున్నాఁడని యాదవు లాలించి వారును రణరంగము నలంకరించిరి. ప్రళయకాల నటునివలె విజయముపై లక్ష్యముంచి నిశ్చలముగాఁ బోరాడు ఖడ్గతిక్కనవిక్రమమునకు వెఱచి సైనికులు త్రోవనీయసాగిరి. కాటమరాజు సైన్యము

చలించెను. కడకుఁ గర్తవ్యము దోఁచక కాటమరాజు రణరంగ మునఁ బ్రవేశించి తనకడ్డముగానున్న ప్రతిపక్ష సైన్యమును దెగటార్చుచు ఖడ్గతిక్కనను సమీపించి నమస్కరించి "బ్రాహ్మ ణోత్తమా! పోరుడుగుము, పోరుడుగుము. బ్రహ్మహత్యా పాపము మాకంతములఁ జుట్టకుము. చేతులార నిన్ను వధింపఁ జాలము. వెనుకకు మరలిపొ"మ్మని దోసిలియొగ్గి సవినయ ముగాఁ బ్రార్థించెను. ఖడ్గతిక్కన యాతని నగౌరవించి "చేత గాకున్న పుల్లరినోసంగి శరణు గోరుము. శక్తియున్న నెది రింపుము. పెక్కుమాటలేల? బ్రాహ్మణుని జంపఁదగదని ధర్మ శాస్త్రములు వల్లింపఁ దలంచితివేని మీకు సంఘవిలయము తప్పదు పొమ్మ"ని తిరస్కరించెను. కాటమరాజు చేయునదిలేక తన సైన్యమును ఖడ్గతిక్కనమీఁదికిఁ బఱపి కాటమరాజు స్వయ ముగా సంగ్రామభారము వహించెను. రెండు మూఁడు మాఱులు మంచి యవకాశము లభించినను బ్రాహ్మణ భక్తుఁ డగు కాటమరాజు ఖడ్గతిక్కనను విడిచిపెట్టెను. ఖడ్గతిక్కన యట్టి యవకాశము తనకుఁ జిక్కినపుడు చేతనైనంతవఱకుఁ బ్రతిపక్షసైన్యమును మారణము చేయుచుండెను. ఈ పరిస్థితు లను గమనించి సేనానాయకుఁడగు బ్రహ్మరుద్రయ్య కాటమ రాజువద్దకేఁగి, "నృపాలకా! నీవాగుము. బ్రాహ్మణుఁడని ఖడ్గ తిక్కనను నీవు వదలుటచే నాతఁడు మనసైన్యమును రూపు మాపుచున్నాఁడు. వర్ణాశ్రమ ధర్మములు విచారింపవలసినది సంగ్రామరంగమందా? పేరునకు నీవు సేనాధీశ్వరుఁడుగ

నుండుము. నేను జయము సాధింతు"నని ఖడ్గతిక్కనను సైన్య సహాయముతో నెదిరించెను. ఉభయులు రణకౌశలులగుటచేఁ జిరకాలము జయాపజయ నిర్ణయముల కనువుగానటులఁ బోరాడిరి. కాలవశమున వీరవతంసుఁడగు ఖడ్గతిక్కన మరణించెను. స్వామిభక్తిగల యాతనియశ్వము ఖడ్గతిక్కన శిరమును నోటఁ దగిలించికొని నెల్లూరిలోని తన యజమాని యింటివద్దకుఁ జేరి సకిలించెను. ఇంటిలోని వారందఱువచ్చిచూడ ఖడ్గతిక్కనశిరము గోచరించెను. ఖడ్గతిక్కన రణరంగమున మరణించినవార్త విని నంతనె నగరమంతయు క్షోభించెను. వీరవతంసు లందఱు కన్నీరు గార్చిరి.

మంచములోనున్న సిద్ధనామాత్యుఁడు కుమారుని వీర మరణవార్త వినినంతన యానందబాష్పములు విడుచుచుఁ బరలోక మలంకరించెను. ఆయన తల్లియగు ప్రోలమాంబ కుమారుని శిరము ముద్దాడి యిప్పటికి వీరమాత ననిపించుకొంటినని ప్రాణములు విడిచెను. చానమ్మ భర్తతల నొక కాష్ఠమునం దుంచి తానును నందుఁజొచ్చి సర్వజన ప్రశంసాపాత్రురాలై కీర్తివహించెను. ఖడ్గతిక్కన భౌతికస్వరూప మేనాఁడో నశించినది. చరిత్రాభిరతులు నుత్సాహశాలురునగు నాంధ్రయువక హృదయములం దామహావీరుని తేజము నేఁటికిఁ బ్రకాశించుచున్నది. ఈవీరునిజన్మకాలము తెలియదుగాని క్రీ. శ. ౧౨౦౦-౧౨౮౦ వఱకున్న తిక్కనసోమయాజికి సమకాలికుఁడును, సోదరుఁడును గాన నించుమించుగా నాకాలముననే యున్నటుల

విశ్వసింపవచ్చును. స్వామిభక్తిపరాయణతయందును, శూరత్వమునందును నీవీరవతంసుఁడు ఆంధ్ర వీరసందోహమునం దవతంసప్రాయుఁడై యున్నాఁడు. ఆంధ్రుల పునరభ్యుదయమున కీవీరుని సంకల్పము దోహద మొసంగుగాక.

# ప్రతాపరుద్ర చక్రవర్తి.

మన కథానాయకుఁడగు ప్రతాపరుద్రచక్రవర్తి కాకతీయ వంశజుఁడు. నీరాధినీరుఁడగు నీరాజసింహుని చరిత్రము తెలిసికొనుటకు ముందీయన పూర్వులను గుఱించి తెలిసికొనుట యావశ్యకము. తొలుత కళ్యాణపురరాజులగు పశ్చిమచాళుక్యులకడ దండనాయకుఁడుగ నున్న ప్రోలరాజను వీరుఁడు తద్రాజ్యపతనానంతరము హానుమకొండ రాజధానిగ జేసికొని స్వతంత్రపతాకము స్థాపించి యాంధ్రదేశములోఁ జాలభాగము తన పరిపాలనమునఁ జేర్చుకొనెను. ఈనరపాలుని పుత్రుఁడగు రుద్రదేవుఁడు పితృసంపాదితమగు రాజ్యమును మిగుల నభివృద్ధిలోనికిఁ దెచ్చెను. ఈ నరపాలుఁడు శిల్పములకు లలితకళయగు కవితకుఁ గూఁడ నభివృద్ధి మార్గముల నన్వేషించెను. ఈయన యనంతరము ఇతని తమ్ముఁడగు మహాదేవరాయల పుత్రుఁడు గణపతిదేవుఁడు రాజ్యమునకు వచ్చెను. ఈనృపుని కాలమునాఁటికి ఓరుగల్లుకోట పూర్తి

యయ్యెను. తన సామ్రాజ్యము నీతఁ డోరుగల్లులో స్థాపించి చాళుక్యులను చోళులను జయించి యభివృద్ధిలోనికిఁ దెచ్చెను. పుత్రసంతానము లేకపోవుటచే నీయనపుత్రి రుద్రమదేవి రాజ్యమునకు వచ్చి చిరకాలము మహోత్తరముగ నాంధ్ర సామ్రాజ్యమును బాలించెను. పితృదత్తమగు రాజ్యము నీయమ విస్తరింపఁజేసి తిరుగఁబడిన రాజులఁ బిలుకుమార్చి యాంధ్రజాతియం దంతర్హితమైన పరాక్రమము నీయమ యొక్కమాఱు బ్రజ్వలింపజేసెను. ఈయమకుఁ బురుషసంతతి లేదు. ముమ్మడమ్మ, రుయ్యమ్మయను నిరువురు కుమార్తెలు గలరు. ముమ్మడమ్మను చాళుక్యాన్వయుఁడగు వీరభద్రరాజు, రుయ్యమ్మను ఇందులూరి అన్నభూపతియుఁ బెండ్లాడిరి. అల్లుడ్లిరువురు ప్రత్యేక మండలాధిపతులైనను రుద్రమదేవికిఁ గుడిభుజములవలె నుండి సంగరములం దాయమకు సాయపడుచు విజయలక్ష్మిని గనుసన్నలలో నుంచిరి. రుద్రమదేవి తనపుత్రికలకుఁ బుత్రసంతానము గలిగెనేని వారికి రాజ్యము స్వాధీనము జేసి కృతార్థురాలు గావలెనని సంకల్పించెను. పెక్కువ్రతములు నాచరించెను. ఎన్నియో యాలయములు గట్టించెను. కానవచ్చిన దేవరలకెల్లఁ దాను మ్రొక్కి కుమార్తెలచే మ్రొక్కించెను. అయినవోలు మైలారుదేవరకు, కొలనుపాక సోమనాథునకు వేములవాడ రాజేశ్వరునకు, మొగిలిచర్ల ఏకవీరాదేవికి మహోత్సవములఁ జేయించెను. దైవానుగ్రహమున ముమ్మడమ్మ గర్భ

వతి యయ్యెను. ప్రజ లీశుభవార్తవిని యుత్సవము లొనర్చిరి. శాలివాహనశకము......ఆనందనామ సంవత్సర చైత్రశుద్ధ పంచమి గురువారము బ్రాహ్మీముహూర్తమందు సూర్యుఁడు, అంగారకుండు, బుధుడు, బృహస్పతి, యుచ్చస్థానమునను, శని స్వక్షేత్రమున నున్న శుభసమయమున నొకబాలుఁ డుదయించెను.

ఓరుగల్లునగరమున నానాఁ డొనరింపఁబడిన వేడుకలకు మితములేదు. పురమంతయు నలంకరింపఁబడెను. ఆలయము లన్నింటియందు మహోత్సవములు జగన్మోహనముగా జరుపఁబడెను. మంగళవాద్యము లెడతెగక మ్రోయింపఁబడెను. రుద్రమదేవి నామకరణోత్సవము మహావైభవముగ నెరవేర్పఁ జేసి ప్రధానమంత్రి యగు శివదేవయ్య యనుమతిచే నాబాలునకు శ్రీమన్మహారాజ వీరప్రతాప రుద్రదేవచక్రవర్తియని నామకరణ మొనరించెను. శుక్లపక్షచంద్రునివలె నాబాలుఁ డభివృద్ధి నొంది బాల్యమునందె ధనుర్విద్యయు, వ్యాయామవిద్యయు, సంస్కృతాంధ్రములు, రాజనీతియు గురువులకడ నభ్యసించి యుక్తవయగు రుద్రమదేవితో రాజసభామందిరమున [illegible]ఁడై పరిపాలనావిధానమునుగూడఁ బరిశీలనము [illegible] నేర్చెను.

రుద్రమదేవి తనవారసుఁడైన మనుమఁడగు ప్రతాపరుద్రదేవునకుఁ బట్టాభిషేకము జేయసంకల్పించెను. ఈశుభసంకల్పము వినినంతన ప్రతాపరుద్రుని పట్టాభిషేకానందము ని[illegible]ంతి



ప్రతాపరుద్ర చక్రవర్తి

చాలదని తనమంత్రిని సైన్యమును వెంటఁగొని యొకమాఱు విజయయాత్రకు వెడలి పలువురు స్వతంత్రరాజులను సామంతులుఁగాఁగొని కొన్నిచోటుల జయస్తంభముల స్థాపించి నియమిత కాలమునకు రాజధాని చేరెను. ఓరుగల్లునగరము మిక్కిలి రమణీయముగా నలంకరింపఁబడెను. స్వయంభూదేవాలయమునందును, జెన్నకేశవాలయమునందును మహోత్సవములు జరుపఁబడెను. జరుపఁబడిన వేడుకలకు మితములేదు. మంగళవాద్యములచే భూనభోంతరములు మాఱుమ్రోఁగెను. వివిధ పాత్రములతోఁ బుణ్యనదులనుండి తెచ్చిన శుద్ధోదకముచేఁ బ్రతాపరుద్రచక్రవర్తిని బట్టాభిషిక్తుని గావించిరి. ప్రజల యుత్సాహము మేరమీఱెను. రుద్రదేవి యీశుభావసరము బురస్కరించుకొని యుద్యోగులందఱకు సత్కృతు లొనరించెను.

ప్రతాపరుద్రుఁడు రాజ్యమునకు వచ్చిన క్రొత్తలో కొందఱాతని నిరాకరించి కప్పములొసంగుటమానిరి. కొందఱు స్వాతంత్ర్య సంపాదనమునకుఁ గుట్రలు చేయసాగిరి. మనుమగండగోపాలుఁడు, అంబయదేవమహారాజు, త్రిపురారిదేవుఁడు లోనగు నెల్లూరు మండలపాలకులు తిరుగఁబడిరి. ప్రతాపరుద్రుఁడు తనసైన్యమునంపి మనుమగండగోపాలునిఁ దెగటార్పించి రాజ్యమున శాంతి స్థాపింపఁజేసెను. అంబయదేవ త్రిపురారి దేవాదులు తమంతతాము లోఁబడిరి. ప్రతాపరుద్రుఁడు స్వాతంత్ర్యము ప్రకటించుటకు యత్నించుచున్న పాండ్య చోళ

కేరళ దేశాధిపతుల జయింపనెంచి కోటలు కొత్తళములు బాగుచేయించి సైన్యమును మిగుల వృద్ధికిఁ దెచ్చెను. ఆ తరుణమున దేవగిరిదుర్గమున యాదవవంశజుఁడగు రామదేవుఁడు పాలించుచుండెను. ఇతఁడు భోగలాలసుఁడై కాలము గడుపుచు రాజ్యవ్యవహారములలో నంతగ జోక్యము పుచ్చుకొనకుండెను. ప్రతాపరుద్రుని త్రిలింగసామ్రాజ్యము మహోన్నత దశలోనుండుటచే నుత్తరహిందూస్థానమును పాలించు మహమ్మదీయ నృపాలురకు దేవగిరిని లోఁగొని యాంధ్రసామ్రాజ్యమును హరింపవలెనను కోర్కె జనించెను.

ఢిల్లీ సామ్రాజ్యమును జలాలుద్దీను ఫిరోజు పాలించు కాలమున అల్లాఉద్దీను అపరిమితసైన్య సహాయముతో నొకమారు దండయాత్ర కరుదెంచి దేవగిరిని ముట్టడించి జయించి రామదేవునివలనఁ గొంతధనము, అమూల్యరత్నములు, బంగారము గైకొని సామంతునిజేసికొని వెనుకకు మరలెను. ఆంధ్రసామ్రాజ్యముఁగొప్పతనము నతఁడు వినెనుగాని సైన్యములలసియుండుటచే ముందునకేఁగ మానెను.

అల్లాఉద్దీను తన మేనమామయగు జలాలుద్దీను ఫిరోజును చంపి తాను క్రీ. శ ౧౨౯౬ లోఁ బ్రభువయ్యెను. ఇతఁడు ఓరుగల్లు రాజ్యమును జయింపనెంచి సైనికబలమును ఆయుధ సామగ్రిని మిగుల నభివృద్ధిపరచి క్రీ. ౧303 లో మల్లిక్ నాయుబ్ కాఫూరనువాని సేనాధిపతిగ నొనర్చి పంపెను. మల్లిక్ నాయుబ్

క్కాఫూరు పదివేల గుఱ్ఱపుదళము నలుబదివేల సైనికులతో బయలుదేరి దేవగిరిచేరి యంతకుమున్న యాంకితుఁడైన రామదేవునియొద్ద నాతిథ్యములఁ గైకొని ఆంధ్రనగరము మీఁదికిఁ బయలువెడలెను. ఈవార్త ప్రతాపరుద్రదేవుఁడు వినినంతనె యవనసైన్యమునకుఁ బరాభవము సులభముగఁ జేయవచ్చునని పాండ్య చోళ కేరళదేశములపైకిఁ బోవ సర్వసిద్ధముగా నున్న యాత్మీయసైన్యమునకుఁ దన తమ్ముఁడగు అన్నమదేవుని యధ్యక్షుని గావించి యెదిరింపఁబంపెను. పురవరి మహాదేవనాయకుఁడు, సాహిణిమారయుఁడు, మేచయనాయకుఁడు బెండపూడిఅన్నయమంత్రి, ఎఱ్ఱప్పడినాయకుఁడు లోనగు మహావీరులకుఁ గొంత బలము నొసంగి తాను గోదావరీతీరమువఱకు యవనసైన్యము నెదిరింపనేఁగెను. ఆంధ్రసైనికులు మహమ్మదీయ సైన్యమును గోదావరి దాఁటకుండఁ బెక్కువిధముల నరికట్టిరి. పడవలలో వచ్చుసైనికులను సుడిగుండములలోఁ గూలఁద్రోసిరి. పడవఁ భగులఁగొట్టిరి. ప్రాణములకుఁ దెగించి హతశేషులగు యవనసైనికులు గోదావరి దాటి యీవలకు వచ్చినంతనె ఆంధ్రమహమ్మదీయ సైన్యములకు మహాసమరము జరిగెను. ఆంధ్రవీరులు మొక్కవోని పరాక్రమమున ముందున కుఱికి యవన సైన్యము నంతయుఁ జిందరవందర గావించి రణరంగమునంతయుఁ బ్రేతపతు రక్తప్రవాహములతో నించిరి. ప్రాణముల మీఁది యాసతోఁ జెట్టునకొకరు గుట్టకొకరై [illegible] విడిచి పైమఱచి తురు;

సైన్యమును జెండాడి విజయలక్ష్మీద్వితీయులై యాంధ్రసైనికు లేకశిలానగరముఁ జేరిరి. పరాభవదుఃఖముతో హతశేషమగు సైన్యమును సమకూర్చుకొని మల్లిక్‌కాఫూరు ఢిల్లీకిఁ జేరెను.

రణమున జయించి సైన్యమును జెండాడి నగరమున కేతెంచిన యాంధ్రవీరులనందఱను బ్రతాపరుద్రచక్రవర్తి గౌరవించి యుచిత సత్కారములగావించి గౌరవించెను. ప్రజలు తమసామ్రాజ్యజయమున కానందించి వీరులకు హారతులొసంగి మహోత్సవము లొనరించి మృతవీరుల పొలికలనిలో స్మరణ చిహ్నముల నెలకొల్పిరి. ఏకశిలానగర రాజ్యమును గబళింప నెంచిన త్రిపురాంతకుఁడు అంబయదేవుడు ప్రతాపరుద్రుని వంచింప నిదియ తరుణమని యోరుగంటికోటపైకి వచ్చిరి. సోమయగన్నవీరుఁ డపరిమిత సైన్యబలముతో వారి నెదిరించి సైన్యసహితముగఁ దునుమాడి వారిరాజ్యము నాంధ్రసామ్రాజ్యములోఁ గలిపివేసెను. యవనసైన్యము ఢిల్లీకేఁగినది మొదలు అల్లాఉద్దీను ఆంధ్రసామ్రాజ్యమును హరింపనైతినే యనిమిగుల నాందోళనపడి యచిరకాలమున మఱల దండయాత్రకేఁగ నిశ్చయించి సైనికబలమునభివృద్ధిఁ జేయుచుండెను. అపుడు దేవగిరిని ఢిల్లీకంకితుఁడై పాలించు మహారాష్ట్రుడగు రామదేవుఁడనునామాంతరముగల రామచంద్రదేవుఁడు ఢిల్లీసామ్రాజ్యమునకుఁ బన్నునొసంగమానెను. అల్లాఉద్దీను రెండవదండయాత్ర కాంధ్రదేశముమీఁదికి మల్లికాఫూరునుబంపెను. అతఁడు తొలుత దేవ

గిరిని ముట్టడించి రామచంద్రదేవుని బంధించి ఢిల్లీకిఁ బంపి యచటి బలము నంతయును హరించి ఏకశిలానగరముమీఁదికి దాడి వెడలెను. కాని తీరని పరాజయము నొంది యవన సైనికులు చిందరవందరలై బ్రదుకుజీవుఁడాయని ఇంటిత్రోవఁబట్టిరి. పరుష స్వభావముతో నీయవనసైనికులు ఆంధ్రదేశమునఁ బ్రవేశించునపుడును బారిపోవునపుడును గూడ ఆలయముల రూపుమాపి నగరములను గాల్చి దీనుల హింసించి ప్రజాపీడ సమకూర్చిరి. ఆంధ్రసామ్రాజ్యమంతయు యవన దురంతములచేఁ గల్లోలమై క్షోభనొందెను. నష్టపడిన ప్రజలందఱకుఁ బ్రతాపరుద్రుఁడు బొక్కసమునుండి ధనము తెప్పించి యొసంగి వారి యాపత్తులఁ జాలవఱకు నివారించెను.

క్రీ. శ. ౧౩౧౯ సంవత్సరమున అల్లాఉద్దీను మూఁడవ పర్యాయము ఆంధ్రసామ్రాజ్యమును జయించుటకుఁ మల్లిక్కాఫూరు, ఖ్వాజాహాజీయను వారల యధ్యక్షతక్రింద నపరిమిసైన్యమును నొసంగి పంపెను. దేవగిరిచెంత నెట్టిప్రతిఘటనము లేకుంటచే యవనసైన్య మాకస్మికమున ఇందూరు మీఁదుగా వచ్చుచుండ స్వామిభక్తపరాయణులగు సైనికు లెదిరించి వీరమరణమొందిరి. మహమ్మదీయులు సిరిపురదుర్గమును ముట్టడించిరి. దుర్గపాలకుఁడగు వానీరవిదేవుఁడు భయంకరసంగ్రామ మొనరించి యవనసైనికులయాగ్నేయాస్త్రములకు గుఱియై అవరోధకాంతలతోఁ గూడ దగ్ధమయ్యెను. అతని సోదరుఁడు,

సర్వవైభవ సంపన్నమగు దుర్గము మహమ్మదీయులకు స్వాధీనమయ్యెను. అనంతరము సముద్రమువలెఁ బొంగి పొరలివచ్చు యవనసైన్యమును సూనార్పాలు దుర్గమువద్ద నాంధ్రు లెదిరించిరి. ఉభయపక్షములవారికి భయంకరసంగరము జరిగెను. దురదృష్టవశమున నాంధ్రు లోడిరి. మహమ్మదీయ సైన్యము ఆంధ్రనగరము ముట్టడింపవచ్చు వార్తవిని ప్రతాపరుద్రదేవుఁడు శూరులనందఱఁ బిలువనంపి చాఁపకూడుఁగుడిచి, యుచితరీతి సత్కరించి ప్రతిపక్షుల నెదిరింపఁ బంపెను.

ఆంధ్రసైనికు లప్రతిమాన పరాక్రమముతో యవనసైన్యము నెదిరించిరి. మహమ్మదీయులు పట్టుదలతో నిలిచి యాంధ్రనగర దుర్గముల కన్నింటికి శతఘ్నులు బారుచేసి కాల్పసాగిరి. ఓరుగల్లుకోట కన్నివైపుల యవనసైనికులు మూఁగి లోనికెటులఁ బ్రవేశింపవలయునో తోఁచక కలవరపడు చుండిరి. చుట్టును పుట్టకోటయు దానిచుట్టు మిగుల విశాలమగు గాధజలపూరిత పరిఘయు నుంటచే మహమ్మదీయులు ముందుకుఁబోవ జంకిరి. కోటగోడపైనున్న వీరులు పరిఘలోఁగాలుంచిన వీరుని నుంచినటుల ఖండింపఁదొడంగిరి. ఇట్లు నెలలకొలఁది గడచెను. ఆంధ్రనగరము యవనులకు సాధ్యము కాదయ్యెను. ప్రతాపరుద్రదేవుఁడు శైవమత పక్షపాతియని భావించి యానృపాలుని ద్వేషించు జైనాచార్యులు కొందఱు రహస్యముగ మహమ్మదీయులఁగలసికొని కోటయాకృతి యంతయుఁ దెలిపిరి.

ఆకస్మికముగ నున్నటులుండి యవనులు ఏనుఁగుల సహాయ ముతో నగరద్వారదాటి యర్ధరాత్రమున మంటికోటనెక్కి లోను న్నపౌరులను సైనికులను హింసింపఁ దొడంగిరి. తెల్లవారు వఱకు ఱాతికోటవఱకు మహమ్మదీయ సైన్యములు వచ్చెను. అగడ్త వారి నాటంకపఱచెను. అగడ్త పూడ్వసాగిరి. పైనుండి యాంధ్రసైనికులు ఆగ్నేయాస్త్రములు, ఆయుధవర్షము గురి పించి యవనదళము జెండాడుచుండిరి. తగనిపట్టుదలతో యవ నవీరులు ఱాతికోటకు బగ్గమువేసి ప్రాకుచుండిరి. ప్రతాప రుద్రదేవుఁడీవార్త నాలించి యిఁక విజయము దుర్లభ మని తలంచి యాంధ్రుల దురదృష్టమునకుఁ గాలమే కారణమని సంధికియ్యకొనెను. మధ్యవర్తులు సంధికి రాయబారములనడిపి ప్రతాపరుద్రుఁడు ౩౧౨ ఏనుఁగులు, ౨౦,౦౦౦ గుఱ్ఱము ౯౬,౦౦౦ మణుగుల బంగారము, పెట్టెఁడు రత్నములు నొస ఢిల్లీసామ్రాజ్యమునకుఁ బన్నుకట్టుట కొప్పుకొనెను. మల్లిక్ పూరు జయమును గడించి ౧౩౧౦సం॥ మార్చి ౧౯ వ తేది ఢిల్లీ సామ్రాజ్యాభిముఖుఁడై హతశేషసైన్యముతో వెడ పోయెను.

ఓరుగల్లురాజ్యమును మహమ్మదీయులు ముట్టడించిరని యుఁ బ్రతాపరుద్రుఁడు సంధికియ్యకొనెననియు విన్నంతనె సా మంతులలోఁ బెక్కండ్రుదుతిరుగఁబడి కప్పములీయవద్దనినిశ్చయిం చిరి. కాంచీపురపాలకుఁడు స్వతంత్రతఁ బ్రకటింపఁ బ్రతాపరుద్రు

నీసేనానాయకుఁడును రేచర్ల గోత్రుడునునగు ఎఱ్ఱదాచానాయకుఁడు కాంచీపురరాజ్యము కాకతీయులవశము గావించెను. కులశేఖరవర్మ తరువాత కాంచీరాజ్యమును హరింప నుప్పడి నాయకుఁడేఁగి యాతనిజయించి తెలుఁగు చోడులలో నొకఁడగు మానవీరుని సింహాసనమునఁ జేర్చెను. చిన్నచిన్న రాజ్యములు గూడఁ దిరుగఁబడుట చూచి స్వయముగా దండయాత్ర చేయకున్న వీలుగాదని దుర్గరక్షణమునకు వలయు బలమును ఆంధ్రనగరమునందుంచి యపరిమిత బలముతోఁ బ్రతాపరుద్ర చక్రవర్తి దండయాత్రకు బయలుదేరి పాండ్య, కొంకణ, తెంకణ, మలయాలాది పశ్చిమదేశాధీశ్వరుల నంకితులుగఁ జేసికొని పుణ్యక్షేత్రముల దర్శించి మణి మాన్యాదికము లొసంగి ఓరుగల్లు చేరెను. పూర్వముకంటె దృఢతరముగ దుర్గమును బాగుచేయించి కందకమును విశాలముచేయించి యాంధ్రనగరమును శత్రుజనాభేద్య మొనర్చెను. శైవమతాభిమానియై బ్రాహ్మణోత్తములకు బెక్కు వృత్తులనొసంగి కవుల బహూకరించి యుత్తమకావ్యముల రచింపఁ బ్రోత్సహించి తటాకముల నభివృద్ధిపఱచి రాజ్యము రామరాజ్యము గావించెను. నాఁడు నిర్మింపఁబడిన కాకతమ్మబావి, శోభనాల బావి, సవతులబావి, గడియారములబావి, కుషిమహలు, ఏకశిలామహలు లోనగు కట్టడము లాంధ్రవీరుల శిల్పశాస్త్రికిఁ దార్కాణముగ నేఁటి కలరారుచు నేత్రపర్వముగ నున్నవి. కేశవాలయము, స్వయంభూదేవాలయము మిగుల వైభవో

పేతములుగ నుత్సవములచే నలరారుచుండెను. కొలంది కాలములో ఆంధ్రసామ్రాజ్యము మహోన్నతదశకు వచ్చెను.

ఇంతలో ఢిల్లీరాజ్యమునం దెక్కువిప్లవములు జరిగెను. అల్లాఉద్దీను గతించెను. ఢిల్లీసామ్రాజ్యసామంతులు తిరుగఁబడిరి దేవగిరియాదవులు స్వతంత్రులైరి. ప్రతాపరుద్ర చక్రవర్తి గూడ పన్నుకట్టుట మానికొనెను. మల్లికాఫూరు సింహాసన మెక్క విశ్వప్రయత్నముగావించెను. ఆతని వధించిరి. తరువాత ముబారకు అనుపేరుగల అల్లాఉద్దీను రాజ్యమునకు వచ్చి దేవగిరి మీఁదికి దండయాత్రకేఁగి దుర్గాధిపతియగు హరిపాలదేవు నోడించి రాజ్యమధ్యమున బ్రతికియుండఁగ మిగుల క్రూరముగ నతని మేనితోలొలిపించెను. ముబారకు రాజ్యమునకు జేరఁగనే ఖుస్రూఅను సేనాధిపతి వానిని జంపించి తాను రాజయ్యెను. తరువాత నైదు మాసములకు ఘాజీబేగుతుగ్లక్ ఖుస్రూను సంగరరంగమున జంపి ఘియాజుద్దీను తుగ్లక్ అను పేరుతో క్రీ. శ. ౧౩౨౧ అగష్టు ౨౨ తేదిని ఢిల్లీసామ్రాజ్యమునకు రాజయ్యెను. ఇతఁడు రాజనీతివిదుఁడగుటచే నలువైపుల నుండి శత్రుసైన్యములు రాకుండ కట్టుదిట్టములు చేయించెను. ప్రతాపరుద్రుఁడు పూర్వవైరము పురస్కరించుకొని ఢిల్లీ సామ్రాజ్యమును మ్రింగివేయునేమో యను భయమాతని హృదయమును దహించివేయుచుండెను.

తుగ్లక్ తన కుమారుఁడగు అలూఘ్ఖానునకు అపరిమితమగు సైన్యమును సహాయముగ నొసంగి యాంధ్రసామ్రాజ్యమును ముట్టడింపఁబంపెను. ఇది నాలుగవ ముట్టడి. ప్రతాపరుద్రుఁడీ వార్త విన్నంతనె సమీపదుర్గములందున్న సైన్యమును సేనాధిపతులను రప్పించి రాతికోటలోని ప్రతిదుర్గమునకు నొక్కొక వెలమవీరుని గొంత సైన్యమును గాపుంచి ద్వారములన్నింటికడ వీరాధివీరులగు సైనికులనుంచి తేరాల బచ్చిరెడ్డి, కొలిపాక సిద్దయ్య, శ్రీరంగమదేవుఁడు, మహాదేవనాయకుఁడు, గన్నయ్య సేనాని, కుమారరుద్రదేవుఁడు లోనగు మహావీరులు సవలక్ష సైనికులతో నాంధ్రసామ్రాజ్యము సంరక్షించుటయో సంగరమరణ మొందుటయో కర్తవ్యమని రణమునకుఁదలఁపడిరి. రాచర్లవద్ద విడిసినయవన సైన్యము ముందునకువచ్చెను. మహాశక్తుఁడగు శివగవయ్య వీరచందనము విభూతి గైకొని వీరులందఱను నాశీర్వదించి తిలకము మొగమునిండ, గందము మేనఁబూసి రణమునకంపెను. అద్వితీయపరాక్రమముతో నాంధ్రులుపోరాడిరి. రాజ్యమునందున్న ప్రతిపౌరుఁడు రణమునఁ బాల్గొనెను. చుట్టుపట్టునగరములవారందఱు చతురసైన్యము ననేకవిధములఁ జెండాడిరి. కడకు మహమ్మదీయసైన్యము సంపూర్ణముగ నాశనమయ్యెను. సర్దారులు పలువురు మరణించిరి. యుద్ధోపకరణములన్నియు నూడలాగికొని ఆంధ్రవీరులు మహమ్మదీయుల గోదావరితీరముదనుక బాఱఁదోలిరి. అలూఫుఖాను మూఁడువేల గుఱ్ఱపుదళముతో ఢిల్లీచేరి తన పరాజయకథయంతయుఁ దండ్రికి నివేదించెను.

సుల్తాను, చుట్టుపట్లులనున్న చందేరీ, బూదాపూర్, మాళవదేశములనుండి తత్క్షణమె యసంఖ్యాక సైన్యమును రప్పించి యలూఫుఖానున కొసంగి త్రిలింగసామ్రాజ్యమును హరించి రాజును బంధించిగాని నాయొద్దకు రావద్దని పంపెను. యవన సైన్యము రాత్రిల నడవితోవలఁ బయనము చేసి ఆకస్మికముగానోరుగల్లుకోటమీఁదఁబడి నిర్భయముగా నసహాయముగానున్న ద్వార రక్షకసైన్యమును దెగటార్చి లోనికిఁ జొచ్చెను. యుద్ధముముగిసి రెండునెలలైన గాలేదు. ఇంతలో యవనులవలన నెట్టి యుపద్రవముండదని వీరులకు విశ్రాంతి నొసంగి ప్రతాపరుద్రుఁడు పరిమితబలముతో నగరమధ్యమునందలి మహాసౌధముననుండెను. యవనసైన్యము ప్రాంతికోటకు ఫిరంగులు బారుపెట్టికాల్చుట లాంధ్రసైనికులు విని నివ్వెఱపోయిలేచి దుర్గరక్షణమునకుఁబూనుకొనిరి. యవనసైనికులుకోట బైటిద్వారములన్నిటిని మూయించి క్రొత్తసైన్యము నగరము జేరకుండ కట్టుదిట్టము చేసి రాతికోట బగులఁగొట్టనారంభించిరి. ప్రతాపరుద్రచక్రవర్తి యేనుఁగునెక్కి సైనికులఁబురికొల్పుచు బ్రతిపక్ష సైన్యమును బంచబంగాళము చేయించుచుండెను. ఆంధ్రసైనికులు పరాజయమందుచుండిరి. ప్రతాపరుద్రుఁ డీవిపరీత పరిస్థితులఁగాంచి స్వయంభూదేవాలయమున కేఁగి జ్యోతిర్లింగమును సందర్శించిన నది ప్రకాశవంతముగ గోచరింపదయ్యె. పద్మాక్షి యాలయమున కేఁగియాయుధములటనిడి నమస్కరింప

బోవ నాయుధములు సర్వాకారముదాల్చి గుహాలోనికిఁబోయెను. ఈపరిస్థితులు అపశకునములుగ నెంచి ప్రతాపరుద్రదేవుఁడు జయముపై నాసవీడి ఖడ్గముపుచ్చుకొని మహమ్మదీయసైన్యముపైఁ దుమికెను. అలూఫుఖాను ప్రతాపరుద్రుని బంధించి రహస్యముగాఁ దనశిబిరమునఁ జేర్పించెను. రాజింక యుద్ధము చేయుచున్నాఁడని సైనికులు ఘోరముగఁ బోరాడుచుండిరి. అలూఫుఖాను ఆరాత్రినుండియే సైన్యముతో ప్రతాపరుద్రుని ఢిల్లీకిఁ బంపెను. ఎటులో నీవార్త ఓరుగల్లునగరమునందంతటను బ్రాఁకెను. ఆంధ్రభటులు రాజును విడిపింప శిబిరముల కడకుఁజనిరి. భయంకరసమరము చేయుచుండ మహమ్మదీయసైనికులు కోటలు బురుజులఁగొట్టి ఆలయములఁ గూలఁద్రోచి రాజమందిరము అంగడివీధులుదోచి ఢిల్లీత్రోవఁబట్టిరి. మహమ్మదీయ శిబిరములందుఁ దమరాజు లేకుండుటకు వగచి ఢిల్లీకిఁ గొనిపోవుచుండిరేమో త్రోవలో నడ్డగించి రాజును విడిపింతమని యవనసైనికులు పోయినత్రోవనుబట్టి యాంధ్రులు రామగిరియొద్ద ప్రతిపక్షసైన్యమును గలసికొని ఘోరసంగరమునకుఁ దలఁపడిరి. ఆంధ్రసైనికులు రాజును విడిపించుటకుఁ బోవుచున్నారని విని ఓరుగల్లు ముట్టడించు మహమ్మదీయ సైనికులు రామగిరివద్ద తమసైన్యములను గలిసికొని ఆంధ్రసైనికులతోఁ బోరుచుండ యుక్తిశాలియగు నొక మహమ్మదీయసేనాని కొంత పరిజనముతో రాజు నీసంరంభములో గోదావరి దాటించెను. ఆంధ్రసైనికులు

యవనసైన్యమును జెండాడి పరిశీలింప రాజు కనఁబడఁడయ్యెను. దురదృష్టవశమున నాంధ్రులు పరాధీనులై యవనపాలనమున నున్న నిజనగరము చేరిరి. ఆంధ్రదేశ మద్వితీయవిక్రమముతోఁ బాలించి ఆంధ్రజాతికి శరణ్యుఁడైన ప్రతాపరుద్రుఁడు 1323 లో బంధీకృతుఁడయ్యెను. ప్రతాపరుద్రుఁడు జీవగ్రాహిగఁ బట్టువడినందులకు ఢిల్లీనవాబు ఆఱుమాసము లుత్సవము జరిపెనఁట. ఢిల్లీ నవాబు దయదలఁచి విడిచిపెట్ట ప్రతాపరుద్రుఁడు కాళేశ్వరమునకు వచ్చి యటఁ గొంతకాల ముండి మరణించినటుల స్థానికచరిత్రము చెప్పుచున్నది. ఆంధ్రసామ్రాజ్యమునకు ముఖ్యస్థానమగు ఓరుగల్లు పూర్వవిభవమంతయు ప్రతాపరుద్రుఁడు బంధీకృతుఁ డగుటతోఁ దీరిపోయెను. నాటి సామ్రాజ్య చిహ్నము లనఁదగు శిలాద్వారములు, కూపములు, ఆలయములు, దుర్గద్వారములు, క్రీడాసరోవరములు స్మరణ చిహ్నములవలె నేఁటికి జరిత్రాభిరతుల సంతాపాశ్రుసేచనముతోఁ దృప్తినొందుచు ఓరుగల్లుకోటలోఁ గనుపించుచున్నవి. ఆంధ్రసోదరులారా! హతశేషములగు చిహ్నముల గాంచియేని యానందింపరా?

---

# కృష్ణ దేవ రాయలు.

మహా శూరశిఖామణియు ఆంధ్రభాషాప్రియుఁడు నగు శ్రీకృష్ణదేవరాయల దివ్యనామము నెఱుంగని యాంధ్రుఁ డుండఁడు. ఈ రాజతిలకుని జీవితచరిత్రము చెప్పుటకు ముందు విద్యానగర సామ్రాజ్య చరిత్ర మించుక చెప్పవలసియున్నది.

ప్రతాపరుద్రదేవుఁడు బంధీకృతుఁడైనంతన సేనానాయకు లెవరితోవారు వారేఁగి చిన్నచిన్న రాజ్యములను స్థాపించిరి. ఆంధ్రనగరమున సుగంధ భాండాగారాధ్యక్షులుగా నున్న హరిహరరాయలు, బుక్కరాయలు, మాధవమంత్రితోఁ గలిసి యానెగొంది ప్రాంతములకు జనుదెంచిరి. శైలములమధ్య సురక్షితముగానున్న యొక ప్రదేశమునందు శా. శ ౧౨౫౮ ధాతసంవత్సర వైశాఖశుద్ధ పంచమి (క్రీ.శ. ౧౧౩౬) నాఁడు మాధవమంత్రి విద్యానగరమను పట్టణరాజమును నిర్మించి హరిహరరాయలఁ బ్రభువుగను బుక్కరాయల యువరాజుగ నొనరించెను. నగరముచుట్టును ఏడు ప్రాకారములు నెలకొల్పఁబడెను. మాధవమంత్రి సన్న్యసించి మాధవ విద్యారణ్యు లను నామముతో శృంగేరి పీఠమున కధ్యక్షుఁ డయ్యెను. క్రమక్రమముగా విద్యానగర రాజ్యము మిగుల వృద్ధికి వచ్చి సుప్రసిద్ధమై యరిజనాభేద్యమై యొప్పెను.



శ్రీకృష్ణదేవరాయలు.

హరిహరరాయుల, బుక్క రాయుల యనంతరమున విద్యానగర రాజ్యమును రెండవహరిహరరాయలు, దేవరాయలు (రెండవ) దేవరాయలు, మల్లికార్జునరాయలు, విరూపాక్ష రాయలు, (రెండవ) విరూపాక్షరాయలు పరిపాలించుచు వచ్చిరి. రెండవవిరూపాక్షరాయలు పరిపాలనమునందసమర్థుఁడును భోగలాలసుఁడు నగుటచేఁ బ్రజ లతని ద్వేషించిరి. ఏత ద్రాజ్య దండనాథుఁడగు సాళ్వనరసింహరాయ లీపరిస్థితులు గమనించి రాజును వెడలనడఁచి తానె విద్యానగరసంస్థాన ప్రభువై చిరకాలము పాలించెను. అతని యనంతరమున నిరువురు కుమారు లొకరివెంట నొకరు రాజ్యమునకువచ్చి యకాల మరణమొందిరి. తరువాత విద్యానగర సామ్రాజ్యమునకు తుళువనరసరాజు పరిపాలకుఁడయ్యెను.

నరసరాజు తరువాత నతనికుమారుఁడు వీరనరసింహరాయలు కొంతకాలము విద్యానగరసంస్థానము పాలించి మరణించెను. అనంతరము శ్రీకృష్ణదేవరాయలవారు (క్రీ. శ. ౧౫౦౯ ఫిబ్రవరి ౪ వ తేది) విద్యానగర సామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుఁడయ్యెను. రాయలవద్ద తండ్రియగు నరసరాజు కాలమునుండి సుప్రసిద్ధుఁడై యున్న సాళువతిమ్మరసు మంత్రిగ నుండెను. తిమ్మరసు వయసునఁ బెద్దవాఁడును దనకు విద్యాగురువును రాజకీయ రహస్యవేత్తయు నగుటచే కృష్ణదేవ రాయ లాయనయెడల మిగుల గౌరవబుద్ధిగలవాఁడై అప్పాజి

యని పిలుచువాఁడు. రాయలు రాజ్యమునకు వచ్చినపిదప విద్యానగర సామ్రాజ్యమును కృష్ణదేవరాయలు తన యసాధారణ ప్రజ్ఞాతిశయముచే మిగుల విస్తర మొనరించెను. వీర నరసింహ రాయలు విద్యానగర సామ్రాజ్యమును బాలించుకాలముననె కృష్ణదేవరాయలు పన్ను లొసంగక తిరుగఁబడిన సామంతుల లోఁ గొనుటకు దండయాత్రకు బయలుదేరి కర్ణాటక దేశమందలి ఉమ్మత్తూరు దుర్గమును మూఁడు మాసములు ముట్టడించి జయించెను. తరువాత కావేరీతీరమున నున్న సుప్రసిద్ధమగు శివసముద్ర దుర్గమును ముట్టడించి జయించెను. శ్రీరంగపట్టణమును జయించి తన ప్రతినిధి నచట నిలిపి కృష్ణదేవరాయ లనతికాలములో విద్యానగరమునకుఁ జేరెను. రాయల పరాక్రమజీవితము సుప్రసిద్ధ మగుటచేఁ బూర్వసామంతులలోఁ జాలమంది యెప్పటివలెఁ గప్పము లొసంగుచుండిరి. కొందఱు బాలుఁడగు కృష్ణదేవరాయలను బాటింపక సుంకమునీయ మానికొనిరి. అందులకై యపరిమిత సైన్యముతో విజయయాత్రలకేఁగి దేశమునంతయు స్వాధీనఁ పఱచికొన వలయునని సంకల్పించెను. ఈ సంకల్పమునకు దిమ్మరుసు మంత్రి పెక్కుభంగులఁ బ్రోత్సాహము గావించి నిజబలమును గోశాగారమును నభివృద్ధిపరచెను.

రాయలభార్యలలోఁ జిన్నాదేవియుఁ దిరుమలదేవియు సుప్రసిద్ధురాండ్రు. చిన్నమదేవి యేరాజపుత్రియో స్పష్టము

గాఁ దెలియుడు. రాయల కీమె యెడల ననురాగము మెండు. ఈమె పేర నాగలాపురమను నొక పేటఁగట్టించి మనోహరమగు నొక రాజవీధినందు నెలకొల్పెను. వివిధములగు సందు లా వీధిలోఁ బెట్టించెను. ఆవీధులందలి యంగడుల సుంకము సంవత్సరము నకు నలువది రెండువేల వరహాలను మించియున్నదని చరిత్ర కారులు చెప్పుచున్నారు. శ్రీరంగపట్టణాధీశుఁడగు వీరశ్యామ రాయల పుత్త్రికారత్నమగు తిరుమలదేవి రాయల రెండవ భార్య. ఈయమ రాయలకనుకూలవతియుఁ బ్రేమాస్పదయు నై యుండెను.

కృష్ణదేవరాయలు సామ్రాజ్యమునకు వచ్చినది మొదలు అభివృద్ధిమార్గముల నన్వేషించుచు జుట్టుపక్కల బలవంతులై యున్న సామంతులను బరాభూతులఁ జేయ యత్నించుచుండెను. సామంతప్రభువులు ప్రతిసంవత్సరము సుంకమునొసంగుటే గాక యవసరమైనపుడు కొంత సైన్యము నొసంగునటులఁ గట్టడి గావించెను. తనస్వాధీనములోనికిఁ గ్రొత్తగా వచ్చిన దుర్గములకు నధికారుల నియోగించి వారిచే సైనికబలమును అభివృద్ధి చేయించుటయే గాక తానుగూడ ధనము విరివిగా వెచ్చబెట్టి అశ్వికబలమును గజబలమును పదాతి సైన్యమును మిక్కిలి యభివృద్ధిలోనికిఁ దెచ్చి బొక్కసము ధనముతో నింపివేసెను. ఆకాలమున రాయల సైన్యము అసంఖ్యాకము అపరిమితముగ నుంటచే సాటి రాజులందఱును అరచేతిలోఁ బ్రాణములుంచుకొని సింహాము

వ్వలె విజయనగరప్రభువు తమపై నెపుడుపడునో యనిభయపడుచుండిరి. అన్నిచోటులఁ గలిసి విద్యానగరసామ్రాజ్య సైన్యము పదిలక్షలకు మించియుండెను. ఈ సైన్యములోఁ గొంతయు, ముప్పది యాఱువేలమంది యాశ్వికులు, ఏడెనిమిది వందలమంది గజసైన్యపాలకులు విద్యానగరమును నిరంతరము గాచుచుండిరి. ప్రతిరాజ్యమునందలి రహస్యముల గ్రహించి వచ్చుటకు నేర్పరులగు చారులు నియోగింపఁబడిరి.

కృష్ణదేవరాయలు రాజ్యమునకు వచ్చిన క్రొత్తలోఁ గొంతకాలము విద్యావినోదములతోఁ గడపుచుండెను. ఆయన స్వయముగఁ గర్ణాటాంధ్ర సంస్కృతాది భాషలలోఁ బండితుఁడును గవియు నగుటచే నాయాభాషలలో సుప్రసిద్ధులగు పండితుల గౌరవించి వారిచే గ్రంథముల రచింపఁజేసి సారస్వత మాధుర్యము చవిజూచుచుండెను. రాయల కభిమాన భాష ఆంధ్రము. ఆంధ్రభాషలోఁ గవితచెప్పు సుప్రసిద్ధకవుల నందఱను బిలువనంపి సత్కరించుటయే గాక తన యాస్థానము నందు అల్లసాని పెద్దన్న, ముక్కుతిమ్మన్న, మాదయగారి మల్లన తెనాలి రామలింగకవి, ధూర్జటి, అయ్యలరాజు రామభద్రుఁడు, భట్టుమూర్తి, పింగళిసూరన యను కవులను అష్టదిగ్గజములను పేరితో నుంచుకొని వారిచేఁ బ్రసిద్ధి కావ్యములు రచింపఁజేసి సంతోషముగాఁ గాలము గడపుచుండెను. ఇంతలోఁ బ్రమత్తుఁడుగాక సామ్రాజ్య క్షేమము

నకుఁ బాటుపడుచుఁ దిమ్మరుసుమంత్రి యనుజ్ఞచొప్పున సైనికబలమును వృద్ధిచేసి తిరుగఁబడిన రాజుల వృత్తాంతములు చారులముఖమున గుర్తెఱింగి దండయాత్రలకు బలము సిద్ధపఱచుచుండెను. ద్రావిడదేశము నంతటికి ముగ్గురు ప్రతినిధులు నియమింపబడిరి. వారు సామంతులనుండి మూఁడుకోట్ల ద్రవ్యము సంవత్సరమునకుఁ బోగుచేసి పంపుచుండిరి.

ఇట్లు కృష్ణదేవరాయలు రెండు సంవత్సరములు రాజధానియందుండి సైనికబలమును మిగుల నభివృద్ధిపఱచి దేశపరిస్థితులు విశాలదృష్టితో నొక్కమాఱు పరిశీలించెను. మహమ్మదీయ రాజ్యములు చీలికలుగఁ జీలి వానిలో నైకమత్యము లేకుండెను. దీనివలన మనకింతలో నపాయము కలుగదని నిశ్చయించెను. గజపతులు ఓఢ్రదేశమునుండి బయలువెడలి కృష్ణాగోదావరుల దాటి బలవంతములగు దుర్గముల నాక్రమించికొనిరి. కొండవీటిదుర్గము, ఉదయగిరిదుర్గము, కనకగిరిదుర్గము గజపతుల స్వాధీనమునందుండెను. అటు ద్రావిడదేశమును ఉదయగిరియందుండియు, నిటుకర్ణాటదేశమును గొండవీటినుండియు రెంటికి న[illegible] పకయున్న పశ్చిమాంధ్రదేశమును (విజయ రాష్ట్రమును) గొండవీటి దుర్గమునందుండియు జయించుటకు గజపతులు యత్నించుచుండిరి. కటకము మొదలు గోదావరివఱకుఁ గలదేశమంతయు గజపతులు ముందె యాక్రమించుకొనిరి. గజపతుల నిర్జింపకున్న నెప్పటికేని విద్యానగరసామ్రా

జ్యమున కపాయము వాటిల్లునని రాయ లూహించి తొలుత కొండవీటిని ముట్టడింప సంకల్పించెను. తిమ్మరుసుమంత్రి దూరము యోజించి గజపతులబలమంతయు ఉదయగిరియందున్నదిగాన నాదుర్గముఁనె తొలుత లోఁగొనవలయునని చెప్పెను. కృష్ణరాయ లియ్యకొని సంగర సన్నద్ధము చేయ నాజ్ఞాపించెను. గోవిందామాత్యునికి లక్షసైన్యమును స్వాధీనముచేసి విద్యానగరమును జాగరూకతతోఁ గాచియుండఁ గట్టడిఁజేసి, యొక శుభముహూర్తమున నాస్థానవిద్వాంసులతో నంతఃపుర జనముతో నసంఖ్యాకసైనిక సమూహముతో పూర్వదిగ్జైత్ర యాత్రకు కృష్ణదేవరాయలు బయలుదేరెను.

క్షత్రియవంశభూషణులగు శ్రీరంగరాజు, నారపరాజ ఇమ్మరాజును, బ్రాహ్మణవీరుఁడగు రాయసము కొండమరుసును కమ్మనాయకుఁడగు పెమ్మసాని లింగన్నను, వెలమవీరుఁడగు వెలుగోటి కుమారతిమ్మనాయకుని, పంటరెడ్డియగు గంగాధర రెడ్డిని సేనానాయకులఁ గావించి ఒక్కొక్కరి యధీనమున్న ముప్పదివేల కాల్బలము, నాలుగు గుఱ్ఱపుదళములు, ఇన్నూరు మదపుటేనుఁగులు నుంచి, తిమ్మరుసుమంత్రి యుచితవిను లందఱకు నివేదించెను. సైనికబలము నలుగెలంకుల నడచుచుండ రాయలు మహోన్నత గజరాజమునెక్కి బ్రాహ్మణులస్వస్తి వాచకముల, కవుల రణగీతముల నాలించుచుఁ బ్రాగ్దిశాభిముఖుఁడై బయలుదేరి యచిరకాలమున నుదయగిరిఁ జేరెను.

కృష్ణదేవరాయలు తనదుర్గముమీఁదికి వచ్చెనని యుదయగిరి పాలకుఁడగు తిరుమలకాంతరాయఁడు విని వెఱఁగంది చేయునదిలేక యావర్తమానము ప్రతాపరుద్రగజపతికి దెలియ జేయఁ జారులనంపి పదివేల సైనికులను నాలుగువందలమంది యాశ్వికులను దుర్గమునఁ జేర్చుకొని జాగరూకతతో సంరక్షించుచుండెను. తిమ్మరుసు రాయలును సైన్యమును బారికొల్పి యుదయగిరి దుర్గమును ముట్టడించిరి. కోటలోనున్న వీరులు గుహాలోనున్న సింగములవలెఁ బట్టుదల వదలక రాయలసైన్యములో నిలుకడగఁ బోరాడుచుండిరి. దుర్గములోని కాహారపదార్థములు పోకుండ నరిగట్టినచో విరోధులు సులభముగా లోఁగుదురని రాయలసైనికులు దుర్గద్వారములన్నియుఁ దెఱవ వీలుగానివిధమున గండశిలలతో మూసిరి. ఉదయగిరిదుర్గదుస్స్థితి విన్నంతనే ప్రతాపరుద్రగజపతి లక్షసైనికులను కటకమునుండి తిరుమలకాంతరాయలకుఁదోడ్పడి ఉదయగిరి కాపాడుటకు బంపెను. ఈ వార్త చారులవలన తిమ్మరుసుమంత్రి విని రాయసము కొండమరుసయ్యను కొంత సైన్యమును ఉదయగిరి జయించుటకు కృష్ణదేవరాయల యధీనమునందుంచి తాను వచ్చుచున్న సైన్యమునకు నెదురుగా సైన్యసహితుఁడై యేఁగెను. ఉభయపక్షములకు భయంకర సంగరము మార్గమధ్యమునందె జరిగెను. తిమ్మరుసు మంత్రి యీసంగరమున మగ్నుఁడై యుంట గమనించి కృష్ణదేవరాయలు విద్యానగరమునుండి కొంత సైన్యము వచ్చుట గాంచి

ప్పించి పదునెనిమిదిమాసము లేకధాటిగ నుదయగిరిని ముట్టడిం చెను. ఆహారాదులు తగ్గుటచేతను బలము నశించుటచేతను ఉద యగిరి దుర్గము రాయలకు సాధ్యమయ్యెను. వెంటనే సేనాధీశ్వ రులు దుర్గమును బగులగొట్టిరి. కృష్ణదేవరాయలు పరిజనముతో దుర్గమున కేఁగి సేనాదికమును వశపఱచుకొని దుర్గపాలకుఁడగు తిరుమలకాంతరాయలఁ జెఱగొని రాయసము కొండమరు సయ్యను ఉదయగిరి రాజ్యమునకుఁ బ్రతినిధిగా నియోగించి హతశేషమగు బలముతో తిమ్మరసుమంత్రికి సహాయము బోయెను. ఇంతలో విద్యానగరమునుండి క్రొత్తసైన్యమువచ్చి రాయల సైన్యముతోఁగలిసెను. కృష్ణదేవరాయలు తిమ్మరుసు మంత్రియు రెండుసంవత్సరములు గజపతిసైన్యముతోఁ బోరాడి విజయము గడించి యంతతోఁ దృప్తినొందక గజపతుల బల మున కాయువుపట్టుగానున్న కొండవీటిదుర్గమును బట్టుకొను టకు బయలుదేరిరి.

ప్రతాపరుద్రగజపతి కుమారుఁడగు వీరభద్రగజపతి కొండవీటి దుర్గమును బాలించుచుండెను. అద్దంకి, వినుకొండ, బెల్లముకొండ, నాగార్జునకొండ, తంగెడ, కేతవరము దుర్గము లికొండవీటి దుర్గముక్రిందివె. ఉదయగిరిదుర్గము కృష్ణదేవ రాయలు జయించిన వార్తవిని వీరభద్రగజపతి తన బలము నంతయు సమకూర్చి రాయలసైన్యము నెదిరింపఁ దలఁపడెను. రెండు పక్షముల వారికి భయంకర సమరము జరిగెను. గజ

పతుల సైన్యము చాలవఱకు నష్టపడెను. బయటనున్న బ్రాణములు దక్కవని వీరభద్ర గజపతి, వీరభద్రపాత్రుఁడు రాచూరి మల్లాఖానుఁడు, ఉద్దండఖానుఁడు, రాచిరాజు శ్రీనాథరాజు, లక్ష్మీపతిరాజు, జన్యామలక సవాపాత్రుఁడు బాలచంద్రమహాపాత్రుఁడు మున్నగు వీరులందఱు కొండవీటి దుర్గమునఁజేరి తలదాచుకొనిరి. బహిరంగస్థలమున నున్న గజపతి సైన్యమును దరుముకొనుచు శ్రీకృష్ణదేవరాయలు అద్దంకి, వినుకొండ, బెల్లముకొండ, నాగార్జునకొండ, తంగెడ, కేతవరము లోనగు దుర్గములన్నిటిని స్వాధీనపఱచికొనెను.

క్రీ.శ. ౧౫౧౫ సంవత్సరము మార్చి నెలలో తిమ్మరుసు మంత్రి కొండవీటిదుర్గమును ముట్టడించెను. ఈవార్త ప్రతాపరుద్రగజపతి విని కొండవీటిదుర్గమును రక్షింపనెంచి మూఁడు వందల యేనుఁగులతోడను ఇరువది వేల యాశ్వికబలముతోను ఐదులక్షల కాల్బలము తోడను బయలుదేరెను. ఈ వార్త కృష్ణదేవరాయలు విని తిమ్మరుసుమంత్రిని కొండవీటిని ముట్టడించుటకుఁ గొంతబలముతో విడిచిపెట్టి తాను సైన్యసహితుఁడై గజపతి సైన్యము నెదిరించుటకుఁ గృష్ణదాఁటి పెద్దూరు వద్ద కేఁగెను. ప్రతాపరుద్ర గజపతి సైన్యమునకు శ్రీకృష్ణదేవరాయల సైన్యమునకు భయంకరసమరము కొంతకాల మెడతెగక జరిగెను. దురదృష్టశాలియగు గజపతియొక్క సైన్యము నశించెను. విఫలమనోరథుఁడై కొండవీటిపై నాశవిడిచి ప్రాణము


fort

-గాని తనవిజయము సర్వాంకషము గాదని తలంచి కృష్ణాతరంగిణి గోదావరిదాఁటి పరిజనముతో దండయాత్రకు బయలువెడలెను. కృష్ణదాఁటినదిమొదలు గజపతిసైన్యము ప్రతిగ్రామమునందును దన బలము నెదిరించుచునే వచ్చెను. ఇంతలో విద్యానగరమునుండి వచ్చిన నూతనబలము గలిసికొనెను. తనబలమంతయు నష్టమగుటచే గజపతి ప్రతిఘటించి లాభములేదని కుటుంబముతోఁ గొండగుహాలలోఁ దలదాచుకొన బాఱిపోయెను. గౌతమిదాఁటి రాజమహేంద్రవర దుర్గమును జయించి యచట తనప్రతినిధి నుంచి మన్నెపు సంస్థానములను రాజమహేంద్రవరము నాక్రమించుకొని రహితాపురము లోనగు మన్నెసంస్థానములను రాయలు జయించెను. తరువాత బాహుబలేంద్రుని వంశజులకు స్థానమైనదియగు పొట్నూరు జయించి యచట మిగుల నున్నతమగు జయస్తంభము నాటించెను. మాడుగుల, వడ్డాదిని గూడ జయించి రాయలు పరిజనముతోఁ గొంతకాలము సింహాచలమున విశ్రమించి నృసింహస్వామికి బెక్కుదానములు గావించి శాసనముల స్థాపించెను. అనేకామూల్యాభరణములు సమర్పించి నిత్యనైవేద్య భోగాదికములకుఁ గొన్ని వృత్తులొసంగి దృష్టి ముందునకుఁ బఱపెను. కటకము ప్రాంతములందు పాత్రవంశజులు బలవంతులై యుండిరని రాయలు గ్రహించి సైన్యమలసియున్నను, రణయత్నము ఇప్పటికి మానుదమని తిమ్మరుసుమంత్రి వారించుచున్నను, లెక్కసేయక

లతో బయటఁబడిన నంతియుచాలునని గజపతి హతశేషముగు సైన్యముతో వెనుక కేఁగెను. కృష్ణదేవరాయలు వెనుకకు మఱలి కొండవీటికిఁ జేరెను. అంతకుమున్నె తిమ్మరుసు మంత్రి రెండుమాసములపైఁగాఁ గొండవీటి దుర్గమును ముట్టడించి క్రీ. శ. ౧౫౧౫ సంవత్సరము జూను ౨౩ వ తేదీని కొండవీటి దుర్గమును స్వాధీనముగావించుకొని యసమాన విజయము నొంది వీరభద్రగజపతిని జీవగ్రాహిగఁ జేకొనెను. పలువురు వీరులుకూడఁ బట్టువడిరి. కృష్ణరాయలు, తిమ్మరుసు కొండవీటిని జయించినటు లొకశాసనమును స్థాపించికొండపల్లిని జయించుటకుఁ బయనమయ్యెను. ఆకాలమునఁ బ్రహరేశ్వర పాత్రాదులు కొండపల్లిదుర్గమును బాలించుచుండిరి. కొండపల్లిని రాయలు మూఁడుమాసములు భయంకర సన్నాహముతో ముట్టడించి ప్రతాపరుద్రగజపతి భార్యలలో నొక్కతెను బెక్కుమంది సేనానాయకులను జీవగ్రాహులుగఁ జేకొని కొండపల్లి దుర్గమును స్వాధీనపఱచికొనెను. తరువాత ననంతగిరి, కంబముమెట్టు, ఊరుగొండ, ముస్నగు దుర్గములను జయించి తనప్రతినిధుల నందందుంచి కొండవీటికిఁ జేరెను. కొండవీటిలో గొంతకాలము విశ్రమించి తిమ్మరుసుమంత్రి [illegible] నాదెండ్ల అప్పామాత్యుని ప్రతినిధిగనుంచి తాను బందిగొన్న వీరుల నందఱను విద్యానగరమునకుఁ బంపెను.

విద్యానగరమునుండి కొంత సైన్యము వచ్చునటుల నేర్పాటుచేసి కృష్ణదేవరాయలు గజపతుల రాజ్యమును హరించినఁ

గాని తనవిజయము సర్వాంశమము గాదని తలంచి కృష్ణాతరం గిణి గోదావరిదాఁటి పరిజనముతో దండయాత్రకు బయలువెడ లెను. కృషదాఁటినదిమొదలు గజపతిసైన్యము ప్రతిగ్రామము నందును దన బలము నెదిరించుచునే వచ్చెను. ఇంతలో విద్యా నగరమునుండి వచ్చిన నూతనబలము గలిసికొనెను. తనబల మంతయు నష్టమగుటచే గజపతి ప్రతిఘటించి లాభములేదని కుటుంబముతోఁ గొండగుహాలలోఁ దలదాచుఁకొన బాఱిపో యెను. గౌతమిదాఁటి రాజమహేంద్రవర దుర్గమును జయించి యచట తనప్రతినిధి నుంచి మన్నెపు సంస్థానములను రాజమ హేంద్రవరము నాశ్రయించుకొని రహితాపురము లోనగు మన్నెసంస్థానములను రాయలు జయించెను. తరువాత బాహు బలేంద్రుని వంశజులకు [illegible] నైదానియగు పొట్నూరు జయించి యచట మిగుల నున్నతమగు జయస్తంభము నాటించెను. మా డుగుల వడ్డాదిని [illegible] జయించి రాయలు పరిజనముతోఁ గౌ తకాలము సింహాచలమున విశ్రమించి నృసింహస్వామికి బెక్కు దానములు గ[illegible]చి శాసనముల స్థాపించెను. అనేకామూల్యా భర[illegible]మర్పించి నిత్యనైవేద్య భోగాదికములకుఁ గొన్ని వృత్తులొసఁగి దృష్టి ముందునకుఁ బఱపెను. కటకము ప్రాంత ములందు పాత్రివంశజులు బలవంతులై యుండిరని రాయలు గ్రహించి సైన్యమలసియున్నను, రణయత్నము ఇప్పటికి మాను దమని తిమ్మరుసుమంత్రి వారించుచున్నను, లెక్కసేయక

అహోరాత్రము లరణ్యములలోఁ గొండలలో సైన్యమును నడిపించి కటకమునకుఁ బ్రయాణమయ్యెను. త్రోవలోఁ గలిగిన కష్టనష్టములను బాటిసేయక నిరుత్సాహపడక కృష్ణదేవరాయలు కొన్నిదినములకు కటకసమీపమునకుఁ జేరి తనరాక తెలియునటుల విజయభేరిని మ్రోఁగింపఁజేసెను. కృష్ణదేవరాయలు కటకమునకుఁ జేరకమున్నె ప్రతాపరుద్ర గజపతి కటకముఁ జేరెను.

కటకపరిసర భాగములను ప్రతాపరుద్రగజపతియాజ్ఞావర్తులు పాత్రసామంతరాజులు అపరిమిత బలవంతులై పదియాఱుమంది పరిపాలించుచుండిరి. రాయలు తమదుర్గముపైకి దండయాత్రకు వచ్చినవార్త విని పాత్రసామంతు లెదిరింప నుత్సాహపడి ప్రతాపరుద్రగజపతిని సంగరానుజ్ఞ వేఁడిరి. దూరదృష్టిలేని గజపతి చేయునది లేక తన సైన్యమునకు సంగరానుజ్ఞ నొసంగెను. పాత్రసామంతులందఱు తమతమ స్వాధీనమునందున్న బలము నంతయు సమకూర్చుకొని రాయల సైన్యము మీఁదికి సంగరమునకుఁ దలఁపడిరి. కొన్నిమాసములలో నెడ వెడలక ప్రయాణములు గావించుట చేతను అనారోగ్య ప్రదేశనివాసవశమునను రాయల సైన్యము చాల నీరసస్థితిలో నుండెను. పలువురు సైనికులు పాత్రసామంతుల సైనికులచేత వధింపఁబడిరి. కృష్ణదేవరాయల సైన్య మేదండయాత్రయందును ఇంతవఱకుఁ జెందని వినాశము నాఁడు చెందెను. రాయ లీ

పరిస్థితులు గమనించి, కర్తవ్యము తోఁచక విజయము నొందుటకుఁ జతురుపాయములలో నేదేని యవలంబించుట యుక్తమని కర్తవ్య నిర్ణయమునకుం దనకాప్తుఁడగు తిమ్మరుసు మంత్రిని గోరెను. పరిస్థితులన్నియు నెఱిఁగిన మహాయోధుఁడగు తిమ్మరుసుమంత్రికిఁ గటకసామంతులను జయించుటకు సరియగు నుపాయ మేదియు గోచరింప దయ్యెను. భేదోపాయము దప్ప విరోధులను సాధించుటకు వేఱొక యుపాయము లేదని తిమ్మరుసుమంత్రి నిశ్చయించి వెరవూహించెను.

కటకరాజగు ప్రతాపరుద్రగజపతిరాజ్యమునకుఁ బ్రతినిధులుగనుండి బలభద్రపాత్రుఁడు, దుర్గాపాత్రుఁడు, భీమపాత్రుఁడు, ముకుందపాత్రుఁడు భీకరపాత్రుఁడు, జేరుపాత్రుఁడు, రణరంగ పాత్రుఁడు, ఖడ్గపాత్రుఁడు, అఖండలపాత్రుఁడు, మురారిపాత్రుఁడు, వజ్రముష్టిపాత్రుఁడు, తురంగరేవంత పాత్రుఁడు, గజాంకుశపాత్రుఁడు, అసహాయపాత్రుఁడు, మృగేంద్రపాత్రుఁడు, విజయపాత్రుఁడు, అనువారు ఓఢ్రదేశమును పరిపాలించుచుండిరి. వీరందఱు ప్రతాపరుద్రగజపతి మహాపాత్రుల సంగరమునకుఁ దలఁపడిరి. కృష్ణరాయల సైన్యముకంటెఁ బాత్రుల యధీనమందున్న సైన్యము మెక్కుడుగ నుండెను. కావునఁ దన సైన్యము సరాధారమని బహిరంగ ప్రదేశమున నిలిచి పోరాడుటయు నపాయకరము. వెనుకకు మరలినఁ బరాక్రమమునకు లోపము. ఈ స్థితిగతులలోఁ

దిమ్మరుసుమంత్రి రాయలయనుజ్ఞఁ గొని పదియాఱు బంగారు పెట్టెలఁ జేయించి యందు దివ్యాభరణములు ఒక్కొక్కలేఖ యుంచి తనభటుల కొసంగి యొక్కొక్కటి పాత్ర సామంతులకు వేఱువేఱఁ బంపించెను. కృష్ణరాయలకుఁ బాత్ర సామంతులకు వేగు నడువకుండఁగాఁచియుండు గూఢచారు లాభటులను బంధించి ప్రతాపరుద్రగజపతి కప్పగించిరి. రాజాభటుల యొద్దనున్న పెట్టెలఁ బరిశీలింప నం దన్నిటిలో నమూల్యాభరణములు ఒక్కొక్కరహస్యలేఖయుఁ గనవచ్చెను. ప్రతి లేఖ యందును,

"మిత్రమా! మీరు గావించిన నిబంధనలు మా కంగీకారములు. గజపతిని బట్టియిచ్చిన మీకందఱకు మనకట్టడిప్రకారము నగరములు ధనము నొసంగుటకు నొడంబడితిని. నాయంగీకారము తెలుపుచుఁ బంపిన యీనసత్కారమును బరిగ్రహింపుఁడు" అనివ్రాయఁబడి క్రింద కృష్ణదేవరాయలసంతకముండెను. గజపతిలేఖలఁజూచి పాత్ర సామంతులందఱు కృష్ణరాయలకు లోఁబడిరనియుఁ దాను ప్రతిఘటించి లాభములేదనియు దలంచి రహస్యప్రదేశమునడాఁగి భవిష్యత్కర్తవ్యమునుగూర్చి యోజించుచుండెను. పాత్రసామంతులందఱు "పరిమితసైన్యముతో రణరంగమునకుఁ జేరినను గజపతి మూలబలముతో సహాయము రాఁడయ్యెను. రాయల సైన్యము సంగరమునకు సర్వసిద్ధముగానుండెను. "గజపతి సంధి కంగీకరించెనో, వెఱచి

సంగరమె మూనెనో "యని తమలోఁ దామనుకొని యుద్ధయత్నములుమాని యెవరింటికి వారేఁగిరి. గజపతి యీమోసమును గ్రహింపజాలక యెటులేని సంధి గావించుకొనఁదలఁచి కృష్ణరాయలయెదుట నిలుచుట కష్టమని తిమ్మరుసు చెంతకు రాయలయొద్దకు రాయబారినంపి సంధికియ్యకొనఁ బ్రార్థించెను. రాయలు మిక్కిలి సంతోషించి యియ్యకొనెను. తిమ్మరుసుమంత్రి గజపతియొద్దకుఁ బరిజనముతో నేఁగి గజపతి విద్యానగరసామ్రాజ్యమునకు సామంతుఁడై యుండునట్లును, ఆతనిపుత్రియగు తుక్కాంబను (ఈమెయు అన్నపూర్ణాదేవియు నొకతె) రాయలకొసంగునట్లును, గట్టుదిట్టములు గావించెను. కృష్ణరాయలు తుక్కాంబను పెండ్లాడి ఓఢ్రరాజ్యమును యథాపూర్వముగఁ బ్రతాపరుద్రగజపతి కధీనముగావించి క్రీ. శ. ౧౫౧౬ లోఁ బూర్వదిగ్విజయయాత్రను ముగించి గృహాభిముఖుఁడయ్యెను. కృష్ణరాయ లొనరించినది న్యాయబుద్ధితోఁ జూచిన మోసమైనను రాజనీతిప్రకారము యోచించిన దోషముగాదు. చతురుపాయములలో నిది భేదోపాయము. ప్రమాదమెఱుఁగని పాత్రసామంతులను మన్నించి బలవంతుఁడగు గజపతి కెప్పటియట్లు పూర్వరాజ్యము నొసంగి బంధుతుల నెఱపించి రాయలు జయము తన దనిపించుకొనెను. చిరకాలము పరస్పర ద్వేషములు లేకుండ సుఖముగ రాజ్యము లభివృద్ధి నొందుటకుగాను తుక్కాంబికను బరిగ్రహించెను. కాన రాయలు గావించిన భేదోపాయము రాజ్యధర్మము.

సామ్రాజ్య శుభదాయకము. ఉభయపక్షములకు క్షేమకర-మనక తప్పదు. విజయలక్ష్మి ద్వితీయుఁడై కృష్ణదేవరాయలు సింహాచలము, రాజమహేంద్రవరము, శ్రీకాళహస్తి, విజయవాడ, మంగళగిరి, మున్నగు క్షేత్రముల సందర్శించుచుఁ బౌరులవలన సత్కృతులను బడయుచు. సుఖముగాఁ గొంత కాలమునకు విద్యానగరసామ్రాజ్యమునకుఁ జేరెను.

కృష్ణదేవరాయలు దాదాపుగనైదు సంవత్సరములు కవితారచనము విద్యాగోష్ఠులతోఁ గాలముగడపెను. విశాలమైన సైన్యము నభివృద్ధిపరచెను. దుర్గమును బాగుచేయించెను. పోర్చుగీసువారిసహాయముచే మరఫిరంగులు చేయించి దుర్గములందు నెలకొలిపించెను. కృష్ణదేవరాయలు గావించిన భాషాసేవయందుఁ జాలభాగ మీకాలమున జరిగినటుల విశ్వసింపవచ్చును. కృష్ణదేవరాయలు బాలుఁడై యుండ రాయచూరు దుర్గమును మహమ్మదీయులు గైకొనిరి. రాయచూరు కృష్ణా తుంగభద్రానదుల మధ్యనున్న దృఢతరమగు దుర్గ రాజము. దాని నాదిల్‌షాహా పరిపాలించుచుండెను.

ఎటులేని రాయచూరుదుర్గము లోఁగొనినఁగాని తన పూర్వుల యాత్మకు శాంతి చేకూరదనియు విద్యానగర సామ్రాజ్యము సురక్షితముగాదని కృష్ణరాయలు తలంచి యాదిల్‌షాహా తనకు స్నేహితుఁడుగాన యుద్ధకారణముకొఱకు నిరీక్షించుచుండెను. సయ్యద్‌మర్కారు అనునొక తురుష్కుఁడు

గుఱ్ఱములను గొనితెచ్చెదనని రాయలయొద్దఁ గొంతధనము గొనిపోయి హరించి యాదిల్‌షాహా రాజ్యములోఁ డాఁగి యాతని శరణుగోరెను. రాయలు వానిని బట్టియిమ్మని వర్తమాన మంపఁగ ఆదిల్‌షాహా కులాభిమానము పురస్కరించుకొని వానిని దాఁచి తన రాజ్యమునకె రాలేదని వర్తమాన మంపెను. రాయ లీసందుఁ జూచుకొని సంగరమునకు బయలు వెడలెను.

బలవంతుఁడగు నాదిల్‌షాహాను జయించుట సామాన్యకార్యము కాదని కృష్ణదేవరాయలు ఏడులక్షల మూఁడువేల మంది కాల్బంటులను, ముప్పదిరెండువేల ఆఱువందల మంది గుఱ్ఱపురౌతులను, ఐదువందల యేఁబదియొక్క యేనుఁగులను నింకఁ గొందఱు పరిజనులను వెంటఁగొని జైత్రయాత్రకు బయలుదేరెను. ఏరాధిపతులగు కామానాయకుఁడు, త్రి[illegible]రావు, తిమ్మప్పనాయకుఁడు, ఆదెప్పనాయకుఁడు, కొండమరెడ్డి, సాళువ గోవిందరాజు, మధురనాయకుఁడు, కుమారవీర కొ[illegible]బలరాయలు తమతమ వెంటఁ గొంతబలము నుంచుకొని కృష్ణరాయలను సైన్యసహితముగ మధ్యనుంచుకొని రాయచూరు సమీపించిరి. యవన సంస్థానాధీశు లితరు లీ సమయమున ముట్టడింపకుండుటకై తిమ్మరుసుమంత్రి పరిమితబలముతో విద్యానగర దుర్గమును జాగరూకతతోఁ గాచుచుండెను. విద్యానగరము నెవ్వరును జేరి చూడఁజాలరైరి.

ఆదిల్ షాహా గొప్పసైన్యముతోఁ గృష్ణదాటి యీవలకు వచ్చి యంతకుమున్నె యటనున్న కృష్ణరాయల సైన్యము నెదిరించెను. ఉభయసైన్యములకు భయంకరసంగ్రామము జరిగెను. ఈసంగరము కౌరవపాండవ సంగరమును బోలియుండెను. తురుష్కుల ధాటికాగలేక రాయలసైన్యము పాఱిపోవుటజూచి రాయలు సేనానాయకులచేఁ బాఱిపోవువారల నఱకించెను. చచ్చిన సంగరముననే చావవలయునని రాయలసైన్యము మొక్కవోని ధైర్యముతోఁ దురుష్క సైన్యము నెదిరించి చిత్రవధ గావించెను. రాయల సైనికులు తురుష్క సైన్యమును రూపుమాపి పాఱిపోవువారలఁ దరిమితరిమి చెండాడిరి. ఆదిల్ షాహా యేనుఁగునెక్కి కృష్ణదాటి పాఱిపోయెను, సర్వసేనానాయకుడు బంధింపఁబడెను. పలువురు తురుష్కులు కృష్ణలోఁబడి మరణించిరి. దీనులగు కాందిశీకులఁ జంపవలదని రాయలు తనసైన్యమున కుదారభావముతో నాజ్ఞాపించెను. ఈవిజయము క్రీ. శ. ౧౫౨౦ మే నెల ౧౯ శనివారమునాఁడు చేకూరెనని చరిత్రకారులు చెప్పుచున్నారు.

రాయలింతతో సంతృప్తినొందక సైన్యముతో రాయచూరు దుర్గమును ముట్టడించెను. కోటలోనున్న సైన్యము ఇరువదిదినములు లేకధాటిగఁ గృష్ణరాయల సైన్యముతోఁ బోరాడి యపజయము నిశ్చయమని తెలిసికొని దుర్గద్వారములు తెఱచి శరణుగోరెను. రాయలు పురమునందు బ్రవేశించి

తన సైనికులవలన దుర్గవాస్తవ్యుల కెట్టి యిక్కట్టులు రాకుండఁ గాపాడి దుర్గమును స్వాధీన పఱచికొని యచటఁ గొంత సైన్యమును దన ప్రతినిధినుంచి విద్యానగరముచేరి యీసంగరమున బాటుపడిన వీరులకందఱ కుచితభంగి సత్కారములు చేసి గౌరవించెను.

రాయచూరు గోలుపోయిన పిమ్మట ఆదిల్‌షాహా చేయునదిలేక తన దూతను కృష్ణరాయలు యొద్దకుఁ బంపి తన దుస్థితియుఁ బరాజయము నంతయు నివేదించుమనెను. గతమునకు క్షమించి రాయచూరు దుర్గము మాకొసంగుమనికూడ వర్తమానమంపెను. ఉదారశీలుడగు శ్రీకృష్ణదేవరాయలు ఆదిల్‌షాహా వచ్చి తప్పునొప్పుకొని నాకాళ్లు పట్టుకొనెనేని తప్పక రాయచూరుదుర్గము నిచ్చెదనని వర్తమానమంపెను. రాజ్యాశచే ఆదిల్‌షాహా యందులకు నంగీకరించెను. ఇరువురు ముదిగల్లునొద్దఁ గలిసికొనునటులఁ గట్టడిచేసికొనిరి. రాయలు నియమిత కాలమునకు ముదిగల్లుచేరెను. ఆదిల్‌షాహా రాయలునొద్దకేఁగిన బంధించునేమొ యను భయముచేతనో దురభిమానముననో నియతస్థలమునకు రాఁడాయెను. రాయలు కోపించి వెంటనున్న సైన్యముతో విజాపురము ముట్టడించి దుర్గమును రూపుమాపి విజయమునొంది యారాజ్యముఁగొని కలుబరిగి దుర్గమును లోఁబఱచికొని ఆదిల్‌షాహాచే బంధీకృతులై చెఱసాలలోనున్న బహామనిరాజుల ముగ్వుర విడిపించి యందుఁబెద

వానికిఁగలుబరగరాజ్యమునొసంగి కడమ యిరువురను దనరాజ్యధానికిఁ గొనిపోయి వారికున్నతోద్యోగము లొసంగెను. అంతరించిన కలుబరిగిలోని బహమనిరాజ్యమును బునరుద్ధరించుటచే శ్రీకృష్ణరాయలకు "యవనరాజ్యస్థాపనాచార్య" బిరుదమును బ్రజలొసంగిరి. ఈబిరుదము కృష్ణరాయల శాసనములలోఁ బెక్కింటియందుఁగలదు. సర్వమత సమదర్శియగు శ్రీకృష్ణదేవరాయలను మతద్వేషముగలవాఁడనుట సత్యమునకుఁ జరిత్రమునకు ద్రోహముచేయుటె.

కృష్ణదేవరాయలు తన జీవితమునం దెన్నడును పరాజయము నెఱుంగఁడు. గౌతమిపుత్రశాతకర్ణి, కులోత్తుంగచోడుఁడు, ప్రతాపరుద్ర చక్రవర్తులవలె నీతఁడును ఆంధ్రవీరులలో సుప్రసిద్ధుఁడు. ఈరాజచంద్రుడు స్వయముగా నాముక్తమాల్యదయను గ్రంథరాజమును రచించెను. మఱికొన్ని గ్రంథరాజములు రచించెఁగాని యవి యలభ్యములై యున్నవి. ఇతడంకితమొందిన గ్రంథములలో మనుచరిత్రము, పారిజాతాపహరణము సుప్రసిద్ధములు. ఈకాలమున నాంధ్ర వాఙ్మయమునకు సర్వతోముఖమగు సేవ లభించెను. రాయల యవలంబనమున ఆంధ్రభాషలోసర్వాంగసుందరములగు కావ్యరత్నములు పెక్కులు రచింపబడెను. రాజకీయ రంగమునందెగాక వాఙ్మయమునందుఁగూడ కృష్ణదేవరాయల దివ్యనామము చిరస్మరణీయముగ నున్నది.

కృష్ణదేవరాయలు పెక్కుతటాకముల నెలకొల్పి జీవనదులకుఁ గాలువలఁ దీయించి భూదేవిని సస్యసంభరితగ నొనరించెను. విదేశవర్తకమును దేశీయవర్తకమును మిగుల నభివృద్ధిలోనికిఁ దెచ్చెను. మనోహర శిల్పవిన్యాసముతో నలరారు చక్కని దేవాలయములు సభామందిరములు పెక్కుగట్టించెను. స్వయముగ నీనృపాలుఁడు వైష్ణవుఁడైనను శివకేశవుల యెడ భేదబుద్ధి లేక సమముగఁ బెక్కు శివాలయములకు వృత్తి స్వాస్థ్యము లొసంగెను.

రాయల కిరువురు కుమార్తెలు ఒక కుమారుఁడు గలరు. పెద్దకుమార్తెయగు తిరుమలాంబికను రామరాజు పెండ్లాడెను. రెండవకుమార్తెయగు వెంగళాంబను తిరుమలదేవరాయలు వివాహమాడెను. కుమారుఁ డారుసంవత్సరములు మాత్రమె జీవించెను. ఈబాలునకు రాయ లారవయేటనే పట్టాభిషేకము గావించెననియు నితఁడు కాలవశమున గతింప తిమ్మరుసు విసము బెట్టి చంపించెనని తలఁచి రాయలు తిమ్మరుసు గ్రుడ్డు తీయించి కారాగృహమునను నుంచెననియు విదేశీయులచరిత్రయందుఁగలదు. దేశీయచరిత్రములందుఁగాని ప్రవాదములందుగాని తిమ్మరు సింతటి ద్రోహియను కథాంశము తెలియఁబడదుగాన నిది విశ్వసనీయముగాదు. రాయలపుత్త్రుఁడు గతించుటకుఁ గారకుఁడు తిమ్మరుసని కృష్ణరాయలు భావించెననుట విశ్వసనీయముగాదు. ఇంతలో ఆదిల్ షాహా రాయచూరుదుర్గమును హరింప నొక

మూఱు వచ్చెను. రాయలు పరిజనముతో నెదిరింప వచ్చు
చుండుట విని ఆదిల్ షాహా పాఱిపోయెను. ఎటులేని బెల్గాము
దుర్గమును స్వాధీనపఱచికొని ఆదిల్ షాహాను బంధింపకున్న
యెడల రాయచూరుదుర్గమును హరింపకమానఁడని కృష్ణదేవ
రాయలు సంగ్రామ ప్రయత్నములు చేయుచుండెను. ఆ సం
కల్పము నెరవేరకయున్న క్రీ. శ. ౧౫౩౦ లో శ్రీకృష్ణదేవ
రాయల మార్తాండుఁడు అస్తంగతుడయ్యెను.

అద్వితీయ పరాక్రమశాలి యగు కృష్ణరాయనితోఁ
బాటు ఆంధ్రవీరుల స్వాతంత్ర్యదీక్షయు నంతరించినది. ఆంధ్ర
సామ్రాజ్య నిర్మాతలలోఁ బ్రథమగణ్యుఁడగు శ్రీకృష్ణదే
రాయలు అద్వితీయ పరాక్రమముతోఁ జిరకాలము రాజ్యమే
యంత్యదశలోఁ దన యేకపుత్త్రుని కనులముందు దాటిపోవ
కాలపురుషుని దురంతకర్మఫలము. ఈమహావీరుని పవిత్రజీ
తము వాఙ్మయమందును, సామ్రాజ్యచిహ్నములు హం
ప్రాంతమునను దర్శనీయములై యలరారుచున్నవి. ఆంధ్రజాతికి
కృష్ణదేవరాయలు మఱచిపోరాని వేలుపు. ఇతనితో ఆంధ
స్వాతంత్ర్యరంగము ముగిసినది.

# రామరాజు

కృష్ణదేవరాయల మరణానంతర మాతని సవతి తల్లి కుమారుఁడగు నచ్యుతదేవరాయలు విద్యానగర సామ్రాజ్యాధిపతియై క్రీ. శ. ౧౫౩౦-౧౫౪౨ వఱకు రాజ్యము పాలించెను. భోగలాలసుఁడగు నీనృపాలుని కాలమున విజాపురము నవాబు దండయాత్రయొనరించి ముదిగల్లు, రాయచూరు దుర్గములఁ దీసికొనెను. రాజ్యములోని భాగములుగూడఁ దోచెను. తనసుఖమున కేమిభంగము వాటిల్లునోయని అచ్యుతరాయలు నవాబుతో సంధి గావించుకొనెనుగాని సంగరమున కెన్నఁడును యత్నముగావించి యెఱుంగఁడు. అచ్యుతరాయల రాజ్యమున కాతని బావమఱఁది సలకము తిమ్మయ ముఖ్యమంత్రిగ నుండెను. అచ్యుతరాయల మరణానంతర మతని కుమారుఁడగు వెంకటపతిరాయలు రాజై కొంతకాలము రాజ్యమును పాలించెను. సలకము తిమ్మయ్య మాయోపాయములచే వేంకటపతిరాయలను జంపించి తానె విద్యానగర సామ్రాజ్యమునకుఁ బ్రభువయ్యెను. సేనాధిపతులు పౌరులు సలకము తిమ్మయకుఁ దిరుగఁబడి కృష్ణదేవరాయల యల్లుఁడగు రామరాజునకు వర్తమానమంపి సామ్రాజ్యోద్ధరణము గావింపుమని కోరిరి. పెనుగొండ నుండి రామరాజు సైన్యముతో విద్యానగరమునకువచ్చి యధికారులఁ గూడఁగట్టుకొని సలకము తిమ్మయను బంధించి

యచ్యుతరాయల యనుజుఁడగు సదాశివరాయలను రాజున
జేయఁ గృషి యొనరించెను.

ఈపరిస్థితులను సలకము తిమ్మయ గమనించి యుపేక్షిఁ
చినఁ దనకే యపాయము ప్రాప్తించునని యాదిల్ షాహా
రహస్యముగరప్పించి విద్యానగర రాజ్యము నాతనియధీనముగ
వించెను. రామరాజాదులు చేయునదిలేక సలకము తిమ్మయ్య
యొద్దకుఁబోయి మేము నీకు లోఁబడి యిచ్చవచ్చినచొప్పునఁ
జరించెదము. నవాబు నెటులేని పంపుమని కోరిరి. వారిమాటలు
నమ్మి సలకము తిమ్మయ్య నవాబునకమితధనము కొన్ని మణు
లపరాధముక్రింద నొసంగి పంపివేసెను. రామరాజాదులు నవా
బుపోయిన వెంటనే తిరుగఁబడి తిమ్మయ్యను జంపయత్నించు
చుండిరి. ఇఁకబ్రదుకుట యసాధ్యమని తిమ్మయ్య భాండాగారము
కొల్లగొట్టి గుఱ్ఱముల తోఁకలు చెవులు గోయించి రత్నము
లన్నియుఁ దిరుగళ్ళలో విసరించి చేతనైనంతవఱకు సామ్రా
జ్యసంపదలఁ బాడుజేసి తానాత్మహత్య గావించుకొనెను.

రామరాజు సదాశివరాయలను విద్యానగర సంస్థానము
నకు నామమాత్రమున నధీశ్వరుని గావించి తానె సామ్రాజ్య
మును బాలించుచుండెను. రామరాజు నరపతి వంశజుఁడు. బస
వేశ్వరునిచేఁ జంపఁబడిన బిజ్జలుఁ డీవంశమునకుఁ గూటస్థుఁడు.
తరువాత నీవంశజులు చిరకాల మార్వీటిలోనుంటచే నార్వీటి
వారనఁబడిరి. రామరాజు పూర్వము కృష్ణరాయల హస్తగతమై



రామరాజు

యున్న రాజ్యమునంతయు మరల వశపఱచుకొని విద్యానగర సామ్రాజ్యమును మహోన్నతదశకుఁ దెచ్చెను. అంతియగాక కృష్ణదేవరాయల జీవితములో నెరవేర్పఁబడని మహామ్మదీయ సంస్థానాధీశులను లోఁగొనుట రామరాజు నెరవేర్పఁ యత్నించెను. ఈసందర్భమునఁ దురుష్క సంస్థానములఁగూర్చి కొంచెము చెప్పవలసియున్నది.

విజాపురరాజ్యము ఆదిల్ షాహా స్వాధీనమునందుండెను. అహమ్మద్ నగరరాజ్యము బుర్హాన్ నిజాంశాహా స్వాధీనమునను, గోలుకొండరాజ్యము జమ్షీద్ కుతుబ్ శాహా స్వాధీనమునను, బీదర్ రాజ్యము ఆలీబేరీదు స్వాధీనమునందును నుండెను. ఈనాలుగురాజ్యములు విద్యానగరమునకు నుత్తరదిశయం దుండెను. తక్కినమువ్వురు నవాబులు రామరా నకు నిష్టులుగా నుండిరి. ఆదిల్ షాహా చిరకాలమునుండి ద్యానగరసంస్థానమునకు ద్వేషిగాన రామరాజునకు నటులె త్రుగణములలోని వాఁడయ్యెను. రామరాజు సహాయము గాతగాఁగొని తక్కినమూఁడురాజ్యముల నేలు నవాబులు ముగ్గురు ఆదిల్ షాహామీఁదికి యుద్ధమున కేఁగిరి. రామరాజు తనసోదరుఁడగు వేంకటాద్రిని కృష్ణా, తుంగభద్రా నదుల మధ్యనున్న అంతర్వేదిని, అచ్యుతరాయలు కోల్పోయిన రాయచూరును సాధింపుమని పంచెను. ఇందఱిధాటికి తాళజాలక ఆదిల్ షాహా తనదుర్బలస్థితిని కాలపరిస్థితులను గమనించి

రామరాయలతో సంధిగావించికొని విద్యానగర సంస్థానవినాశనమునకు మార్గము లన్వేషించుచు గాలము గడుపుచుండెను.

ఆకాలమున పోర్చుగీసువారు విస్తార సైనికబలముతో రేవుపట్టణముల నాశ్రయించికొని వ్యాపారము చేయుచుండిరి. రామరాజు వారిని సంధిగావించుకొని తురుష్క సంస్థానముల కెట్టి సహాయము చేయకుండునటులఁ గట్టుదిట్టములు గావించుకొనిరి. రామరాజు సహజముగఁ దురుష్క ద్వేషి కాఁడు కావునఁ దురుష్క రాజ్యమున నుండజాలక వచ్చు తురకవారలకందఱకు నొకవీధి గట్టించి యిచ్చెను. వారికొక మసీదుగూడఁ గట్టించి తనరాజ్యమున వారల కుద్యోగము లొసంగెను. ఇబ్రహిం తన యన్నయగు జమ్షీదు కుతుబుషాహ తనను జంపు నేమోయని రామరాజును శరణు గోరెను. ఒకగ్రామము నొసంగి యతని మిగులఁ బ్రేమతో రామరాజును చూచి క్రీ. శ. ౧౫౫౦ లో ఇబ్రహిం కుతుబ్ శాహ నామముతో నాతనిని గోలకొండ రాజ్యాధిపతిగ నొనరించెను. నిజాముషా రామరాజునకుఁ గానుకలుబంపెను. అదివిని ఆదిల్ షాహ కోపించి దురుసుమాటలాడి విద్యానగర సంబంధులగు రాయబారులను ఆదిల్ షాహ పరాభవించి వెడలనడచెను. ఈసంగతి రామరాజు విని కోపించి నిజాముషాహను ఆదిల్ శాహమీదికిఁ బ్రోత్సహించి దండయాత్రకుఁ బంపెను. ఆదిల్ శాహ, నిజాముశాహ దుర్గము నాక్రమించుకొనెను. క్రీ. శ ౧౫౫౧ లో రామరాజు తన నాల్గవ

కుమారుఁడగు చిన తిమ్మరాజును వెంటఁగొని రాయచూరు ముదిగల్లు క్షేత్రములను సాధించెను. రామరాజుతోఁ బగఁగొనిన బ్రిదుకుట దుస్తరమని గ్రహించి ఆదిల్ షాహా విధేయుఁడుగ నుందునని వాగ్దానము గావించెను. సైపు అయిన్ ఉల్ ముల్కు అను సరదారు తిరుగఁబడి విజాపురమునవాబునోడించి రాజ్యమును హరించెను. రామరాజు కనికరించి తనతమ్ముఁడగు వేంకటాద్రిచేనాతనినిజంపించి పూర్వరాజ్యముయథావిధిఆదిల్ షాహాకుఁ దిరుగనిప్పించెను. ఇంకననేక పర్యాయములు రామరాజుసహాయముతో ఆదిల్ షాహా తాను గోల్పోయిన తన రాజ్యమును మరల సంపాదించుకొనఁ గలిగెను.

విజాపురము నవాబగు ఇబ్రహీం ఆదిల్ షాహా క్రీ. శ. ౧౫౫౭ లో మరణించెను. అతని జ్యేష్ఠసుతుఁడు అలీఆదిల్ షాహా విజాపుర రాజ్యమునకు నవాబయ్యెను. ఇటులుండ రామరాజు కుమారుడు మరణించెను. ఈ యవకాశము జూచికొని రామరాజు స్నేహమును సంపాదింపవచ్చునని అలీఆదిల్ షాహా స్వల్పబలముతో విద్యానగరము జేరి రామరాజును బరామర్శించి చనిపోయిన కుమారునకుమారు నన్నుఁ జూచుకొండని ప్రార్థించెను. రామరాజుఆతనిభార్యయు నాబాలునిపుత్త్రవాత్సల్యముతోఁ దిలకించుచుండిరి. రామరాజును నతనిభార్యను నతఁడు దండ్రివరుసతోఁదల్లివరుసతోఁ బిలుచుచుండ వారిరువు రీతని కుమారుని బిలుచునటుల హృదయపూర్వకమగు ప్రేమతోఁ బిలుచు

చుండిరి. విద్యానగర సామ్రాజ్యమును రూపుమాపుటకు రామరాయలను దల్లికోట యుద్ధములో ఘోరమృత్యువు పాల్ప అచుటకు నీపేర్మిమాస్పదుఁడగు కుమారుఁడె కారణమయ్యెను. ఎన్ని విధముల హృదయమిచ్చి రామరాజు వానిభార్య పేర్మింంచి నను సహజక్రూరభావము నాదంపతులయెడ ఆలీఆదిల్ షాహా విడనాడఁజాలక సమయము వచ్చినపు డీపేర్మిను సాధనము గాఁగొని జయింప యోజించి తనరాజ్యమునకు వెడలిపోయెను.

తనపూర్వులవలనఁ గైకొన్న కల్యాణి, షోలాపురము నగరములు తన కిచ్చివేయవలసినదిగా ఆలి ఆదిల్ షాహా నిజాం షాహాకు వర్తమాన మంపెను. నిజాముశాహా దూతను బరాభ వించి పంపెను. ఆలిఆదిల్ శాహా రామరాజునుగలసి అహమ్మ దునగరుమీఁదికి దండెత్తిపోయి యారాజ్యమునందలి పెక్కు గ్రామములు రూపుమాపిరి. ఆసమయమున హిందూసైనికులు మసీదులు కూలద్రోసి ఖురాను గ్రంథములను జింపిపాఱవేసి తురుష్కస్త్రీలను బరాభవించిరి. రామరాజుసైన్య మొనరించిన దురంతములకు లోనఁ గోపించియు ఆలిఆదిల్ షాహా బయటికిఁ దగిన ప్రతిక్రియ గావించితిమని యానందించెను. నిజాముశాహా రామరాజుతో సంధిగావించుకొని కల్యాణనగరము కోల్పోయి నందుల కెంతయుఁబరితపించుచు ఇబ్రిహింకుతుబ్ షాహాతో సంధి గావించుకొని కళ్యాణనగరముముట్టడింపఁబిలుచుకొనివచ్చెను. విజాపురపు నవాబు, రామరాజు, వారల నెదిరింప నమితబల

సహాయముతోనేఁగిరి. ప్రతిఘటించిన దనకసాయు
ఇబ్రహీం కుతుబ్ షాహా రామరాజుతోఁ గలిసె
నీముర్ముదు సేనతోఁ బైబడఁ జేయునదిలేక నిజాం
రాజధానికిఁబోయి తలదాఁచికొనెను. ముర్ముదురా
షాహాను వెంటనంటి అహమ్మదునగరమును ము ట్ట
కొండనవాబు లోలోన నిజాంశాహాకు సహాయమ
డెను. ఈసహాయమువల్ల అహమ్మదునగరమువర్ష
వారికివశముకాకపోవుటచే మరియొకమాఱు మ
యెవరిత్రోవనువారు తమతమ రాజ్యములకేఁగిరి.
ముగూడ రామరాజుసైనికులు రాజ్యములోని
హింసించుచుఁ దురుష్కాంగనల నవమానించుచు
లఁ దోఁచియుచు నెన్నియో దురంతములు గావిం
యోత్సాహమును బ్రకటింపసాగిరి. పరస్పర భి
లగు నవాబులందఱు హిందువులుగావించు విప్లవ
విజయనగరసామ్రాజ్యముపై లోలోనఁ బగను
వేళ పరవశులగు తురుష్కులు రామరాజుపైఁ
లఁదీర్చుకొందుమాయని లోలోనఁ యోజించుచ
రా జీయంశమును నిర్లక్ష్యభావముతో గమనింప
చిక్కినపుడెల్ల తురుష్కరాజ్యములోని భాగము
తనరాజ్యమును నభివృద్ధి చేయుచుండెను. బలః
వృద్ధి యగుకొలఁది రామరాజు తురుష్కులయెడ

త్తో వారిదూతలఁ బరాభవించుచుఁ దనయాజ్ఞలేనిది తనతో వచ్చు తురుష్కుఁడు అశ్వము నెక్కరాదని నిబంధన చేసెను. ఇది నవాబు లాలకించి "తమలోఁ దాము భిన్నాభిప్రాయముగ నుండుటచేతనే రామరాజాదులు మహమ్మదీయులను బరాభవించుచున్నాఁడు. రామరాజు రాజ్యమును హరింపకున్న తురుష్కరాజ్యము నశించుట నిశ్చయమని తమలోఁ దాము కూడఁ బలికికొని ఐకమత్యముతో వర్తించుచుండిరి. రామరాజు నెదిరించుటలో మహమ్మదీయులందఱు నేకాభిప్రాయులైరి. సంబంధములు గలసినగాని పూర్వవైరము లడఁగవని స్వాభిమాన మతిశయింపదని ఆదిల్ షాహా నిజాముషాహా తన కూఁతురగు చాందుబీబీ నొసంగి వివాహము గావించెను. ఆదిల్ షాహా చెల్లెలిని నిజాముషా కుమారుఁడగు ముర్తజా పెండ్లాడెను. గోలకొండనవాబు, బెదర్ నవాబు, బరీదుషాహా వీరలతోఁ గలిసిరి.

ఆదిల్ షాహా బయటికి మంచివానివలె నటించుచుఁ దురుష్కులు చేయు దుండగములలోఁ దానేకీభవించుట లేదనియు నెటులో మిత్రభేద మొనరించి వారలను మిగులఁబట్టి యొసంగుటకే వారితోఁ గలిసియుంటినిగాని వేఱు కారణము కాదనియు రామరాజునకు వర్తమానమంపెను. పుత్రవాత్సల్యవిధేయుఁగు రామరాజావంచకుని వాక్యములను విశ్వసించెను. తరువాత నవాబులు నలుగురేకమై అకస్మికముగా నొకదినమున

విజాపురముచెంతగల మైదానమున సైన్యమునుంచిరి. యుద్ధకారణము గావలయునుగాన ఆలి ఆదిల్ షాహా రామరాజునకుఁ దన పూర్వులనుండి గైకొన్న రాయచూరు, ముదిగల్లు దుర్గము లీయవలయునని వర్తమాన మంపెను. రామ రాజా వర్తమానము విని అదిల్ షాహా దుర్మార్గమునకుఁ గృతఘ్నతకు మిగులఁ గినిసి యీ రాయబారి నిట్టి సందేశములు తేకుండ బ్రదుకుమని శిక్షించి పంపెను. ఇదియే యాధారముగఁ గొని నవాబులందఱు విద్యానగర సామ్రాజ్యము ముట్టడించుటకుఁ దృణకాష్ఠ జల సమృద్ధిగల ద్రోణనదీ తీరమున నివసించిరి. రామరాజు తురుష్కులంద ఱేకమై దనపైకి వచ్చుచున్నారని విని తోఁక త్రొక్కిన పామువలె నదరిపడి మహామ్మదీయ రాజ్యముల నిర్మూలనము గావింపక మాననని ప్రతిజ్ఞావాక్యములు పలికి విరోధులు కృష్ణదాటి రాకుండ కొంత సైన్యమును నాటంకపరచుటకుఁ బంపెను. రామరాజు తన రాజ్యమునందలి యన్నిభాగములనుండి సైన్యమును రప్పించెను. ఆఱులక్షల కాల్బలము లక్ష ఆశ్వికబలము సమకూర్చెను. తిరుమలరాయునికి లక్ష కాల్బలము, ఇరువదియైదు వేల యాశ్వికదళము, ఐదువందల యేనుంగులు నొసంగి తురుష్కుల నెదిరింపఁబంపెను. అపరిమిత సైన్యముతో నాతని వెనువెంట మరియొకసోదరుఁ డగు వేంకటాద్రిని బంపెను. రామరాజు మిగిలిన సేనతో

సమయమునాఁటికి రామరాజు తొంబదియాఱు సంవత్సరముల వృద్ధుఁడని చరిత్రకారులు కొందఱు వ్రాసియున్నారు. తురుష్కులుకృష్ణానదిదాటి పైకి రానిశ్చయించుచుండఁ బ్రవాహమును దాటి రాకుండ రామరాజుబల మాటంకము గలుగఁ జేసెను. వా రేరేవునకువచ్చిన నారేవున కాటంకము గలుగుచుండెను. ఇట్లున్నలాభములేదని తురుష్కులు తమసైన్యమును రెండుచీలికలు చేసి కృష్ణదాటునటుల నటించి యొకతీరమున జేరిరి. రామరాజు బలమంతయు నా తీరమున కెదురు నిల్చి యాటంకపఱచుచుండెను. ఇంతలో మిగిలిన తురుష్కసైన్యము క్షణములో కృష్ణానదిదాటి యీవల కేతెంచి వ్యూహములఁ బన్నిరి. రామరాజుసైనికులు తురుష్కులు కృష్ణదాటి యెటుల రాఁగలిగిరోయని యాశ్చర్యపడుచు వారి నెదిరింపఁబోవుసరికి మిగిలినసైన్యము కృష్ణదాటి రాఁగలైను.

తురుష్కులు తమసైన్యమునకు మధ్యభాగమునందు మూఁడువరుసలుగా నాఱువందల ఫిరంగులను బెట్టిరి. ముందు వరుసలో మిక్కిలిపెద్దఫిరంగులఁ జేర్చిరి. వానివెనుక తుపాకులఁ జేర్చిరి. ప్రతిపక్షులకే నిర్మాణము కానరాకుండునటుల రెండు వేలకాల్బలమును ముందుంచిరి. కొంతసేపటికి హిందూమహమ్మదీయసైన్యములు సంగరమునకుఁ దలఁపడెను. తురుష్కసైనికులు ధారాళముగా శరవర్షమును రామరాజుసైన్యముపై గురిపించిరి. రామరాజుసైనికులకుఁ బ్రోత్సాహవాక్యములఁ బలికి తురుష్క

దళమును బంధింప నాజ్ఞాపించెను. హైందవసైన్యము శరవేగమున దురుష్కదళముపైఁబడెను. తురుష్కసైనికు లీసమయమును గుర్తించి యీవలావలకునొత్తిగిలిరి. చాటుననున్న సరదారులు ఫిరంగులు తుపాకులు నొక్కమారు పేల్చిరి. ఆకస్మికముగా హిందూసైన్యము సంగరరంగమున మాడిపోయెను. ఈఘోరకృత్యము కనులార గాంచియు రామరాజు నిరుత్సాహపడక రెండువైపుల నిరపాయముగ నున్నసైన్యమును సంగరమునకుఁ బురికొల్పెను. హైందవసైనికు లుత్సాహముతో ముందునకు నడువసాగిరి. హిందువులధాటి కాగజాలక తురుష్కులు వెనుకడుగు వేయుచుండిరి. రామరాజు తనసైన్య విజృంభణమునకు మిగుల నానందించి వ్యూహమును బన్ని తురుష్కసైన్యమును జుట్టుముట్టిన విజయము క్షణములో సాధ్యమగునని నిశ్చయించి తానొక యున్నతమైన పీఠము వేయించుకొని వజ్రములు రత్నములు వరహాలు రాశిపోయించి జయప్రదముగాఁ బోరాడిన సైనికులను సత్కరించుచుఁ బ్రోత్సహించుచుండెను. హిందువులు తురుష్కులఫిరంగులఁ బట్టుకొనుటకు మిక్కిలిసాహసముతో ముందున కేగిరి. అంతకుమున్నె యవి మందుచే నింపఁబడియుండుటచే తురుష్కు లాకస్మికముగాఁ బేల్చిరి. అయిదువేలమంది మేటిశూరులు మరణించిరి. హైందవసైన్యము నడిభాగమిటులఁ బలుమారు నశించుటఁజూచి రామరాజు తాను స్వయముగా సైన్యము నడిపిన ఫిరంగులు సులభముగాఁ జేతికి

జిక్కవచ్చునని సైన్యమధ్యభాగమునకు మేనాయెక్కి బయలు దేరెను. దురదృష్టవశమున రామరాజింతకు మున్నెక్కివచ్చిన యేనుఁగు బెదరి మేనామీఁదఁ బడెను. వాహకులు భయవశమున నోడలేకుఁగక మేనా విడిచి పారిపోయిరి. రామరాజు క్రిందబడియుఁ దెప్పరిల్లి కొంతసేయున్న యున్న తాశ్వము నెక్కఁ బోవ నిజాముషా సైనికులు రామరాజును బంధించి జయజయ ధ్వనులు గావించుచు నిజాముషాహాయొద్దకుఁ గొనిపోయిరి. వెంటనే నిజాముషాహా తన ఖడ్గమును బెరికి రామరాజు తల ఖండించి బల్లెమునకొనకుగ్రుచ్చి హైందవ సైన్యమునకుఁ జూపించెను. తమరాజు మరణించుటకు హైందవసేన మిగులఁ జింతించి రణరంగమునందమకు విజయము దుస్తరమని పాఱిపోవుచుండఁ దురుష్కులు లక్షమంది ఆంధ్రసైనికులను అరటిచెట్టుల నఱికి నటుల నఱికిరి. హిందూ సైన్యము సర్వవిధములనాశనమయ్యెను. చిరకాలమునుండి యభివృద్ధినొంది మహోన్నతదశకు వచ్చిన విద్యానగర సామ్రాజ్యము దైవవశమున నిటుల నాశ మొందెను. ఆంధ్రవీరులలో సుప్రసిద్ధుఁడును శూరవతంసుఁడు నగు రామరాజు మరణముతో నాంధ్రుల సమగ్రసౌభాగ్యాతిశయము అదృశ్యమయ్యెను. రామరాజుతో నాంధ్రులస్వాతంత్ర్యేచ్ఛ యంతరించెను.

హిందూసైనికు లీవిధముగఁ బరాజయమునొంది తురుష్కులబారినుండి బ్రదుకఁదలఁచి విద్యానగరమునకుఁ జేరి ధన

ధాన్యాదులు ఆలుబిడ్డలనుగొని తమతమ యిరవులకుఁ
వెడలిపోయిరి. రామరాజు సోదరుఁడగు వెంకటాద్రి సఁ
న మరణించెను. తిరుమలదేవరాయలు ప్రాణభయ
విద్యానగరముచేరి సదాశివరాయలను ధనకనక వస్తు
ములను వెంటఁగొని పెనుగొండకుఁ బారిపోయెను. స
ద్విభాసురమై సురక్షితముగానున్న విద్యానగరమున
పౌరులందఱు దిక్కుమాలినవారై యెటుబోవ దరిగా
లాడుచుండిరి. చుట్టుపట్టుల నన్నివైపుల మహమ్మదీయ
ము నిండిపోయెను. ఈ యదను గ్రహించి చుట్టుప్రక్క
యాటవికులు పలుమాఱు విద్యానగరమునఁ బ్రవేశిం
హింసించి వారిధనముల యథేచ్ఛముగా దోచుకొని
పురములో నున్న పౌరులిపాట్లు పడఁజాలక రాజ్యము
యెందోపోయిరి. కొంతకాలమునకుఁ దురుష్కసైన్యవ
విద్యానగరమునఁ బ్రవేశించి యొనరించిన దురంతము ల
ములేదు. నిరపరాధులగు పౌరుల నెందరనో చంపిరి. స్త్రీ
మానముల పాలు చేసిరి. రాజమందిరములు, దేవాలం
అంగడివీధులు పగులగొట్టి కాల్చి, మాడ్చి, నేల
గావించిరి. కొంతకాలమునకు విద్యానగరమును జరిత్ర
నేని గాంచి గుర్తింపరానివిధమున వినాశమొనర్చిరి.
దర్పసైనికుఁడు విద్యానగరధనమును ఒంటెలతో నె
మోయించుకొని తమరాజ్యమునకుఁ గొంపోయి య
భాగ్యవంతుఁడయ్యెను.

ఆంధ్రరాజులచేఁ బరిపాలింపబడి యాంధ్రకవితకు నాటపట్టి శాశ్వతస్థాయిగా నాంధ్రచరిత్రములకు నాదర్శప్రాయముగా నుండఁదగు విద్యానగర సామ్రాజ్యముతోఁబాటుగా నాంధ్రుల యదృష్టముగూడ నంతరించెను.

రామరాజు భట్టుమూర్తిని గౌరవించి పెక్కుకావ్యములంకితము నొందెను. రాయలవారు సాధింపఁజాలని తురుష్కరాజ్యములను సాధించెను. ఆంధ్రుల పరాక్రమమునకుఁ బ్రాణభిక్ష పెట్టి యాంధ్రులు పరాధీనత గాంచకమున్నె యంతరించెను. తురుష్కుల దండయాత్రలచే నాంధ్రసామ్రాజ్యములు రెండును నశించెను. మొదటిది కాకతీయ సామ్రాజ్యము, రెండవది విద్యానగర సామ్రాజ్యము. ఈ యుభయ రాజన్యులు ఆంధ్రజాతీయతా సంరక్షకార్థము జనించిరి. జాతీయత నుద్ధరించి కృతార్థులైరి. దేశీయుల దురదృష్టవశమున వారు గడించిన యౌన్నత్యము భాగ్యభోగ్యములు, ఐశ్వర్యజీవనము వారితోడనే కాలగర్భము నం దదృశ్యమయ్యెను. వీరారాధన మను నాచారముగల యాంధ్రకుమారులు రామరాజు దివ్యనామము మఱువకుండురేని కృతార్థులు కాకపోరు.

రామరాజు మరణించిన దినము క్రీ. శ. ౧౫౬౫ సం॥ జనవరి ౨౩ వ తేది మంగళవారమని చరిత్రకారులు నిర్ణయించినారు. ఆదినమె యాంధ్రవికాసమున కంత్యదినము. నాఁడె ప్రళయకాలాంబుదము లావరించి విజయనగర సామ్రాజ్యమును రూపుమాపెను.

---

# యాచశూరుడు

ఆంధ్రవీరులలో వెలమవారగు రేచర్లగోత్రీయులు సుప్రసిద్ధులు. భేతాళనాయకుఁడు, అనపోతనాయకుఁడు, సర్వజ్ఞసింగభూపాలుడు మున్నగు వెలమవీరులందఱు నీరేచర్లగోత్రసంజాతులె. రేచర్లగోత్రీయులు తొలుత కాకతీయసామ్రాజ్యమున సేనానాయకులుగ నుండి యప్రతిమాన పరాక్రమముతో సంగరములలో జయముఁగడించి తమప్రభులచే సత్కారముల నొందిరి. కాకతీయసామ్రాజ్యము పడిపోయిన పిదప నీ వెలమవీరులు స్వతంత్ర రాజ్యములను స్థాపించి చిరకాలము పాలించిరి. అనంతర మీ రాజ్యములు యవనుల యొత్తిడిచే రానురాను జీలి భిన్నభిన్నమైపోయెను. ఈ రేచర్ల గోత్రమునందు జనించిన యాచశూరుఁడు చంద్రగిరి వీర వేంకటపతిరాయలు పాలించుతఱి కొంతకాలము మధురాంతకమునందును మఱికొంత కాలము ఉత్తరమల్లూరునందును సామంతరాజుగా నుండి స్వామిభక్తివిశేషమునఁ బేరెన్నికఁ గాంచెను.

విద్యానగర సామ్రాజ్యము పతనము కాఁగానే తిరుమలరాయలు పెనుగొండ జేరినటుల మన మెఱింగియున్నారము. అక్కడఁగూడ విరోధులవలని యొత్తిడి తగ్గకపోవుటచేఁ జంద్రగిరి చేరెను. ప్రకృత కథాకాలమున దిరుమలరాయుని తనయుఁడగు వీర వేంకటపతిరాయలు చంద్రగిరి రాజ్యమును



యాచశూరుఁడు.

ములుగా నున్నవనియు వీర వేంకటపతిరాయలచే బట్టాభిషిక్తు డైన రంగరాజె తమకు నిజమగు ప్రభువనియు యాచశూరుఁడు జగ్గరాజునకు వర్తమానమంపెను. జగ్గరాజు యాచశూరు నిమాట పాటింపక చిక్కరాజు పేరఁ దానె రాజ్యవ్యవహారము లను నిర్వహించు చుండెను.

యాచశూరుఁడు చెఱసాలయందున్న రంగరాజు నెటు లేని విడిపింపవలయునని విశ్వప్రయత్నములు చేసెనుగాని లాభములేకపోయెను. కారాగృహవాసుల వస్త్రము లుదుకు చాకలిఁవాండ్రను లోఁగొని వాండ్రకు లంచము లొసంగి శ్రీరంగరాయల ముగ్గురు కుమారులలో మధ్యవాఁడగు పం(డ్రెండు సంవత్సరముల బాలుని బట్టలమూటలలోఁబెట్టి బయటికిఁ దెప్పించి యాచశూరుఁ డాబాలుని తనయొద్ద నుంచుకొని పెంచుచుండెను. యాచశూరుని భేదనీతియు జగ్గరాజు దుర్మార్గము ఫలింప నెనిమిదివేల సైన్యముతో నలుగురు సేనానాయకులు యాచశూరుని గలిసిరి. యాచశూరుఁడు విశ్వాసపరులగు నిరువదిమంది సైనికులను బిలిపించి చంద్రగిరికేఁగి చెఱసాల పాలకునియొద్ద నుద్యోగమునఁ గుదిరి యెటులేని రంగరాజును విడిపించుడని పంపెను. వారు చెఱసాల యధికారి యొద్ద స్నేహము సంపాదించుకొని కారాగృహమునుండి బయటికొక సురంగము త్రవ్వి వారి నాసురంగపు ద్వారమున బయటికిఁ గొనివచ్చుచుండిరి. అంతకుమున్ను వేఁటకేఁగి తిరిగి

వచ్చుచున్న జగ్గరాజుగుఱ్ఱపుకాలు సురంగవు మొదట దిగం
బడెను. ఏదయో వింతవలె నున్నదని యాభాగము దర్శింప
నందుండి బయటికివచ్చుచున్న సైనికులు, రంగరాజు, నాతని
కుటుంబము బయటపడెను. జగ్గరా జీ ద్రోహమునం బాలుగొ
న్న సైనికుల నందఱను జిత్రవధము గావించి యింకొక దృఢ
తరమగు గృహమునందు రంగరాజు నాతని కుటుంబమును
జేర్చి విశ్వాసపాత్రులగు మఱికొందరు భటులను గావలిపెట్టి
జాగ్రత్తగా మెలంగ నాజ్ఞాపించెను.

తనయత్నము నిష్ఫలము కాంగానే యాచశూరుండు
కొందఱువేగులవాండ్రను జందగిరిసేనానాయకుని యొద్దకుం
బంపి కొంతధనము లంచముగ నొసంగజేసి జగ్గరాజు లేన
పుడు కారాగృహపాలకులం జంపి కారాగృహద్వారములం
దెఱచి తనకు వర్తమానము చేయునటులం గట్టడిజేసెను.
జగ్గరాజు రాజ్యమునలేని తరుణము గనిపెట్టి సైన్యాధికారి
కారాగృహ పాలకులను జంపించి కారాగృహద్వారములు
తెఱపించి తనకు నమ్మకమైన దూత కీవార్తనువ్రాసిన జా
బొసంగి యాచశూరునియొద్దకుం బంపెను. దురదృష్టవశమున
నాదూత జగ్గరాజుచేతం జిక్కెను. జగ్గరాజు దొడ్డిగుమ్మము
నుండి కోటలోం బ్రవేశించి కారాగృహమును మరల బంధించి
సైన్యాధికారిని నాతనితోంగలిసిన యితరోద్యోగులనుగూడం
జంపించెను. ఈవర్తమానము యాచశూరుండు విని తనప్రియ

త్నములన్నియు విఫలమైనందులకు మిగులవగచి సైన్యసహితముగఁ బోరాడి చంద్రగిరి దుర్గమును సాధించినఁగాని రంగరాజును విడిచిపెట్ట వీలుకాదని సైనికబలము నభివృద్ధిచేయుచుండెను. ఇంక నుపేక్షించినయెడలఁ బ్రతిపక్షులు బలవంతులై రంగరాజును బంధోన్ముక్తునిగావించి తిరుగఁబడక మానరని దయావిహీనుడగుఁ జగ్గరాజు రంగరాజు కుటుంబమును నాశనము జేయ సిద్ధపడెను. జగ్గరా జొకదినమున తనసోదరుఁడగు ఓబలరాజును బిలిపించి యాతనికి ఖడ్గమునొసంగి కారాగృహమున కేఁగి లోనున్న రంగరాజును గుటుంబసహితముగాఁ దెగటార్చిరమ్మని పంపెను. క్రూరుఁడగు ఓబలరాజు దయారహితుఁడై కారాగృహమునఁ బ్రవేశించి తన యన్నయాజ్ఞ వారికి వినిపించి వారిఁ జెండఁబోయెను. రంగరాజు తిరుగఁబడి యోబలరాజును నాతనికి సహాయముగావచ్చిన సైన్యమును బోరిగొనవలయునని యత్నించెను గాని దానివలన నిరపరాధులగు సైనికులు మరణించుటయెగాని తన కపాయము తొలంగఁజాలదని తలంచి రంగరాజు కుటుంబమరణమునకె యనుమతించెను. "ఓబలనాయకుని చేతఁ జావనేల? నా చేతిమీఁదుగఁ దొలుత కుటుంబమును దెగటార్చి యాత్మహత్య గావించుకొందుఁగాక" యని శూరశిరోమణియగు రంగరాజు కత్తిగైకొని యేపాపము నెఱుంగని తనపసిబిడ్డల నిరువురను ధర్మపత్నిని ఖండించి తనతలఁ దాను నఱకికొని పడిపోయెను.

ఈఘోరహత్యల విన్నంతనె జగ్గరాజుపై నసహ్యము రంగరా జుకుటుంబముపైఁ గనికరము ప్రతిపౌరునకు జనించెను. జగ్గ రాజుపరిపాలనముపై నసూయవహింపని మనుష్యుఁడె లేఁడు. రాజ్యచక్రము కేలనుంచుకొని కపటనాటకము నాడించు నా జగ్గరాజుదుర్మార్గ వృత్తికి జంకి పౌరుఁడెవ్వఁడును మాటాడఁ డయ్యెను. కాని లోలోని నందఱకుఁ గోపము వృద్ధినొందెను.

ఈ దుష్కృత్యము లన్నింటిని గాంచి యాచశూరుఁడు మిగుల నాందోళనపడి తాను బ్రతికియుండియు నధర్మమును వారింపఁజాలనందులకు విచారపడెను. యాచశూరుఁ డొకదిన మున జగ్గరాజునొద్దకు నొకదూతుని బంపి "రంగరాజు రెండవ కుమారుఁడు ఇంకను జీవించియున్నాఁడు. ఆతనిని నన్నుఁజంపి మీమేనల్లుచేఁ జంద్రగిరి రాజ్యము నాచంద్రార్కస్థాయిగాఁ బాలింపజేయు"మని వర్తమాన మంపెను. జగ్గరాజావృత్తాంత మువిని తాను వేయికనులతోఁ జూచుచున్నను శత్రుశేషము మిగిలినందులకుఁ జాల విచారపడి యాచశూరుఁడాబాలు నెటు లేని జంద్రగిరిరాజ్యప్రభువును జేయుకమానఁడని తలంచి యు ద్ధప్రయత్నములు మానుమనియు సంధి గావించుకొందమనియు రాయబారములు పంపెను. యాచశూరుఁడు సంధికియ్యకొనన నియుఁ జంద్రగిరి సామ్రాజ్యము నిలువఁబెట్టుటయో చేతగా కున్న నశించుటయో కర్తవ్యమనియు రాజద్రోహులకు రాజభ క్తులకు సంధికనుకూలమార్గములు లేవని వర్తమానముచేసెను.

జగ్గరాజుపక్షమువారు చాలమందిధర్మపక్షమగు యాచశూరుని వైపు చేరిరి. సైన్యసహాయమున యాచశూరుఁడు చంద్రగిరి దుర్గము నొక్కుమ్మడి ముట్టడించెను. జగ్గరాయఁడు కొంతవఱకుఁ బోరాడి పరాజయసూచనలఁగాంచి పటకుటీరమును వదలి రాజప్రాసాదమునకుఁ బారిపోయెను. పట్టు వదలక యేఁబదివేల సైనికులను సమకూర్చుకొని యాచశూరవతంసుఁడు జంద్రగిరిని రెండు సంవత్సరము లెడతెగక ముట్టడించెను. జగ్గరాజు పదునేనువేల సైనికులతోఁ గొంత కాలము ముట్టడికి నాగి రాయబారమునకు మరలఁ బ్రయత్నించెను. యాచశూరుఁడు రాయబారులఁ దిరస్కరించి చంద్రగిరి దుర్గమును లోఁగొనెను. జగ్గరాజీ సంరంభమును జూచి పారిపోయెను. యాచశూరుఁడు రాజమందిరమునఁ బ్రవేశించి కోటను స్వాధీనపఱచికొని విశ్వసనీయులగు సైనికులకు నుద్యోగముల నొసంగి పూర్వవస్తువు లన్నింటిని బయటికిఁ దీయించి సామంత పౌరసమక్షమున శ్రీరంగరాయల పుత్త్రుఁడగు రామరాయ భూవిభునకుఁ జంద్రగిరి రాజ్యము పట్టాభిషేకము గావించెను. పౌరులందఱును యాచశూరుని ధర్మపరతంత్రబుద్ధికిని స్వామిభక్తికిని సంతసించి చంద్రగిరి రాజ్యమునకు మంత్రిగ నుండుమని ప్రార్థించిరి. కాని తన కర్తవ్యము నిర్వహింపఁబడినదని యాచశూరుఁడు తెలిపి తన రాజ్యమునకు నేఁగెను. పూర్వప్రభు వంశజుఁడగు రామరాజు

తమకుఁ బరిపాలకుండైనందులకు జగ్గరాజు దుష్టపరిపాలన మంతరించినందులకుఁ బ్రజలు సంతసించి రాజ్యమునఁ జిరకాలము మహోత్సవము లొనరించి తమయానందముఁ బ్రకటించిరి.

ఈ యాచశూరుని విజయము క్రీ. శ. ౧౬౧౭ లోనిదని చరిత్రకారుల విశ్వాసము. ఈ కథాంశమును న్యాయలు దొరవారు విజయనగర చరిత్రమునందు వ్రాసియున్నారు. దేశీయచరిత్రముల శోధించి వ్రాయఁబడిన దగుటచే నీకథ విశ్వసనీయమనక తప్పదు. తనప్రభునివంశమును నిలువఁబెట్టుటలో నెన్నియో కష్టములకోర్చి స్వామిభక్తి ప్రకటించిన వీరశిరోమణియగు యాచనాయకునకు ఆంధ్రవీరులు "రామరాజ రాజ్యస్థాపనాచార్య" బిరుదము నొసంగి తమశాశ్వత కృతజ్ఞతను బ్రకటించిరి. యాచశూరుని శూరత్వమును దామెర వేంగడపతి యిట్లు వర్ణించినాఁడు.

సీ॥ ఉత్తరమల్లూరియొద్ద దావల పావ
విభుసిఁ గొట్టిన నాఁటి విజయకలన
తిరుమలఁ జేరి ధాత్రిని మన్నరాజులఁ
బాఱఁదోలిన నాఁటి బాహుబలము
చెంగలుపట్టు వీక్షించి లగ్గలుపట్టి
యాక్రమించిన నాఁటివిక్రమంబు
పాలెముకోట విల్వల నాజి యతిరాజు
జరుగఁజేసిన నాఁటి శౌర్యపటిమ

తే. గీ. మున్ను తోపూరు జగ్గరాణ్ముఖుల గెల్చి
మధురదొర చెంజిమన్నీని మదమడంచి
తిరుచినాపల్లి దొరఁదోలు తేజముగల
మేటి వెలుగోటి యాచనిసాటి గలఁడె!

(బహులాశ్వచరిత్రము.)

# అక్కన్న మాదన్న మంత్రులు.

చిరకాలమునుండి మన మక్కన మాదన్న యనుజంట నామము లాలకించుచున్నారము. ఈ మంత్రివర్యుల జీవితములు సమగ్రముగాఁ దెలిసికొనుట కాధారములు చాలినన్ని లేవు. సుప్రసిద్ధులగు నాంధ్రుల నాంధ్రేతరుల తమవారని చెప్పుకొనుట సహజముగాని వీరిని మహారాష్ట్రులని కొంద అనుచున్నారు. ఇది విశ్వసనీయము కాదు. వీరలాంధ్రులనుట కె యవకాశము లెక్కుడు కలవు.

అక్కన్న మాదన్నలలో మాదన్నగారె సర్వతంత్ర స్వతంత్రుఁడు, సమర్థుడును, నున్నతస్థితియం దున్నవాఁడునని తెలియుచున్నది. అక్కన్నమాదన్నగారలకుగల బాంధవ్యా దికములు నిర్ణయింప వీలు కలుగదు. వీరినిగూర్చి యొక చిత

శథ, వాడుకలో నున్నది. అందు సత్యమెంతయున్నను వినుటకు మాత్రము యుక్తియుక్తముగ నున్నది.

మాదన్నమంత్రి దానకర్ణుఁడై యహోరాత్రములు లేదనకుండఁ దనగృహమున బ్రాహ్మణజనమునకు సత్రముఁ బెట్టుచుండువాఁడట. ఆసత్రములోఁ జిరకాలమునుండి యక్కన్న భుజించుచుఁ గాలక్షేపముఁ జేయుచుండెను. అక్కన్నగారు సత్రమువారందఱితోఁ గూడ దాను మాదన్నగారికి సోదరుఁడనని చెప్పఁవాఁడు. దానురాను సత్రమువారెకాక మాదన్న గారి భార్యస్ైతము గౌరవముగా నక్కన్నగారిని దిలకించుచు భోజనాదికములలో శ్రద్ధవహించుచుండెను. ఒకనాడుమాదన్న గారి భార్య భర్తతో మంతనము నాడుచు "మీసహోదరుఁడు చాలకాలమునుండి సత్రములో భుజించుచు దిక్కుమాలిన వానివలెనుండఁ జూచుచుండెదరేమి? సంస్థానములో నుద్యోగము నిప్పింపరాదా!" యని ప్రశ్నించెను. మాదన్న నివ్వెఱపోయి "సోదరుఁ డెవరు నేనెఱుఁగనే!" యనెను. అంత నాతని ధర్మపత్ని "మనసత్రములో భుజించుచున్న యక్కన్నగారు మీసహోదరుఁడని నేనాతనిముఖమున వినియున్నాను. మీ రెఱుఁగనటుల భాషింతురేల?" యనెను. మాదన్న ఆశ్చర్యపడి వెంటనే పరిచారకునిచే నక్కన్నగారిని పిలిపించి యుచితాసనముఁ జూపించి కూర్చుండఁజేసి "మిత్ర మా? నీవెవ్వఁడవు నీనివాసమెద్ది? నీకు నాకుఁగల బాంధవ్యమే

దియొ తెలుపు" మని యడిగెను. అక్కన్న మిగుల వినయముతో మాదన్ననుజూచి 'నన్ను నీవె ఱుంగక పోవచ్చును. నేను పెద్దమ్మకుమారుఁడను, నీవు చిన్నమ్మకుమారుఁడవు. కావున మన మిరువురము సహోదరులము. ఇది నీకును నాకును మాత్రమె తెలియఁదగిన యంశము. నాయందింకముందుఁ గూడ నిటులె భ్రాతృగౌరవ ముంచవలయు' ననెను. నాఁటఁగోలె మాదన్నయు నాతని ధర్మపత్నియు నక్కన్నగారిని మిగుల దయతోఁ దిలకించుచు నింటనేయుంచి యాదరింపసాగిరఁట. ఈకథలోని సత్యాసత్యములను విచారింపఁ బూనుట ప్రకృతము కాదు.

అబూహసన్ కుతుబ్ షాయనునామాంతరముగల తానీషానామము మనము రామదాసుచరిత్రము పఠించిననాటనుండి వినుచునె యున్నారము. తానీషా మిగుల పరాక్రమశాలియై హిందూ మహమ్మదీయుల నైకమత్యముగఁ బాలించుచు గోలకొండ ముఖ్యస్థానముగఁ జేసికొని చిరకాలము రాజ్యమును బరిపాలించెను. ఇతనియొద్దనె మాదన్నముఖ్యమంత్రియై రాజ్యాంగములను నిర్వహించుచుండెను. అక్కన్న మాదన్నగార లిరువురు సహోదరులనియుఁ బింగళియను నింటిపేరు గలవారనియు, భారద్వాజస గోత్రులనియుఁ దద్వంశీయులు చెప్పుచున్నారు. అక్కన్న మాదన్నగారల మేనల్లుఁడని మనము వినుచున్న కంచెర్ల గోపమంత్రియను రామదాసు సైతము నియోగియు, నాంధ్రుఁడు కావున నక్కన్న మాదన్నగారలు నాంధ్రులా,

కారాఁ యనుచు విచారింపనవసరము లేదు. అక్కన్న మాదన్న యను నామము లాంధ్రులలోఁ గానవచ్చుటవలనను చిరకాల మాంధ్రదేశమునందె వీరుంటవలనను నాంధ్రులతో బాంధవ్యము గానవచ్చుటవలనను వీరల నాంధ్రులనియె విశ్వసించి తీఱవలయును.

తానీషాయొద్ద మాదన్నగారింతయనరాని గౌరవముతో మంత్రిపదవి నిర్వహించుచుండిరి. అక్కన్నగారు తానీషాయొద్ద సర్వసైన్యాధ్యక్షుఁడై రాజ్యక్షేమమునకై యావచ్ఛక్తి వినియోగించుచుండెను. మాదన్నగారు హిందూమహమ్మదీయుల కైకమత్యము ఘటించుచు భిన్నాభిప్రాయములఁ బాఱఁదోలుచు మిగుల జాగరూకతతో రాజ్యస్థితిగతుల నరయుచు రాజ్యపరిపాలనము గావించుచుండెను. అన్యశ్రేయమునకు సహింపని కొందఱు దుర్మార్గమున కొడిగట్టి యక్కన్న మాదన్నగారికి మహమ్మదీయ జాతికి భిన్నాభిప్రాయమున గల్గింప నారంభించిరి. అట్టివారిలో మహమ్మద్ ఇబ్రహీం అనువాఁ డొకఁడు. ఇబ్రహీం తానీషాయొద్ద సర్వసైన్యాయకుఁడుగ నుండి దుర్మార్గము లనేకములు గావించుచుండె నాతనిఁ దొలంగించి మాదన్నగారాస్థలమున నక్కన్నగారిఁ జేర్చిరి. అది మొదల నక్కన్నగారి యొక్కయు మాదన్నగారి యొక్కయు మారణమునకు ఇబ్రాహీము తన యావచ్ఛక్తి వినియోగించుచుండెను. తానీషాయొద్ద నుచితముగు గౌర

భావము ప్రజలయొద్ద భక్తి విశ్వాసములు గల యీమంత్రి వర్యుల నేవిధముగ నేని వంచింపనెంచి తరుణముకొఱకు వేచి యుండెను. అక్కనమాదన లాతని లక్ష్యపెట్టరైరి.

మొగలురాజు లెటులైన గోలకొండరాజ్యము హరింపఁ దీవ్రయత్నములు కావింపసాగిరి. ఔరంగజేబు మిగులనాసక్తితో గోలకొండ రాజ్యముకొఱకు గుటుకలు మ్రింగుచుండెను. అక్కన్న మాదన్నగార లీయంశము గ్రహించి రాజ్యములోని హిందూమహమ్మదీయుల కైకమత్య మభివృద్ధిఁగావించి యాకాలమున బలవంతుఁడైయున్న శివాజీచక్రవర్తితో దానీషాకు స్నేహము కుదిర్చిరి. శివాజి గోలకొండ కొకమారువచ్చి తానీషా యొసంగిన యాతిథ్యము స్వీకరించి గోలకొండ రాజ్యము సురక్షితముగఁ జేయుదునని వాగ్దానము గావించెను. శివాజీ కాలధర్మము నొందిన పిమ్మట శంభాజి రాజ్యమునకు వచ్చెను. అక్కన్న మాదన్నగారలు పూర్వము వలెనే శంభాజికిఁ దానీషాకు నైకమత్యము గుదిర్చిరి.

రాజ్యతృష్ణగల ఢిల్లీశ్వరుఁడగు నౌరంగజేబు గోలకొండ రాజ్యము హరింపవలయునని పలుమాఱు సైన్యమును బంపెను. అక్కన్న మాదన్నగారలు యవనాంధ్ర సైన్యముల నెదుర నడిపి యౌరంగజేబు సైన్యముల వినాశము గావించిరి. అవమాన పీడితుఁడగు నౌరంగజీ బంతతో నాయత్నము మానుకొనక గోలకొండ రాజ్యముకొఱకు దురాలోచనములు పెక్కు చేయుచుండెను.

ఆకాలమున ఈస్టుఇండియా కంపెనీవారు హిందూదేశమునఁబ్రవేశించి మదరాసు, మచిలీపట్టణము లోనగుచోటుల చిన్న చిన్న కొట్లు పెట్టి వ్యాపారము జేయుచుండిరి. ఔరంగజేబునకుఁ గంపెనీవారికి నభిప్రాయము భేదించుటచే వారికి నిలువనీడ దొరకదయ్యెను. అపుడు కంపెనీవారు గోలకొండ రాజ్యము సర్వాధికారములతోఁ బరిపాలించుచున్న యక్కన్నమాదన్నల నాశ్రయించి సముద్రతీర ప్రాంతములను గాలునకుఁ బుచ్చుకొని వ్యాపారముఁ జేయ నిశ్చయించి యుపాయాంతరము నన్వేషింప సాగిరి. గోలకొండ రాజ్యమున కంతటికి సుబేదారుగా నున్న పగడాల లింగప్ప యను నొకసరదారు శేవులలోఁ గంపెనీవారి సామానులు దిగకుండ నాటంకపఱచి కంపెనీవారి విజృంభణము నంతయు దుదముట్టింప సిద్ధపడెను. కంపెనీవా రక్కన్న మాదగారలతో స్నేహము సంపాదించుకొని పగడాల లింగప్పవలఁ దమకుఁ గలుగుచున్న చిక్కులన్నియు నివేదించిరి. అక్కన్న మాదన్నగారలు పగడాలలింగప్పకు నొకజాబువ్రాసి లింగప్ప యాజాబు నందలి "కంపెనీవారి వ్యాపారమునకు నాటంకము గలుగనీయకుము" అను వాక్యముజూచి యెపటికిఁ జేయునదిలేక యూరకుండెను. కంపెనీవారు వ్యాపారవ సైనికబలము వృద్ధిచేయుట జూచి లింగప్ప అక్కన్న మాదన గారలకుఁ దెలిపి కంపెనీవారు కొలఁదికాలములో స్వతం

రాజ్యము స్థాపించి మనకపాయము గలిగింతురని తెల్పెను. అక్కన్న మాదన్న లామాటలువిని యందలి సత్యము విచారించి తెలిసికొని గాని తొందరపడరాదని వారి యత్నము లరయుచుండిరి.

పగడాల లింగప్పయే అక్కన్న మాదన్న గారలకుఁ దమకు భిన్నాభిప్రాయము కలుగఁజేసెనని తలంచి కంపెనీ వారు గోలకొండకేఁగి అక్కన్న మాదన్నను సందర్శించి తాము సేనలను వృద్ధిచేయుచున్నది ఆత్మసంరక్షణముకె గాని దేశము నార్జించుటకుఁ గాదనియు తమ పని వర్తకముమాత్రమె యని నివేదించిరి. ఇంతలో మాదన్నగారి తనయుఁడగు మల్లప్పయను వాని యుపనయనము సమీపించెను. అది గ్రహించి కంపెనీవారు మాదన్నగారి కొక పీసెబరువుగల బంగారు గొలుసు, నాలుగువందల వరహాలు అనేకామూల్యము లగు పట్టు వస్త్రములు బహుమానముగా నొసంగిరి. అంతతోఁ బోక మాదన్నగారి పేష్కారునకుఁ గొంతధనము మాదన్నగారి పినతండ్రిగారికిఁ గొంత రొక్కము నొసంగి యందఱ సంతృప్తి పఱచిరి. మాదన్నగారు కంపెనీవారు ధర్మవర్తనులనియు విధేయులనియుఁ గేవల వ్యాపారులనియుఁ దలంచి యెవరివలన నెట్టి యాటంకములు లేకుండ రేవులలో వ్యాపారవస్తువులు దిగుమతిచేయించికొని విక్రయించి కొనుటకు ఖండాంతరములనుండి వ్యాపారమునకు వచ్చు నితర వర్త

కులను వెడలఁగొట్టుటకు నంగీకరించెను. దీనితో ఈస్టిండియా కంపెనీవారు వ్యాపారము వృద్ధిచేసికొని స్వతంత్రులగుట కవకాశము చిక్కెను.

తానీషయు నక్కన్న మాదన్నగారలు చేయు ధర్మపరిపాలనము విప్లవకారులగు కొందఱకు మిగుల కష్టతరముగ నుండెను. అట్టివారిలోఁ బూర్వము సైన్యాధ్యక్షుఁడుగ నుండి స్థానభ్రష్టుఁడైన మహమ్మద్ ఇబ్రహీం ఒకఁడు. ఇతఁడుకొంత పలుకుఁబడి కలవాఁడగుటచేఁ దీవ్రముగఁ బ్రయత్నముఁ జేసి యక్కన్న మాదన్నగారలయందు మహమ్మదీయజాతికంతకు ద్వేషము పుట్టించెను. విడిగనున్న నీతనివలన విప్లవమువచ్చునని తానీషా మహమ్మదు ఇబ్రహీమునకు సేనానాయక పదవి మాత్రము మొసంగి వానిని జాగరూకతతోఁ దిలకించుచుండెను.

మాదన్నగారు మిగులనాచారపరాయణుఁడు. ప్రతిదినముదయమునఁ బ్రాతఃకాలకృత్యములఁ దీర్చుకొని చాలసేపు శివపూజ గావించి యనేక బ్రాహ్మణుల నాహ్వానించి వారి పంక్తిని భుజించి రాజకీయ కార్యములు నిర్వహించువాఁడు. మాదన్న త్యాగశీలుఁడు. పండితపక్షపాతి. సర్వకాల సర్వావస్థలయందు విద్వత్సహవాసముఁ గావించుటచే నీతనికి గొప్ప పాండిత్యము కూడ నలవడెను. మాదన్నగారు తమ యుపవనములోని సరోవరమున స్నానము గావించుచుండ నిబ్రహీంచేఁ బ్రేరేపితుఁడై వచ్చి యొకతురుష్కుఁ డాకొలనిలో మునిఁగెను.

మాదన్నగారా తురుష్కుని సాహసమునకు మిగులఁ గోపించి వెంటనే యాతని శిక్షించిరి. దుర్మార్గుఁడగు నాయవనుఁడు దేహమునిండ గాయములుగావించుకొని పురములోనిమహమ్మదీయు లందఱకుఁజూపి మాదన్నగారి దుర్మార్గమును వేయివిధముల నుగ్గడించెను. మాదన్నగారి విషయమై తానీషాకుఁదెల్పినను లాభములేదని మహమ్మదీయు లందఱు నిశ్చయించి బ్రాహ్మణ మంత్రులచేఁ దానీషా చేయించు దుండగములలో నిదియొకటిగ ఢిల్లీశ్వరునకు నివేదింపుమని వానినిబ్రోత్సహించి ంపిరి. వెంటనేవాఁడు బయలువెడలి కొన్నిదినములకు ఢిల్లీకిఁ యౌరంగజీబును సందర్శించి తానొందిన దురవస్థయుఁ దా నాయొక్క యధర్మపరిపాలనము, అక్కన్నమాదన్నలయవినీతి ను, నంశములగూర్చి లేనిపోనివి చాలసేపు ఘోషించెను. ాలకాలమునుండి గోలకొండ రాజ్యముకొఱకు ప్రయత్నము ియుచు విఫలమనోరథుఁడగుచున్న యౌరంగజేబు గోలకొండ రాజ్యములోని సైనికుల యంతరంగము, రాజద్వేషము నాయవనులవలన సాకల్యముగ విని యిదియె తరుణమని తన కుమారుఁడగు మువాజ్జం అనువాని కమితమగు సైన్యము నొసంగిపంపెను.

తానీషా, మువాజ్జం గోలకొండ రాజ్యమును ముట్ట ంప వచ్చుచున్నాఁడని విని మార్గమధ్యమునఁ బ్రతిఘటించు కై తనబలములో సగము నొసంగి మహమ్మద్ ఇబ్రహీం

ను బంపి మిగిలిన సగము సైన్యము నక్కన్నగారి యాధీనము
వించి గోలకొండ దుర్గమును రక్షింప నియోగించెను.
క్కన్న మాదన్నగారల సంతము నొందింప వలయుననియు
నీషాను రాజ్యమునుండి తొలగింప వలయుననియుఁ, దలం
న వాఁడగుటచే నౌరంగజేబుచేఁ బంపఁబడిన మువాజ్జం
జహా అను వారితో మహమ్మదు ఇబ్రిహీం కలిసి
వారిని గోలకొండ దుర్గమునొద్దకుఁ గొనివచ్చెను. ప్రత్యర్థుల
సైన్యమంతయు నమితోత్సాహముతో హైదరాబాదునకు
సమీపములోనికి వచ్చెను. తానీషా, మహమ్మద్ ఇబ్రిహీ
మొనర్చిన దుర్మార్గము నంతయు నాలకించి యపజయము
నిశ్చయమని భావించి సైనికుల శక్తియున్నవఱకుఁ బోరుమని
నియోగించి తాను ప్రాణభీతిచే దుర్గములోనికేఁగి దుర్గ
ద్వారము లన్నియు మూయించి యఱచేతిలోఁ బ్రాణములు
పెట్టుకొనియుండెను.

మువాజ్జం సైన్యము స్వేచ్ఛగా గోలకొండదుర్గములో
నికిఁ గనుగందకుండఁ బ్రవేశించి ధనవంతుల గృహములదోఁచి
స్త్రీలఁజెఱబట్టి యనేక దురంతములుగావించిరి. ఈదుర్మార్గమ
లన్నియు స్వామిద్రోహియగు మహమ్మదుఇబ్రిహీము దగ్గఱ
నుండి చేయించెను. రాజమందిరములోఁబ్రవేశించి తానీషాన
అంతఃపురకాంతలను జెఱబట్టఁదలంచిరిగాని యప్పటికి సాయ
కాల మగుటచేఁ గోటభేదించుటకుఁ బొద్దుచాలదని యాఁప్రియ

త్నము మఱునాఁటి యుదయమున జరుపవలయునని నిశ్చయిం చుకొని శిబిరములకు జేరిరి.

ఈ సంగ్రామమునకు ముఖ్యముగ బ్రాహ్మణు లగు నక్కన మాదనగారలు మంత్రులుగ నుండుటయే కారణమని పరిజనులవలన విని యంతఃపుర కాంతలు వీరభటులను దానిషా కుఁదెలియకుండ హంతకులఁ బిల్పించి వారి కనేకభూషణముల నొసంగి యక్కన్న మాదన్నగారల వధించి వారితలలఁ గొనిర మ్మని యాజ్ఞాపించిరి. హంతకులు క్రోధవలుగాఁచి దాక్షిణ్యశూ న్యులై సద్దోషులగు నక్కన్న మాదన్నగారల రాజద్వారము ముందుఁ దునిమి యుత్తమాంగ లంతఃపురమునకుఁ జేర్చిరి. వెంటనే యంతఃపుర కాంతలు ఖండితశిరస్సుల నొక వెండిపళ్లెరము లోనుంచి మువాజముగొదకుఁ బంపిరి. అక్కన్న మాదన్నలు వధింపఁబడఁగనే వీరావేశముతో మహామ్మదీయు లందఱు విజృంభించి గోలకొండలోనున్న బ్రాహ్మణుల నందఱను జెండాడి రక్తప్రవాహములచే దుర్గమంతయుఁ గలుషితము గావించిరి. తానీషా మంత్రివర్యులయొక్కయు బ్రాహ్మణుల యొక్కయు దుర్మరణమునకు విచారమునొంది చేయునదిలేక రెండుకోటుల రూపాయ లపరాధము నొసంగి మువాజంతో సంధి గావించుకొనెను. మువాజంసైనికు లాసంగ్రామములో గోలకొండనగరములో నాలుగైదు కోటులకుఁ బైఁగా ధన ము దోఁచికొనిరి.

౧౬౮౭ సంవత్సరములో నౌరంగజేబు సేనలతో గుల్బర్గాకుఁ బోవుచున్నటులఁ బ్రయాణమై యాకస్మికముగ గోలకొండను ముట్టడించెను. తానీషా తనబలమునంతయు వినియోగించి యెనిమిదిమాసములు పోరాడి యోడిపోయెను. ఔరంగజేబు తానీషాను బంధించి ౧౬౮౭లో దేవగిరిదుర్గముమీఁదఁ జెఱఁబెట్టెను. అతఁడా కారాగృహమునందె మరణించెను.

అక్కన్న మాదన్నగారలు తానీషా సామ్రాజ్యమున క్రీ. శ. ౧౬౭౪ మొదలుకొని ౧౬౮౭ వఱకుండియుందురు. స్వామిభక్తిపరాయణులు సత్యప్రియులు నగు నీయాంధ్రమంత్రివర్యులకారణముగ జాతిద్వేషపరాయణులచే వధింపఁబడిరి. అక్కన్నమాదన్నలతో గోలకొండరాజ్యమంతరించెను. గోలకొండరాజ్య మహైశ్వర్యములతో నుంటకు నక్కన మాదన్నగారలు వినాశముగుటకు మహాత్ముఁడు ఇబ్రహీము కారకుఁడు. అక్కన్న మాదన్నలు మరణించినను వారి చరిత్రము భారతజాతి యున్నంతవరకు సజీవముగ నుండఁ గలదు. అక్కన్న మాదన్న రచ్చసావడులు బెజవాడ కనకదుర్గాలయ సమీపమునను కారలసాములు ప్రదేశము నందిగామ సమీపమున మునియేటియొడ్డునను నేఁటికి దర్శనీయములుగనున్నవి. అక్కన్న మాదన్నలు ధర్మసంస్థాపకులు. హిందూ మహమ్మదీయ సమ్మేళనమునకు వారు పాటుపడి దేశమాతకు బలియొసంగఁ బడిరి. వారు నాఁడు నాటిన బీజము యిప్పటికి

మహావృక్షమై దుర్భేదమై ఫలవంతమైనది. మహాత్ముల చరితములలోని ధర్మ రహస్యముల గ్రహించుటకు దివ్యదృష్టి కావలెననుట కీ యక్కన్న మాదన్నల చరిత్రమే ప్రమాణము. భద్రాచల రామదాసను పరమభక్తుని పవిత్ర చరిత్రము ఎఱుంగని యాంధ్రుఁడు లేఁడు. రామదాసు మొదటి పేరు గోపన్న. ఈయన అక్కన్న మాదన్నలకు మేనల్లుఁడై యుఁ దానీషాకుఁ జెందవలసిన ధనమును జేర్పక హరించుటచేఁ జెఱసాలలో నుంచిరనియు నీయన భద్రాచలమున దాసీలుదారుగా నున్నప్పుడు రామాలయము గట్టించెననియు మనము వినియున్నారము. రామదాసువంటి భక్తునకు మేనమామయగుట గూడ అక్కన్న మాదన్నల ప్రశస్తి కొక సాధనము.

సంపూర్ణము.